: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
గుంటూరు
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

1-9-2026
మంగళవారం
సంపుటి: 32
సంచిక: 213
పేజీలు: 12
వెల: 6.50



సోమవారం వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, దుర్గేష్, ఆనం తదితరులు

## మూడు దశాబ్దాల కల సాకారం

**నల్లమల కొండలను చీల్చుకొని కృష్ణమ్మ పరుగులు**

**మొదటి దశలో లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు**

**2028 నాటికి వెలిగొండ రెండవ దశ పనులు పూర్తి**

**కరవుసీమకు జలహారతితో సిఎం చంద్రబాబు వెలిగొండకు ప్రారంభోత్సవం**

# అభివృద్ధి కొండ 'వెలిగొండ'

**మార్కాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు దశాబ్దాల సంకల్పం నెరవేరింది.. కరవు నేలపై కృష్ణమ్మను పారించాలన్న ఆకాంక్ష నెరవేరడం నా అదృష్టంగా భావిస్తున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా గంటవానిపల్లె వద్ద కృష్ణమ్మకు హారతి ఇచ్చి ప్రజల హర్షధ్వానాల మధ్య వెలిగొండ ప్రాజెక్టు జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేసి జాతికి అంకితం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైందన్నారు కరువు కాటకాలతో పాటు ఫ్లోరైడ్ సమస్యతో సతమతమవుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, సరిగ్గా 30 యేళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు.ఆ రోజు చేసిన సంకల్పం. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారిందన్నారు. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకువెళ్లాం. కరువునేలకు కృష్ణమ్మను తీసుకొచ్చామన్నారు. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ మార్కాపురం చెన్నకేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోందని ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జలసిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగిందని, వెలిగొండ బంగారు కొండగా మారి ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు,

>>2


సోమవారం మార్కాపురంజిల్లా గంటవానిపాలెంవద్ద కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న సిఎం చంద్రబాబు

## 2028లో కృష్ణా పుష్కరాలు నల్లమల సాగర్‌లో జరుపుతాం - సిఎం చంద్రబాబు

**మార్కాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త ప్రతినిధి:** 1996 మార్చి 5వ తేదీన వెలిగొండ ప్రాజెక్టుకు పునాది వేసిన నేను తిరిగి మూడు దశాబ్దాల తర్వాత ప్రారంభోత్సవం చేయడం అదృష్టంగా భావిస్తున్నాని సిఎం చంద్రబాబుఅన్నారు. వెలిగొండప్రాజెక్టు బంగారు కొండగా ప్రజల జీవితాలను మార్చేస్తుందన్నారు. 30 యేళ్ల కల సాకారం కావడానికి ఎన్నోసవాళ్లను సమస్యలను ఎదుర్కోవడం జరిగిందన్నారు. డ్యాములు పూర్తి చేయడంతో పాటు సొరంగ మార్గాల పనులను పూర్తి చేసి 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నీళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. నల్లమల కొండలను చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు తీస్తుంటే ఆనందంగా ఉందన్నారు. తొలి దశలో 1.19లక్షల ఎకరాలకు సాగునీరు.4 లక్షల మందికి తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. 2028లో రెండోదశ పూర్తి నాలుగు జిల్లాల్లోని నాలుగులక్షల 37,ఎకరాలకు సాగు నీరు 23లక్షల మందికి తాగునీరు అందిస్తామన్నారు. 2028లో జరిగే కృష్ణాపుష్కరాలుకూడా మార్కాపురం జిల్లాలో నల్లమలసాగర్‌రిజర్వాయర్‌లో ఆనందోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.

**కరవుసీమ భవిష్యత్తు మార్చే చారిత్రక ఘట్టం - మంత్రి అచ్చెన్నాయుడు** 3లో

**రైతులకు అండగా వెలిగొండ ప్రాజెక్టు - డి.సిఎం పవన్ కల్యాణ్** 3లో

**లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సజీవ దహనం** 10

## నేపాల్ విషాదం: 900 దాటిన వరద మృతులు

**ఇంకా ఆచూకీ దొరకని 4,200 మంది**

**కాఠ్మాండు, ఆగస్టు 31:** నేపాల్ జల ప్రళయంలో మృతుల సంఖ్య 900 దాటింది. నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఆర్‌ఆర్‌ఎంఎ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 903 మృతదేహాలను వెలికితీశారు. నదీ తీరాల్లో కొట్టుకొచ్చిన మృతదేహాలతో విపత్తు తీవ్రత స్పష్టమవుతోంది. ఈ విపత్తులో అత్యధికంగా దక్షి ణ చిత్వాన్ జిల్లాలో 272 మృతదేహాలు లభ్యమయ్యాయి. పెద్ద సంఖ్యలో లభిస్తున్న మృతదేహాలను నిర్వహించడం అధికారు లకు పెను సవాలుగా మారింది. వ్యాధులు ప్రబల కుండా నివారించేందుకు, కాళీ గండకి, త్రిశూలి నదుల సంగమ స్థలమైన దేవఘాట్‌లో చాలా మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు. భవిష్యత్తులో గుర్తింపు ప్రక్రియ కోసం,

>>2


సోమవారం కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఎస్‌సిఒ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ

# ఇక చాలు, ముగించండి

**● యుద్ధం మానవాళిని వెనక్కి నెడుతోంది ● ముగింపు పలకాల్సిన సమయమొచ్చింది ● రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోడీ ● షాంఘై సహకార సదస్సు వేదికగా భేటీ ● భారత్ శాంతివైపు ఉంటుందని స్పష్టీకరణ**

**మరోమారు ఒకే కారులో మోడీ-పుతిన్ ప్రయాణం**

**బిష్కెక్ (కిర్గిజ్‌స్థాన్), ఆగస్టు 31:** కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న వార్షిక 'షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు' వేదికగా సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలు, ఉక్రెయిన్‌లోని సంఘర్షణపై చర్చలుజరిపారు."అంతులేని యుద్ధం నుండి యుద్ధ ముగింపు దిశగా పయనించాలని" రష్యా నాయకుడిని కోరారు. వార్షిక బ్రిక్స్ సదస్సు కోసం రష్యా అధ్యక్షుడు భారతదేశానికి రానున్న కొద్ది రోజుల ముందు ఈ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసందర్భంగా ఇరువురు నేతలు తొలుత ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం భారత్ రష్యా సంబంధాలు, ఉక్రెయిన్ సంక్షోభం సహా పలు అంతర్జాతీయ అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలోనే పుతిన్‌తో భేటీలో ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి భారత్ వైఖరిని వివరించారు మోడీ. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి శాంతి వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. "యుద్ధంలో గడిపే ప్రతి రోజూ మానవాళిని వెనక్కి నెడుతోంది. అదే శాంతి దిశగా వేసే ప్రతి అడుగు మానవాళిలో కొత్త ఆశ, ఉత్సాహాన్ని నింపుతుంది. అంతులేని యుద్ధం నుంచి బయటపడి, యుద్ధానికి ముగింపు పలకాల్సిన సమయంవచ్చింది. మానవాళి సంక్షేమానికి ఇదెంతో అవసరం. అన్ని సమస్యలకు వీలైనంత త్వరగా శాంతియుత పరిష్కారంకనుగొనాలన్నది మానవాళి పిలుపు, ఇదే భారతదేశ సందేశం" అని ఆయన అన్నారు. "గాంధీ గడ్డ, బుద్ధుని గడ్డ ఒకే సందేశాన్ని పంచుకుంటున్నాయి. అదే శాంతి మార్గం' అని పుతిన్‌కు ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అనంతరం బ్రిక్స్ సదస్సు కోసం పుతిన్ త్వరలో జరగనున్న భారత పర్యటన గురించి కూడా ఇద్దరు నేతలు చర్చించారు. "కొన్ని రోజుల్లో భారతదేశం బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వబోతోంది. మీకు, మీ ప్రతినిధి బృందానికి స్వాగతం పలకడానికి భారతీయులందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మీ పర్యటన మన ద్వైపాక్షి క సంబం ధాలను బలోపేతం చేయడంతో పాటు, బ్రిక్స్ చట్రంలో చర్చలు, సహకారాన్ని మరింత పటిష్టం చేస్తుంది" అని మోడీ అన్నారు. భారత్- రష్యా

>>2

## ఎపి లిక్కర్ కేసు

### రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి 'సుప్రీం' నోటీసులు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం రవాణా కేసులో రాజ్ కసిరెడ్డి, డి. వాసుదేవరెడ్డిల అరెస్టుల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ కేసులో సిట్ దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. రాజ్ కసరెడ్డి, డి. వాసుదేవరెడ్డిల అరెస్టులకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇద్దరికీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదన్న కారణంతో గతంలో ఎపి హైకోర్టు కీలకఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సిజెఐ ధర్మాసనం.. రాజ్ కసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుపై ప్రభుత్వ అభ్యంతరాలను పరిశీలించిన ధర్మాసనం.. తదుపరి విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణలో ఈ కేసుకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు మరింతగా పరిశీ

>>2

## ఢిల్లీలో మరో 'నిర్భయ' ఘోరం

### కదులుతున్న బస్సులో బాలికపై గ్యాంగ్ రేప్

**లిఫ్ట్ అడిగితే బస్సులోకి ఎక్కించుకుని అఘాయిత్యం**

**ఆలస్యంగా వెలుగుచూసిన దుర్ఘటన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నిర్భయ ఘటనను గుర్తు చేసేలా మరో దారుణం గ్రేటర్‌నోయిడాలో చోటు చేసుకుంది. కదులుతున్న బస్సులో 16యేళ్ల బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్టు 4న జరిగిన ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వివరాలు తాజాగా వెలుగుచూశాయి. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి ప్రాంతానికి చెందిన 16యేళ్ల బాలిక, చదువు విషయంలో తల్లి మందలించడంతో ఇంట్లో చెప్పకుండా నోయిడాలోని తన బంధు

>>2


మచిలీపట్నంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

## బందరు అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

**విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మచిలీపట్టణాన్ని మారుస్తాం**

**చంద్రబాబు చిత్తశుద్ధికి వెలిగొండ ప్రాజెక్టు ప్రత్యక్ష నిదర్శనం: మంత్రి కొల్లు**

**విజయవాడ,ఆగస్టు31, ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నం నియోజకవర్గ 30 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విజన్ డాక్యుమెంట్ సిద్ధంచేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రెండున్నర సంవత్సరాలుగా సమస్యలన్నీ పరిష్కరించాం. ఈ రోజు 29 రాగా 21 పరిష్కరించాం. ఇప్పటి వరకు 505 గ్రీవెన్సులు రాగా 413 పరిష్కరించాం. మిగిలిన వాటినికూడా త్వరలోనే పరిష్కరిస్తాం. నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీటవేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపు అమలు చేశాం అన్నారు.

**వెలిగొండ ప్రాజెక్టు చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం**

1996లో నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన

>>2

# అద్వితీయ నేత రోశయ్య

**ఆయన విగ్రహం 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా నిలవాలి**

**రోశయ్య జీవిత చరిత్ర తెలిసేలా మ్యూజియం**

**విశాఖలో మాజీ సిఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్**

**విశాఖపట్నం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కొనియాడారు. విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్‌వద్ద ఏర్పాటుచేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని సోమవారం మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో లోకేష్ మాట్లాడుతూ రోశయ్యవిగ్రహాన్ని ..'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మన్'..గా పిలవాలని ప్రతిపాదించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్'గా నామకరణం చేసిన విధంగానే రోశయ్య విగ్రహం ఆయన రాజకీయ ఔన్నత్యానికి ప్రతీకగా నిలవాలని అన్నారు.క్రమశిక్షణ, నిజాయతీ, విషయ పరిజ్ఞానం, మాటల్లో మంచితనం, విమర్శల్లో పదును రోశయ్య ప్రత్యేకతలని లోకేష్ పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన

>>2


సోమవారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్

**విశాఖలో ఎఐజి హాస్పిటల్స్‌కు శంకుస్థాపన** 2లో



వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక మహిళలకు అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు



వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి హాజరైన అసంఖ్యాక అభిమానులు



రైతు చేత బటన్ నొక్కించి నీరు విడుదల చేస్తున్న సిఎం చంద్రబాబు

# అన్నా హజారే ఆరోగ్యం విషమం

## ముంబైలోని బాంబే ఆస్పత్రికి తరలింపు

## ఐసియులో ప్రత్యేక వైద్య చికిత్స

## పరిస్థితి విషమంగానే ఉందన్న వైద్యులు

**ముంబై, ఆగస్టు 31:** ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆరోగ్యం క్షీణించింది. స్వస్థలం రాలేగావ్ సిద్ధి గ్రామానికి సమీపంలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అన్నా హజారే ఆరోగ్యం విషమించ దంతో, ఆయనను హుటాహుటిన ముంబైకి తరలించి, బాంబే ఆసుపత్రిలోని ఐసియులో చేర్చారు. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్, తీవ్రమైన డీహైడ్రేషన్‌కు గురైన సీనియర్ గాంధేయ కార్యకర్తను తదుపరి వైద్య సంరక్షణ కోసం ముంబైకి తరలించారు. ఆయన ప్రస్తుతం డాక్టర్ గౌతమ్ భన్సాలీ పర్యవేక్షణలో ఉన్నారు. తదుపరి చికిత్సను నిర్ణయించడానికి బాంబే ఆసుపత్రి వైద్యులు హజారే పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అన్నాహజారే ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

# 'సుప్రీం' నోటీసులు

>> లించే అవకాశం ఉంది. వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తున్నా ఏమీ కనుగొనలేకపోయారని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవైపు కస్టడీ కావాలంటూనే, మరోవైపు పోలీసులు ప్రిపేర్ కాలేదనడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. సిట్ ప్రవర్తనను పరిశీలిస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను సిజెఐ ధర్మాసనం వాయిదా వేసింది.

## కారుమూరి సునీల్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితుడైన కారుమూరి సునీల్ రిమాండ్‌ను న్యాయస్థానం పొడిగించింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనను అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సునీల్ రిమాండ్‌ను సెప్టెంబర్ 11 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే పౌర సేవలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 31, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు మరింత మెరుగుపరచాలని, మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సిఎం సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమం, అభివృద్ధి ప్రజా భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలన్నారు.అది సంక్షేమ పథకమైన.ప్రాజెక్ట అయినా ప్రజల సహకారం అవసరమన్నారు. వెలిగొండ, అల్లూరి విమానాశ్రయ ప్రారంభోత్సవం లాంటి కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం పెద్దఎత్తున వచ్చిందన్నారు.,దీనిని ఇతర అంశాలకూ వర్తింప చేయాలని సిఎం సూచించారు. ప్రత్యేకించి మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా వివిధ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిఎం సూచించారు. మహిళలపై నేరాలు చేసేవారికి అదే చివరి రోజు అవుతుందన్నారు,.ఈ విషయాన్ని చాలా స్పష్టంగా పలు మార్లు చెప్పామన్నారు. నేరం చేసిన వారు తప్పించుకుని తిరగలేరన్నారు.ఈ విషయంలో ప్రజావగాహన అవసరమన్నారు.ఇటువంటి నేరాల విషయంలో పోలీసు చురుగ్గా వ్యవహరించాలన్నారు.ఆయా యాప్‌లు అందించే సమాచారంపై వెంటనే స్పందించాలన్నారు.ఇక ప్రజారోగ్యం విషయంలో ప్రజలంతా బాధ్యతాయుతం పాల్గొనే విషయంలో వారిని అప్రమత్తం చేయాలన్నారు.ఇప్పటివరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తాను 20 సార్లు పాల్గొన్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పరిశుభ్రత అంశాలపై ప్రజల్లో మరింత లోతైన అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో శానిటేషన్ నిర్వహించే విషయంలో ఎలాంటి రాజీ లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు.

సంక్షేమ హాస్టళ్లలో మెరుగ్గా శానిటేషన్ నిర్వహించాలని నిర్దేశించారు. ప్రతీ నెలా మొదటి ఆదివారం రోజున విద్యార్థుల తల్లిదండ్రుల్ని ఆహ్వానించి హాస్టళ్లలో పరిస్థితులు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్నా క్యాంటీన్ల ద్వారా దాతలు అన్నార్తులకు సాయం అందించే అంశాన్ని కూడా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోటు పాట్లను సవరించుకోవాలని సీఎం నిర్దేశించారు. బాధ్యులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయ్యి కృష్ణా నది జలాలు రావటంతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమైందని.. ప్రతీ కార్యక్రమంలోనూ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు.

**ఆన్ లైన్ సేవలు మరింత విస్తృతం..**

అన్ని ప్రభుత్వ శాఖలూ ఆన్ లైన్ లో సేవలు అందించాలని సమీకృత సేవల విధానం ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సహా వివిధ విభాగాలు అన్ని ధృవపత్రాలనూ ఆన్ లైన్ లో జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అవేర్ ద్వారా రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రైతులకు సూచనలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రకృతి సేద్యం పెంచేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలు కాపాడుకోడానికి ప్రస్తుతం ఉన్న నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. భూమిని నిరుపయోగంగా ఉంచకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 5.70 లక్షల ఎకరాల్లో ప్రతీ ఎకరాను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సిఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.

# అభివృద్ధి కొండ 'వెలిగొండ'

>> ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సిఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలని కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించామని,ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లించామన్నారు. కటాఫ్ తేదీని పెంచి 18 యేళ్ల నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందిస్తున్నామన్నారు. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి చేయడం ద్వారా తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టిఎంసిల నీటిని తరలిస్తున్నామన్నారు. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందనీ, వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందన్నారు. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. "2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందనీ. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారని విమర్శించారు.

ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలనీ ప్రశ్నించారు. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్ట నుంచి నీళ్లు ఎందుకు ఎందుకు ఇవ్వలేదని, పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలన్నారు. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పి కొట్టాలని చెడును ఖండించి మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సిఎం పిలుపునిచ్చారు. మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలు నిర్వహిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్ 2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి ,కావేరి, తుంగభద్ర, కృష్ణా , యమునా నదుల అనుసంధానం జరగాలని, మహానది గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు.

వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం స్పష్టం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమానికి ఇరిగేషన్ శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి , జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నిరీక్షన్ బాబుతో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముగించండి

>> డటాన్ని కూడా ఆయన ప్రశంసించారు. "గత సంవత్సరం మీ భారత పర్యటన అత్యంత విజయవంతమైంది. నిజంగా చిరస్మరణీయమైనది... మన సహకారం కొత్త శిఖరాలను అధిరోహిస్తూ ఉండటం, ఇరు దేశాల ప్రజల సంక్షేమం కోసం మనం కలిసి పనిచేయడం మాకు ఎంతో సంతృప్తినిస్తోంది"అని మోడీ అన్నారు. "ప్రత్యేక, విశేషాధికార భాగస్వామ్యం" ఆధారంగా ఇరు దేశాల సంబంధాలు బలపడుతూనే ఉన్నాయని పుతిన్ అన్నారు. ద్వైపాక్షి క సంబంధాలు, ఇరు దేశాల మధ్య బంధాలపై మోడీ చూపిస్తున్న శ్రద్ధ దీనికి తోడ్పడిందని ఆయన అన్నారు. ఇటీవలి సంవత్సరాలలో రష్యాలో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏడు రెట్లు పెరిగి 40,000కు చేరిందని ఆయన తెలిపారు. ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్, జి20, ఎస్‌సిఓ వేదికలపైనా ఇరు దేశాలు సన్నిహితంగా సమన్వయం చేసుకున్నాయని ఆయన అన్నారు.

**మరోసారి ఒకే కారులో మోడీ, పుతిన్ ప్రయాణం**

కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ద్వైపాక్షి క చర్చలు ముగించుకున్న వెంటనే, ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బిష్కెక్ అరేనాలో జరిగే 'వరల్డ్ నోమాడ్ గేమ్స్' ప్రారంభోత్సవానికి ఒకే కారులో ప్రయాణించి తమ మధ్య ఉన్న గాఢమైన సాన్నిహిత్యాన్ని మరోసారి

# బాలికపై గ్యాంగ్ రేప్

>> వుల ఇంటికి బయలుదేరింది. అయితే, చీకటి పడటం, భారీ వర్షం కురుస్తుండటంతో నోయిడాలోని ప్యారి చౌక్ వద్ద బస్సు దిగింది. అప్పటికే రాత్రి 9 గంటలు కావొచ్చింది. తాను చేరాల్సిన గమ్యం ఇంకా 25 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలుసుకుని, వర్షంలో తడుస్తూ ఒంటరిగా నిల్చుంది.

ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆమె దగ్గర ఆగింది. అది లాంగ్ డిస్టెన్స్ ప్రయాణాల కోసం ఉపయోగించే స్లీపర్ బస్సు కావడం, అందులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం గమనార్హం. తాము కూడా నోయిడా సెక్టార్ 63 వైపే వెళుతున్నామని కండక్టర్ చెప్పడంతో బాలిక బస్సు ఎక్కింది. వాస్తవానికి ఆ బస్సు గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లోని ఓ వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే చంపేస్తామని డ్రైవర్, కండక్టర్ ఆమెను బెదిరించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణం తర్వాత, బాధితురాలిని ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వద్ద రింగ్ రోడ్ సమీపంలో వదిలేసి పరారయ్యారు.

ధైర్యం కూడగట్టుకున్న బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తక్షణమే దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)లను ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో అరెస్ట్ చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బృందం బస్సులో బాధితురాలి వెంట్రుకలను గుర్తించింది. స్లీపర్ బస్సు కావడంతో బెర్తులకు కర్టెన్లు ఉండటాన్ని నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని పోలీసులు తెలిపారు. బస్సు ప్రయాణించిన మార్గంలోని సిసిటివి ఫుటేజీని సేకరించి దర్యాప్తును వేగవంతం చేశారు.

## వారం - వర్జ్యం

01-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె
తి.చవితి ఉ.7.41 న.అశ్వని రా.2.41
వ.రా.10.48-రా.12.21
దు.ఉ.8.22-ఉ.9.12
2)రా.11.19-రా.12.09
రాహు. మ.3.00-సా.4.30
శుభ ఉ.9.30-ఉ.10.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు, వివాదాలకు దూరంగా ఉండండి. దూరపు బంధువులతో మాట పట్టింపులు తప్పవు.

**వృషభం :** స్థిరాస్తి విషయాలలో చికాకులు తప్పవు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు.

**మిథునం :** పనులు నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు, స్వల్ప ధన లాభం.

**కర్కాటకం :** బంధువులు, మిత్రుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**సింహం :** ముఖ్యమైన పనులు అనుకున్న ప్రకారంగా పూర్తిచేస్తారు. ప్రేమ విషయాలలో పురోగతి సాధిస్తారు.

**కన్య :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**తుల :** వాహనాలు స్థలాల కొనుగోలు యత్నాలు కలిసి వస్తాయి. పెట్టుబడులకు అనుకూల సమయము. నూతన వస్తు లాభం.

**వృశ్చికం :** చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక వ్యవహారాలు లాభసాటిగా కొనసాగుతాయి.

**ధనుస్సు :** మిత్రుల ద్వారా ఆసక్తికరమైన సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పమార్పులు.

**మకరం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు. ఉద్యోగులకు స్థానమార్పులు వుంటాయి.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**మీనం :** సంఘ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ఒక ముఖ్య వ్యవహారంలో అనుకూల ఫలితాలు ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అద్వితీయ నేత రోశయ్య

>> సేవ మాత్రమే శాశ్వతమని నమ్మిన నాయకుడని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని కాపాడిన గొప్ప స్టేట్స్‌మన్‌గా రోశయ్య నిలిచారని తెలిపారు. సాధారణ కుటుంబంలో పుట్టి, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఆచార్య ఎన్.జి.రంగా శిష్యుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన రోశయ్య పల్లెటూరు నుంచి ఢిల్లీ వరకు ఎదిగారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రులు మారినా పలు కేబినెట్లలో కొనసాగుతూ తన రాజకీయ విలువలు, క్రమశిక్షణతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కష్టం, క్రమశిక్షణ, విలువలు ఉంటే రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఆయన జీవితం నిరూపించిందన్నారు.రోశయ్య జీవిత చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ఆయన ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, విజయాలను యువతకు తెలియజేసేలా పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించాలని సూచించారు. రోశయ్య జీవిత విశేషాలను తెలియజేసే మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య పెద్దలను కోరారు. 18 నెలల్లో మ్యూజియం పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా దేశానికి అంకితం చేద్దామని పిలుపునిచ్చారు.పాఠ్యాంశాల్లో రోశయ్య జీవిత చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవపై ప్రత్యేక అధ్యాయం చేర్చే బాధ్యత తనదేనని లోకేష్ ప్రకటించారు. టిడిపి క్యాడర్ శిక్షణలోనూ రోశయ్య అవలంబించిన రాజకీయ విలువలపై ప్రత్యేక అధ్యాయం ఏర్పాటు చేసే బాధ్యతను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీసుకోవాలని సూచించారు. విగ్రహావిష్కరణకు ముందు రోశయ్య కుటుంబసభ్యులు పైడా కృష్ణ ప్రసాద్, పైడా రమాదేవి, పైడా మోర్య, కొణిజేటి శివసుబ్బారావు, కేఎస్ఎన్ మూర్తిలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రోశయ్య చేసిన సేవలను నేటి తరానికి తెలియజేయడంలో ప్రభుత్వంతరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టిజి భరత్, విశాఖ ఎంపి మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎపి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య ప్రముఖులు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విశాఖలో ఎఐజి హాస్పిటల్స్‌కు శంకుస్థాపన

**విశాఖపట్నం ఆగస్టు 31 ప్రభాతవార్త:** విశాఖలో ప్రతిష్టాత్మక ఎఐజి హాస్పిటల్స్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఆనందపురం మండలం ఎండాడలో నిర్మించనున్న ఆసుపత్రికి మంత్రి నారా లోకేశ్, ఎఐజి హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి కలిసి భూమిపూజ, శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ఎవిని వీక్షించారు. ఎఐజి హాస్పిటల్స్ ప్రాజెక్టు కోసం ఐదేళ్లలో దశలవారీగా రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 9 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు.తొలి దశలో 650 పడకల సామర్థంతో 2028 అక్టోబర్ నాటికి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నారు. రెండోదశలో మరో 350 పడకలను ఏర్పాటు చేసి మొత్తం సామర్థ్యాన్ని వెయ్యి పడకలకు పెంచనున్నారు. వైద్య సేవలతో పాటు శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఆసుపత్రిలో 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లతో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు విశాఖలోనే అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపి మతుకుమిల్లి శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, ఎఐజి హాస్పిటల్స్ ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

>>వెలిగొండ ప్రాజెక్టు మళ్లీ ఈ రోజు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు చిత్తశుద్ధికి ఈ ప్రాజెక్టు పనులు నిదర్శనం. గత ఐదు సంవత్సరాల జగన్ రెడ్డి పాలనలో వెలిగొండ ప్రాజెక్టు సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి.. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లా వరకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ నెల 2న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా పోలవరం ఎడమ కాలువను పాయకరావుపేట నియోజకవర్గంలో ఉత్తరాంధ్రలో ప్రవేశిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాలు సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. నేడు అన్నీ పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నాం. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించా మన్నారు.

**మచిలీపట్నంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశాం..**

మచిలీపట్నం నియోజకవర్గంలో 60 డివిజన్లు, 34 పంచాయతీలున్నాయి. కొన్ని పంచాయతీలను అర్బన్లో కలపాలనే ప్రతిపాదన కారణంగా ఎన్నికలు నిలిచిపోయాయి. అదే సమయంలో ప్రస్తుతం ఒకే మండలంగా ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని రెండు మండలాలుగా విభజించాలని ప్రతిపాదనలు పంపించాం. మచిలీపట్నం మేయర్ ఎన్నికలు కూడా పూర్తి చేయాలని నిర్ణయించాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణానికి హామ్ పథకం ద్వారా రూ.74 కోట్లు మంజూరు చేశారు. అమృత్ పథకం ద్వారా రూ.75 కోట్లు, డ్రైనేజీలకు రూ.13 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఎస్టీపీల నిర్మాణానికి మరో రూ.75 కోట్లు చొప్పున మొత్తంగా రూ.250 కోట్లు ప్రతిపాదించాం. మచిలీపట్నంలోని ప్రతి ప్రాంతానికి సిమెంటు రోడ్లు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు.

**మచిలీపట్నంలోని అన్ని వార్డులు, గ్రామాల్లో కూటమి జెండా ఎగరాలి.**

స్థానిక సంస్థల ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, అన్ని గ్రామ పంచాయతీల్లో కూటమి జెండా ఎగిరేలా కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణాభివృద్ధిని గాలికి వదిలేశారు. మచిలీపట్నంలో కనీసం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా నాశనం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. 5000 ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. డేటా సెంటర్ కేబుల్స్ విశాఖపట్నం చెన్నై-హైదరాబాద్ కనెక్టివిటీ మచిలీపట్నం మీదుగా జరగబోతోంది. బందరును ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని సన్నాహాలు చేస్తున్నామన్నారు.

**బందరు చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖిస్తాం**

మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూపొందించాం. విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి ప్రణాళికతో రాబోయే 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తున్నాం. బందరులో క్రిటికల్ మినరల్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించాం. కడప సమీపంలో లిథియం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని తవ్వి తీసేందుకు భారీ పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసి అందుబాటులో ఉన్న ఖనిజాలను వెలికి తీయడమే కాకుండా.. వేల్యూ యాడెడ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# 900 దాటిన వరద మృతులు

>> ముందు మృతదేహాల నుంచి డిఎన్ఏ నమూనాలను సేకరించినట్లు చిత్వాన్ జిల్లా యంత్రాంగం తెలిపింది. మరో 21 గుర్తుతెలియని మృతదేహాలను వివిధ ఆసుపత్రుల్లో ఉంచామని, బంధువులు వచ్చి గుర్తించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ వరద విపత్తులో సుమారు 4,247 మంది ఆచూకీ గల్లంతైందని ఎన్‌డిఆర్ఆర్ఎంఎ వెల్లడించింది.

వీరిలో 592 మంది విదేశీయులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. భోటేకోశి, త్రిశూలి నదీ తీరాల్లోని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న 933 మంది కార్మికుల ఆచూకీ కూడా తెలియరాలేదు. నేపాల్- చైనా సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న నేపాల్ ఆర్మీ, పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. సహాయక చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 252 మంది విదేశీయులు సహా మొత్తం 10,451 మందిని సురక్షి తంగా కాపాడారు. నేపాల్ ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా 3,344 మందిని సురక్షి త ప్రాంతాలకు తరలించింది.

జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లలో చిక్కుకున్న వారిని రక్షి ంచేందుకు భారత, చైనా సాంకేతిక బృందాల సహాయం తీసుకుంటున్నారు. మొత్తం 20,819 మంది సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ విపత్తులో 267 మంది గాయపడగా, వారిలో 156 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు.

## తిరుమల సమాచారం



## ధర్మగిరిలో శాస్త్రోక్తంగా కారీరిష్టి యాగం, వరుణ జపం

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్.అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు ఋత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది ఋత్వికులు గోగర్భం తీర్థంలో నడుములోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. అదేవిధంగా ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది ఋత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భక్తుల ఆహార భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### హోటళ్ల నిర్వాహకులతో అదనపు ఇఒ చౌదరి

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలలో త్వరలో ప్రారంభంకానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తయారు చేసి భక్తుల ఆహార భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమా మిశ్ర వెంకయ్య చౌదరి సూచించారు. హోటళ్లలో, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలలో భక్షుభత్, ఫుడ్ ప్రాసెసింగ్ పై గత రెండేళ్లలో తిరుమలలోని వివిధ హోటల్ యాజమాన్యాలకు, నిర్వాహకులకు అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భక్తుల ఆహార భద్రతే మనందరి ప్రధమ బాధ్యత అన్నారు. బ్రహ్మోత్సవాలు రానున్న నేపథ్యంలో తిరుమలలోని ఆస్థాన మండపంలో సోమవారం హోటల్ నిర్వాహకులతో టిటిడి అదనపు ఇఒ సోమవారం సమావేశం నిర్వహించారు. ఇకపై ప్రతినెలా తప్పనిసరిగా కనీసం 10 నుండి 15 శాంపిల్స్ తో నూతన ఆధునిక ఆహార పదార్థాల పరీక్షల్యాబ్‌లో టెస్టులు నిర్వహిస్తామని చెప్పారు. ల్యాబ్ టెస్టుల్లో నిబంధనలకు అతీతంగా ఫలితాలు వస్తే లక్షల రూపాయల జరిమానా, కేటాయించిన దుకాణాన్ని సీజ్ చేసేటటువంటి చర్యలు కూడా ఉంటా యన్నారు. అదేవిధంగా హోటల్ నిర్వాహకులు తమకు కేటాయించిన స్థలాన్ని దాటి ఆక్రమణలకు పాల్పడరాదన్నారు. త్వరలో తిరుమలలోని హోటళ్లలోని వంట గదులను ఆడిటింగ్ చేసి భద్రతా ప్రమాణాలపై సర్టిఫికేట్ జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, విఎస్ఒ అల్లం సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారిరవి, పిఆర్ఒ నీలిమ,అధికారులు పాల్గొన్నారు.

### పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు

## రూ.5 లక్షలు డిమాండ్

### ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

### మాచర్లలో కలకలం రేపిన వ్యవహారం

### ఉన్నతాధికారుల విచారణలో కీలక విషయాలు

**మాచర్ల టౌన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** విదేశీయుడి పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో మాచర్లలో ప్రత్యేక విభాగంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటన మాచర్ల పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మాచర్లలో నివాస ముంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి తన పాస్‌పోర్ట్ గడువు ముగియడంతో పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియలో భాగంగా తనను సంప్రదించిన కానిస్టేబుళ్లు పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా, కానిస్టేబుళ్లకు డబ్బులు అందించినట్లు బాధితుడు విచారణ సందర్భంగా వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రాథమిక విచారణ ఆధారంగా మాచర్లలోని ప్రత్యేక విభాగానికి చెందిన కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

**గత ఆరోపణలపైనా విచారణ:** సస్పెన్షన్‌కు గురైన మాచర్ల కానిస్టేబుల్‌పై గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలపైనా ఉన్నతాధికారులు విచారణ కొనసా గిస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా పోలీసు శాఖకు సంబం ధించిన సమాచారాన్ని వైకాపా నాయకులకు చేరవేశారన్న ఆరోపణలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఒకవైపు విదేశీయుడి పాస్‌పోర్ట్ వ్యవహారంలో భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం, మరోవైపు గత ఆరోపణలపై విచారణ కొనసాగుతుండటంతో ఈ వ్యవ హారం పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది.పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## బిసి డెడికేటెడ్ కమిషన్ గడువు పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో బీసీ డెడికేటెడ్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వంపొడిగించింది. కమిషన్ కాలపరిమితిని సెప్టెంబర్ 30వ తేదీ వరకు పెంచుతూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 11ను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో బీసీ డెడికేటెడ్ కమిషన్ తన అధ్యయనాన్ని కొనసాగించేందుకు మరింత సమయం లభించనుంది. సమాచారం, అధ్యయనం ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక, సిఫార్సులు అందించే అవకాశం ఉంది.బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాలకు డెడికేటెడ్ కమిషన్ అధ్యయనం కీలకంగా మారనుంది. రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కొనసాగుతున్న బీసీ డెడికేటెడ్ కమిషన్ ప్రధానంగా స్థానిక సంస్థల్లో బీసీల వెనుకబాటుతనంపై అధ్యయనం చేస్తోంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను కమిషన్ పరిశీలిస్తోంది.స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు అవసరమైన అంశాలపై కమిషన్ అధ్యయనం చేస్తోంది.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

## 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14న అంకురార్పణ

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాలలో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి. సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14వతేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. స్వామివారి ఆజ్ఞప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనందనిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యామాసం(ఆశ్వయుజం) లోని శ్రవణ నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అందువల్లే ఇవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధిచెంది అప్పటినుండి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

**అధికమాసం ప్రాధాన్యత :** చాంద్రమానం ప్రకారం ప్రతి మూడో ఏటా అధికమాసం వస్తూ ఉంటుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిపిస్తారు. అధికమాసం కారణంగా సెప్టెంబరు 15 నుండి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి 12 గంటల వరకు జరుగుతుంది.

**8నకోయిల్ ఆళ్వార్ తిరుమంజనం:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేస్తారు.ఇక వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు.స్వామివారి సేనాధిపతి విష్వక్సేనులవారు ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంతమండపానికి ఊరేగింపుగా వెళతారు. అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ మన్నులో 9 రకాల వివిధ ధాన్యాలను నాటుతారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయింది.

**వాహనసేవలు:** సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం. 16వ తేదీ ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుండి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకుహంస వాహనం నిర్వహించనున్నారు.అలాగే సెప్టెంబర్ 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహన సేవ ఉండనుంది. 18న ఉదయం 8 గంటలకు కల్ప వృక్షం వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహన సేవ ఉంటుందని అధికారులు వెల్లడించారు. 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటలనుండి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం, 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహన సేవ ఉంటుంది. 21వ తేదీన ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుండి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం నిర్వహించనున్నారు.

22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహన సేవ ఉంటుంది. 23న ఉదయం 6 నుండి 9 వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావ రోహణం నిర్వహిస్తారు.



## వెలిగొండ కరవు సీమ భవిష్యత్తును మార్చే ఘట్టం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంత రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నా యుడు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాకారం చేశారని తెలిపారు. 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన చేతుల మీదుగానే ఈ ప్రాజెక్టు జాతికి అంకితం కావడం చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేయడంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారనేందుకు వెలిగొండ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మహత్తర ప్రాజెక్టు ఇది అని తెలిపారు. ప్రకాశం, మార్కా పురం, నెల్లూరు, కడప జిల్లాల రైతులకు వెలి గొండ వరప్రదాయిని అని వివరించారు. నిర్వాసిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. 48 రోజుల్లోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.762 కోట్ల పరిహారం అందించడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు

**వెలిగొండ రైతులకు అండ: డి.సిఎం పవన్**

వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభమైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి, సాగునీటి పనితీరుకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన తన శుభాకాంక్షలను తెలియజేశారు. నాలుగు జిల్లాల ప్రజల దశాబ్దాల కల నేటితో నెరవేరిందన్నారు.119 వేల ఎకరాలకు సాగునీరు, 4 లక్షలమందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు.

## కొవ్వూరులో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

### రాకపోకలకు అంతరాయం, ప్రయాణీకుల ఇబ్బందులు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు31, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో రైల్వే రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు చెందిన బోగీలు స్టేషన్ పరిధిలోని నాలుగో లైన్‌లో పట్టాలు తప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. పట్టాలు తప్పిన బోగీలను పరిశీలించి, రైల్వే ట్రాక్ పరిస్థితిని అంచనా వేశారు. అనంతరం గూడ్స్ రైలును తిరిగి పట్టాలపైకి తీసుకురావడంతో పాటు దెబ్బతిన్న ట్రాక్‌ను పునరుద్ధరించేందుకు మరమ్మతు పనులను ప్రారంభించారు.ఘటన కారణంగా సంబంధిత లైన్‌లో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా నియంత్రించినట్లు సమాచారం. కొన్ని రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించడం లేదా కొంత సమయం పాటు నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీంతో స్టేషన్‌లో రైళ్ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రైల్వే అధికారులు సంఘటనపై అప్రమత్తంగా వ్యవహరిస్తూ పరిస్థితిని పర్యవేక్షి స్తున్నారు. పట్టాలు తప్పిన బోగీలను తొలగించి రైల్వే ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అందుబాటు లోకి తీసుకురావడానికి సాంకేతిక సిబ్బంది,మరమ్మతు బృందాలు రంగంలోకి దిగాయి. రైళ్ల రాక పోకలకు వీలైనంత త్వరగా అంతరాయం తొలగించేలా చర్యలు చేపడుతు న్నారు. ఇదిలా ఉండగా గూడ్స్ రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలపై రైల్వే అధికారులు విచారణ ప్రారంభించారు. ట్రాక్‌లో లోపం కారణమా? రైలు సాంకేతిక సమస్య వల్ల ఘటన చోటుచేసుకుందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో అధికారులు పరిశీలిస్తున్నట్లు

# నకిలీ ప్రారంభోత్సవాలు వైఎస్సార్సీకే సాధ్యం

## శంకుస్థాపన చేసి, ప్రారంభించింది సిఎం చంద్రబాబే: 'ఎక్స్'లో మంత్రి లోకేష్


**విజయవాడ, ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్ట్ కర్త,కర్మ,క్రియ అన్ని సీఎం చంద్రబాబుదేనని మంత్రి లోకేష్ స్పష్టం చేసారు. ఆయనే శంకుస్థాపన చేసారు.ఆయనే పూర్తి చేసి, ప్రారంభించారు. తన ఘనతంటూ జగన్ చేసిన పోస్టుకు మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో బదులు ఇచ్చారు. 2024లో నీళ్లు లేకుండానే వెలిగొండ ప్రాజెక్టును జగన్ ప్రారం భించారని ఎద్దేవా చేశారు. జగన్ పోస్టులోని విజువల్స్ ను నిశితంగా పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతుందని, నీరు లేని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసి చరిత్ర సృష్టించారని విమర్శించారు. ఇది నకిలీ ప్రారంభోత్సవమని, ఇలాంటి ఘనత వైఎస్సార్సీపీకి మాత్రమే దక్కుతుందని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. 2024లో జగన్ చరిత్ర సృష్టించారు. ఒక నకిలీ ప్రారంభోత్సవం ఇది కేవలం వైఎస్సార్సీపీకే సాధ్యమంటూ తన స్పందనతో పాటు కొన్ని హ్యాష్‌ట్యాగ్‌లను కూడా పోస్టు కింద జత చేశారు. అందులో ఫేక్ జగన్ డ్రీమ్ వెలిగొండ ప్రాజెక్ట్ వంటివి ఉన్నాయి. ఇవి ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో ట్రెండింగ్‌గా మారాయి. దశాబ్దాల నిరీక్షణ తర్వాత టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హయాంలో వెలిగొండ సొరంగం గుండా కృష్ణా జలాలు మొదటిసారిగా ప్రవహించాయని లోకేశ్ నొక్కి చెప్పారు. కరువు పీడిత ప్రాంతానికి ఇది చరిత్రాత్మక జీవనాడి అని ఆయన అభివర్ణించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ప్రజా ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో పనిచేస్తోందని లోకేశ్ స్పష్టం చేశారు. 'ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి అభిమానాన్ని పొందడమే మేం కోరుకునే అసలైన క్రెడిట్. ఖివెలిగొండ జలసిరులుఅభివృద్ధికి రెక్కలుఖి అనేది కేవలం నినాదం కాదు, అది కూటమి ప్రభుత్వ విధానం' అంటూ ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. వెలిగొండ జలాలతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## రైలు ఢీకొని ముగ్గురు దుర్మరణం

### కర్ణాటకలో దుర్ఘటన, మృతులు హిందూపురం వాసులు

**హిందూపురం , ఆగస్టు 31 ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రం బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబళ్లాపురం రైల్వే స్టేషన్ ప్రాంతంలో రైలు ఢీకొని ముగ్గురు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మృతులు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందినవారు. వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురంలోని రహమత్పురం చెందిన వెల్డింగ్ పనిచేసే జాకీర్ కుటుంబీకులు మృత్యువాత పడ్డారు. అతని తల్లి ఇర్ఫాన్(46), కుమార్తెలు రుక్యా (13), రాకియా (8) ఆదివారం ఇక్కడి నుంచి దొడ్డ బళ్లాపురంలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం హిందూపురానికి వచ్చేందుకు అక్కడి రైల్వే స్టేషన్‌కు వస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ఊహించని విధంగా రైలు వేగంగా వచ్చి ముగ్గురిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతదేహాలు చెల్లా చదురుగా పరిసరాల్లో విసిరి వేయబడ్డాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం మృతదేహాలను హిందూపురం తీసుకువచ్చారు. తమ ఆత్మీయులు అకస్మాత్తుగా దుర్మరణం పాలు కావడంతో మృతదేహాలను చూసి కుటుంబీకులు, ఆత్మీయులు హృద య విదారకంగా రోదించారు. తదుపరి అంత్యక్రియలను రాత్రి పూర్తి చేశారు. మృతుల కుటుంబీకులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి ఫారూక్ పరామర్శించి దగ్గరుండి పర్యవేక్షించారు.




ఇర్ఫాన్, రుక్యా, రాకియా (ఫైల్)

# పరిశ్రమలన్నీ 33% పచ్చదనాన్ని పాటించాలి

## రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి: డి.సిఎం పవన్

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవు తుందని అన్నారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్,వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వ ర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని పవన్ పిలుపునిచ్చారు.



## చిలకలూరిపేట మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆగస్టు 27న విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రా వెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొ ట్టింది. ఈప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణా లు కోల్పోయారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్ష ల చొప్పున ఆర్థికసాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించి తక్షణ మే చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందినవారని అధికారులు గుర్తించారు.

# నేటి నుంచి పోలీసు క్రీడా సంబరం

### నాలుగు రోజుల పాటు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

### బరిలో 1,900 మంది పోలీసు క్రీడాకారులు

### మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ప్రారంభించనున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ, ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026'కు రంగం సిద్ధమైంది. సెప్టెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ క్రీడా సంబరాల్లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీసు రేంజ్‌లు, యూనిట్లకు చెందిన సుమారు 1,900 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. ఈ పోటీల్లో తొలిసారిగా మినిస్టీరియల్ స్టాఫ్ కు చెందిన క్రీడాకారులు బరిలోకి దిగనున్నారు.మంగళగిరిలోని 6వ బెటాలియన్ ఏపీఎస్పీ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఈ క్రీడా పోటీలను ప్రారంభించనున్నారు. జు।గితిశి యూనివర్సిటీ, అమరావతి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ )లు ఈ క్రీడా పోటీలకు వేదికలు కానున్నాయి. సెప్టెంబరు 4న ముగింపు కార్యక్రమం జరగనుంది.పోలీసు సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడం, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, జట్టు భావనను పెంపొందించడం ఈ పోటీల ప్రధాన లక్ష్యం. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోలీసు క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నారు.

# స్థానిక ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి: వైఎస్ షర్మిల

**విజయవాడ,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో త్వరలో జరగబోయే లోకల్ బాడీ ఎన్నికలకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంసిద్ధత వ్యక్తం చేసింది. మెజారిటీ స్థానాలు దక్కించుకునేలా రాష్ట్ర స్థాయి నాయకత్వానికి వైఎస్ షర్మిలా రెడ్డి సోమవారం దిశా, నిర్దేశం చేశారు. పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా కీలక సూచనలు చేశారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన మీటింగ్ లో ఆమె పలు ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ మరియు స్థానిక సంస్థ లకు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జేడీ శీలం, మస్తాన్ వలి నేతృ త్వంలో రాష్ట్ర స్థాయి కమి టీలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయడంతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి పెద్దపీట వేయాలని షర్మిలా రెడ్డి నాయకత్వానికి సూచించారు. ముఖ్యంగా మహిళలకు, యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎన్నికలు సవ్యంగా జరిగేలా చూడాలని, అధికార పార్టీ ఎన్నికలు లేకుండా బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకొనేలా సిద్ధంగా ఉండాలని కేడర్‌కి సూచించారు. రాష్ట్రంలో అధికారపార్టీకి ప్రత్యా మ్నాయం ఇప్పు డు కాంగ్రెస్ మాత్రమే కనిపిస్తుం దని, ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని ప్రజలకు అండగా ఉం డాలని ఆమె కేడర్‌ను అప్రమత్తం చేశారు. మూడు దశాబ్దాలకు వెలిగొండ మొదటి దశ పూర్తి కావడం శుభసూచకమేనన్నారు. అయితే ఈ సమయంలో స్మరించుకోవాల్సిన వైఎస్ రాజ శేఖర్ రెడ్డిని గురించి పట్టించుకోకపో వడంపై ఆమె మండిపడ్డారు. వెలిగొండకు వెలుగు వైఎస్ అయితే, చీకటి చంద్రబాబు అని ఎద్దేవా చేశా రు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో స్మరించుకోవలసింది మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆశయం, కృషిని అని ఆమె అన్నారు.



వార్త


గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్థులు కాదు.

న- సిసిరో

# రహదారుల రక్తదాహం!

మానవుడి సుఖానికి, సంతోషానికి, అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసమే అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్ల అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. మరి ఆ సోపానాలే మృత్యుమార్గాలైతే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి?దేశంలో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీలేని అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలు పోతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారంగా మారి జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు యేటా వేలాది మంది అసువులు బాస్తున్నారు. మొన్న పల్నాడుజిల్లా చిలకలూరు పేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే చనిపోగా మరో పది మందికి తీవ్ర గాయలయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు ముగించుకొని స్వగ్రామానికి వస్తున్న వారి వాహనాన్ని ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వీరంతా కొండుమంజూరు గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన పలువురిని ఆస్పత్రిలో చేర్పించగా అందులో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరో ప్రమాదంలో ఆరుగురు అక్కడి కక్కడే మరణించగా మరో పధ్నాలుగు మంది వరకు గాయపడ్డారు. ఇనుప స్తంభాల భారీ లోడుతో వెళ్తున్న వాహనం అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కి నిలిచిపోయింది. అక్కడ వాహనం నిలిచి ఉండటాన్ని గమనించని హైదరాబాద్ నుంచి ఏలూరుకు బయలుదేరిన ప్రైవేట్ బస్సు ఈ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే ఆరుగురు చనిపోయారు. ట్రక్కులోని ఇనుప స్తంభాలు బస్సు అద్దాలను చీల్చుకుంటూ ప్రయాణికుల వైపు దూసుకువెళ్లాయి. స్తంభాలు తగిలి ముఖాలు గుర్తు పట్టలేనంతగా ఛిద్రమైపోయాయి. క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారిది ఒక్కొక్కరిది ఒక్కొక్క దీనగాథ. తమ్ముడికి రాఖీ కట్టేందుకు వెళ్తూ ఇరవై నాలుగేళ్ల యువతి ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఇక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసి తిరిగివెళ్తూ మరో యువకుడు మరణించాడు. ఇక తన బాబాయ్ కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తూ మరొక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృత్యుపాలయ్యాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రమాదాలు యేడాది యేడాదికి పెరిగిపోతున్నట్లు అధికార రికార్డులే చెబుతున్నాయి. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నామని ప్రభుత్వాలు చెప్తున్నా, నిబంధనలను పటిష్ఠం చేస్తున్నా ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రమాదాల్లో మరణించిన వారి సన్నిహితులు, బంధువులు గుండెలుబాదుకొని ఏడ్చేవారిని చూసి కన్నీరు సైతం ఘనీభవించేస్థితికి చేరుకున్నదేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా 2001నుండి 2020 వరకు తొంభైఆరు లక్షల అరవై రెండు ప్రమాదాలు చోటుచేసుకుంటే, ఇరవై మూడులక్షల ఇరవైఐదు వేల మంది మృత్యువాతపడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్య కోట్లల్లో ఉండవచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత ఐదేళ్లలో ముప్పైవేలకు పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు విడిచిన వారెందరో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నారు. పోలీసుల రికార్డుల్లోకి రాని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. చనిపోయిన వారిలో అధికశాతం పద్దెనిమిదేళ్ల నుంచిముప్పై యేళ్ల వయస్సున్నవారే. సంపాదన చేస్తున్న భర్తో,కుమారుడో చేతికి అందివస్తున్న కుటుంబ సభ్యులను కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఒకటి, రెండు కుటుంబాలుకాదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఈప్రమాదాల గురించిపాలకులకు తెలియంది కాదు. ప్రభుత్వ విధానాలలో ప్రజాసంక్షేమం లేదనిపిస్తున్నది. ఎవరు ఎలాపోయినా, ఎంతమంది ప్రాణాలు అర్థాంతరంగా గాలిలో కలిసిపోయినా, ఎన్ని లక్షల కుటుంబాలు వీధినపడినా ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న విమర్శలను కొట్టివేయలేం. ఎన్నిసార్లు నిబంధనలను ఉల్లంఘించినా, చట్టానికి విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలతో కాసులు దండుకుంటున్నా,జరిమానా రూపంలో డబ్బు చెల్లిస్తే చాలనే దీమాతో వాహన చోదకులు బరితెగిస్తున్నారు. ఈ ప్రమాదాలతో జీవనాధారం కోల్పోయి జీవచ్ఛవాలుగా బ్రతుకీడుస్తున్నవారు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు రోడ్డు ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ఆదాయమే లక్ష్యంగా కాకుండా మానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారులైన వాహన చోదకుల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోలాగా శాశ్వతంగా రద్దు చేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే విధంగా చట్టాన్ని రూపొందించాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా వాహనాలు మృత్యుదేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది ప్రాణాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.

యువతను మోసగించడం తేలిక, ఎందుకంటే వారు తొందరగా ఆశలు పెంచుకొని, భ్రమల్లో పడిపోతారు.



అరిస్టాటిల్

దేశం కోసం తమ జీవితాలను అర్పించగల, సర్వత్యాగాలు చేయగల, సర్వసన్నద్ధులైన యువకులు నేడు కావాలి.



స్వామి వివేకానంద

# హిమాలయాల హెచ్చరికలు వినాలి..

**హిమాలయాలను మనిషి స్థిరపరచలేడు. పర్వతం కూలడాన్ని ఆపలేడు. కానీ ఆ పర్వతం కింద ఏం నిర్మించాలి, ఎంతమేరకు విస్తరించాలి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలి, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఎలా రక్షి ంచాలి అన్నది మానవ ప్రణాళికపైనే ఆధారపడి ఉంది. ప్రకృతిని అర్థం చేసుకోకుండా సాగే అభివృద్ధి దీర్ఘకాలంలో నిలవదు. అదే సమయంలో అభివృద్ధిని పూర్తిగా ఆపేయడం కూడా పరిష్కారం కాదు. హిమాలయాల్లో ఇకపై ప్రతి పెద్ద ప్రాజెక్టు ముందు ఎక్కడ నిర్మించగలం?" అనే ప్రశ్నతో పాటు ఎక్కడ నిర్మించకూడదు? అనే ప్రశ్న కూడా ఉండాలి. ప్రకృతి ప్రమాదాన్ని పూర్తిగా నివారించడం మనిషి చేతిలో లేకపోవచ్చు. కానీ అది మానవ విషాదంగా మారే అవకాశాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న పర్వతం ఎప్పుడు కదులుతుందన్నది మాత్రమే కాదు. అది కదిలినప్పుడు మనం ఎంత సంసిద్ధంగా ఉన్నామన్నదే.**

డి జె మోహన రావు

హిమాలయాల్లో కొండచరియలు విరిగిపడటం,మంచు కదలడం, నదులు ఉప్పొంగడం కొత్త కాదు. భౌగోళికంగా అత్యంత చురుకైన ఈ పర్వత ప్రాంతంలో ప్రకృతి తన సహజ స్వభావాన్ని ఎప్పటికప్పుడు చూపిస్తూనే ఉంటుంది. అయితే మారుతున్నది మరొకటి. గతంలో తక్కువగా మానవ వినియోగంలో ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో ఇప్పుడు రహదారులు, వంతెనలు, నివాసాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక సదుపాయాలు వేగంగా పెరుగుతున్నాయి. అంటే ప్రమాదం కొత్తది కాకపోయినా, దానికి గురయ్యే మనుషులు, ఆస్తుల విస్తృతి పెరుగుతోంది.ఆగస్టు 26న నేపాల్‌లోని రాసువా ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరద ఈ మారుతున్న ప్రమాద స్వభావానికి తాజా హెచ్చరిక. ప్రాథమిక శాస్త్రీయ విశ్లేషణల ప్రకారం లాంగ్ టాంగ్ లిరుంగ్ ప్రాంతంలో హిమనదితో సంబంధం ఉన్న భారీ మంచు-రాళ్ల కూల్చివేత చోటుచేసుకుంది. దాని ప్రభావంతో మంచు, రాళ్లు, మట్టి, నీరు భారీగా భోటేకోశీ-త్రిశూలీ నదీ మార్గంలోకి దూసుకొచ్చి ఆకస్మిక ప్రవాహాన్ని సృష్టించాయి. ఈ ఆకస్మిక ప్రవాహానికి రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇది సాధారణ వర్షాకాల వరద కాదు. ప్రమాదం నదిలో మొదలుకాలేదు. పర్వతంలో మొదలై నదిలోకి వచ్చింది. ఈ తేడానే విపత్తు నిర్వహణ విధానాన్ని సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. ఈతరహా విపత్తులు భారత హిమాలయ ప్రాంతానికీ కొత్తేమీ కాదు. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో హిమ-శిథిల ప్రవాహం కారణంగా రిషిగంగ, తపోవన్ ప్రాంతాల్లో భారీ వరద సంభవించి జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని దక్షి ణ లొనాక్ మంచు సరస్సు ఆకస్మికంగా పొంగిపొర్లడంతో తీస్తా నదిలో భారీ వరద వచ్చి మౌలిక వసతులకు తీవ్ర నష్టం కలిగింది. జోషిమఠ్ లో చోటుచేసుకున్న నేల కుంగుబాటు వంటి ఘటనలు పర్వత ప్రాంతాల భౌగోళిక సున్నితత్వాన్ని మరోసారి గుర్తు చేశాయి. ఇవన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పర్వతాల ఎగువ ప్రాంతాల్లో జరిగే మార్పుల ప్రభావం దిగువన నివసించే ప్రజలు, మౌలిక వసతులపై తీవ్రంగా పడవచ్చు. సాధారణంగా వరదలను అంచనా వేయడానికి వర్షపాతం, నదీ నీటిమట్టం వంటి సూచికలను ఉపయోగి స్తాం. భారీ వర్షాలు కురిసి నదులు క్రమంగా ఉప్పొంగితే ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు కొంత సమయం దొరుకుతుంది. కానీ పర్వతం నుంచే ప్రమాదం మొదలైనప్పుడు లెక్కలు తారుమారవుతాయి. ఎత్తైన ప్రదే శంలో మంచు, శిథిలాలు ఒక్కసారిగా కదిలి నదిలోకి చేరితే ప్రవాహం క్షణాల్లో మారిపోతుంది. నదిలో ప్రమాదకరమైన మార్పు కనిపించే సమయానికి దిగువ ప్రాంతాల్లోని ప్రజ లకు ప్రతిస్పందించేందుకు లభించే సమయం అత్యంత పరిమితంగా ఉండవచ్చు. రాసువా ఘటనపై మొదట భూకంపం కారణమై ఉండవచ్చనే అనుమానాలు వచ్చాయి. అమెరికా భూగర్భ సర్వేసంస్థ చేసిన విశ్లేషణ ప్రకారంనమోదైన ప్రకంపనలు భారీ కూల్చివేతతోనే సంబంధం కలిగి ఉండవచ్చని సూచనలు లభించాయి. అయితే ఆ కూల్చివేతకు ఏదైనా భూకంపం ప్రేరణగా పనిచేసిందా అన్నది వేరే ప్రశ్న. ఇలాంటి సంక్లిష్ట ప్రకృతి ఘటనలకు ఒకే కారణాన్ని తొందరపడి ఆపాదించడం సరికాదు. హిమాలయాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, హిమనదులు వెనక్కి తగ్గ



డం, కొన్ని ప్రాంతాల్లో శాశ్వతంగా గడ్డకట్టిన నేల కరగడం వంటి మార్పులు పర్వత వాలుల స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అవకాశాన్ని పెంచుతున్నాయి. అయితే రాసువా ఘటనకు వాతావరణ మార్పే ప్రత్యక్ష కారణమని నిర్ధారించడానికి ప్రస్తుతం తగిన ఆధారాలు లేవు.వాతావరణ మార్పు, భౌగోళిక నిర్మాణం, స్థానిక పరిస్థితులు ఇవన్నీ కలిసి ప్రమాద స్వభావాన్ని ప్రభావితం చేయవచ్చు. అందువల్ల గత అనుభవాల ఆధారంగా మాత్రమే భవిష్యత్తు ప్రమాదాలను లెక్కగట్టడం ఇక సురక్షి తం కాదు. పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రహదారులు, విద్యుత్తు, ఆరోగ్యం, ఉపాధి అవస రం. పర్యాటకం, జలవిద్యుత్ ఈప్రాంతాల ఆర్థిక వ్యవస్థ లకు కీలకం. కాబట్టి హిమాలయాల్లో నిర్మాణాలను పూర్తిగా ఆపేయాలని చెప్పడం ఆచరణ సాధ్యం కాదు. అసలు సమ స్య నిర్మాణాల్లో లేదు, ప్రమాదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్మించడంలో ఉంది. అభివృద్ధి ఎక్కడ చేయాలన్నదే కాదు, ఎక్కడ చేయకూడదన్నది కూడా ప్రణాళికలో భాగం కావాలి. ఒక రహదారి లేదా జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రతిపాదించేటప్పుడు కేవలం నిర్మాణ స్థలాన్ని మాత్రమే కాకుండా, దాని ఎగువన ఉన్న మొత్తం పర్వత ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. హిమనదుల్లో మార్పులు,మంచు సరస్సుల విస్తరణ, కొండచరియల ముప్పు, ఆకస్మిక శిథిల ప్రవాహాల అవకాశాలను ముందే అధ్యయనం చేయాలి. ఒకే లోయలో అనేక ప్రాజెక్టులు ఉన్నప్పుడు వాటిసంయుక్తపర్యావరణ ప్రభావం ఎంత అన్నది కూడా విశ్లేషించాలి. ఒక్కో ప్రాజెక్టు విడిగా సురక్షి తంగా కనిపించినా, మొత్తం లోయపై వాటి కలిపిన ప్రభావం భిన్నంగా ఉండవచ్చు. పర్యావరణ ప్రభావ అంచనా అనేది ప్రాజెక్టు ప్రారంభంలో ఒకసారి ఇచ్చి ముగిసిపోయే ప్రక్రియగా ఉండకూడదు. పదేళ్ల కాలం లో హిమనది వెనక్కి తగ్గవచ్చు, కొత్త మంచుసరస్సు ఏర్ప డవచ్చు, కొండ వాలు అస్థిరంగా మారవచ్చు లేదా నదీ మార్గంలో మార్పులు రావచ్చు. అందువల్ల పర్వత ప్రాంతా ల్లో ప్రమాద అంచనాలను నిరంతరం నవీకరించే వ్యవస్థ అవసరం. ఒకసారి ఇచ్చిన అనుమతిని శాశ్వత భద్రతా ధ్రువీకరణగా చూడటం ప్రమాదకరం. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల్లోనూ ఆధునిక మార్పులు రావాలి. వర్షపాతంతో పాటు ఉపగ్రహ చిత్రాలు, భూకంప సంకేతాలు, హిమనదు ల పర్యవేక్షణ, మంచు సరస్సుల స్థితి, నదీ ప్రవాహాల సమాచారాన్ని ఒకే వ్యవస్థలోకి తేవాలి. ప్రమాదం నదిలో కనిపించే దశకు చేరుకునేలోపే, అది పర్వతంలో మొదలైన దశలో గుర్తించే సామర్థ్యాన్ని పెంచాలి. అయితే సాంకేతికత మాత్రమే ప్రాణాలను రక్షి ంచదు. హెచ్చరిక అందిన వెంటనే ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? ఏ మార్గంలో వెళ్లాలి? అత్యవసర పరిస్థితుల్లో ఎవరు నాయకత్వం వహించాలి? వంటి ప్రశ్న లకు ముందుగానే సమాధానాలు సిద్ధంగా ఉండాలి. తరలిం పు మార్గాలు, సురక్షి త ప్రాంతాలు, స్థానిక స్పందనా బృం దాలు, అత్యవసర ఆశ్రయాలు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉం డాలి. స్థానిక యంత్రాంగం బలంగా లేకపోతే అత్యాధునిక హెచ్చరిక వ్యవస్థలు సైతం పరిమిత ప్రయోజనమే ఇస్తా యి. హిమాలయాల్లో పుట్టే నదులకు దేశాల సరిహద్దులు తెలియవు. ఎగువ ప్రాంతంలో సంభవించే హిమనదీ మార్పులు, మంచు సరస్సుల ఆకస్మిక విసర్జనలు, కొండచరియలు దిగువ ప్రాంతాలను ప్రభావితం చేయగలవు. అందుకే భారత్, నేపాల్, చైనాల మధ్య హిమనదులు, మంచు సరస్సులు, నదీ ప్రవాహాలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులపై వేగవంతమైన సమాచార మార్పిడి అత్యవసరం. విపత్తు ముప్పును తగ్గించడంలో ఈ సహకారం దౌత్యపరమైన అంశం మాత్రమే కాదు, ప్రాణరక్షణకు సంబంధించిన కార్యాచరణ. హిమాలయాలను మనిషి స్థిరపరచలేడు. పర్వతం కూలడాన్ని ఆపలేడు.కానీ ఆ పర్వతం కింద ఏంనిర్మించాలి, ఎంతమేరకు విస్తరించాలి, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలి, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఎలా రక్షి ంచాలి అన్నది మానవ ప్రణాళికపైనే ఆధారపడి ఉంది. ప్రకృతిని అర్థం చేసుకోకుండా సాగే అభివృద్ధి దీర్ఘకాలంలో నిలవదు. అదే సమయంలో అభివృద్ధిని పూర్తిగా ఆపేయ డం కూడా పరిష్కారం కాదు. హిమాలయాల్లో ఇకపై ప్రతి పెద్ద ప్రాజెక్టు ముందు ఎక్కడ నిర్మించగలం?" అనే ప్రశ్నతో పాటు ఎక్కడ నిర్మించకూడదు? అనే ప్రశ్న కూడా ఉండాలి. ప్రకృతి

# పోషకాహార జాగ్రత్తలతో ఆరోగ్య భద్రత

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యానికి మించిన సంపద లేదు. పోషకాహారమే మన ఆరోగ్యానికి పునాది. దేహమనే దేవాలయానికి ఆరోగ్యకర వాతావరణమే పరమ పవిత్రం. మనం తినే ప్రతి ఆహారం మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మంచి ఆహారం తీసుకున్నపుడు ఆరోగ్య భాగ్యం, చెడు ఆహారం తీసుకున్నపుడు రోగం కలుగుతుంది. పోషకాహారమే ప్రజారోగ్యానికి ఆధారంగా నిలుస్తుంది. అనారోగ్యాలు కుటుంబాల ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా నిలుస్తాయి. ఆరోగ్యకర పౌర సమాజమే జాతి సమగ్రాభివృద్ధికి వెన్నెముక అని తెలుసుకోవాలి. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతానికి పోషకాహార లోపాలు శాపంగా మారుతున్నాయి. పేదరికం,నిరుద్యోగం, అవిద్య, అవగాహనలేమి లాంటివి పోషకాహారలోప సమస్యలకు కారణం అవుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఎదుగుతున్న భారతదేశంలో పోషకాహార లోపాలు బెడద అధికంగా కనిపిస్తున్నది. ప్రజలకు పోషకాహార విలువలను వివరించడానికి, పోషకాల పట్ల అవగాహన కల్పించడానికి, జీవనశైలి మార్పులను సూచించడానికి, పోషక విలువ గూర్చి తెలుపడానికి, ప్రభుత్వాలబాధ్యతను తట్టిలేపడానికి ప్రతి ఏటా 01 నుంచి 07 సెప్టెంబర్‌వరకు ప్రపంచవ్యాప్తంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు (నేషనల్ న్యూట్రీషన్ వీక్) పాటించడం కొనసాగుతున్నది. 1975లో అమెరికాలో ప్రారంభమైన జాతీయ పోషకాహార వారోత్సవాలను 1982లో భారత మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ కూడా ఆచరించడానికి నిర్ణయించింది. ఈ వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్యంపట్ల అవగాహన, పోషకాహార విద్య, అనువైన జీవనవిధానం, పరిసరాలపరిశుభ్రత, సురక్షి త తాగునీరు, పోషకాహారలోపం వల్ల కలిగే దుష్ప్రభావాలు లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగు తుంది. 2026 జాతీయ పోషకాహార వారోత్సవాల ఇతివృత్తంగా డిస్కవర్ ది పవర్ ఆఫ్ న్యూట్రిషన్ (పోషకా హారం శక్తిని ఆవిష్కరిద్దాం) అనే అంశాన్ని తీసుకొని ప్రచా రం చేయడం జరుగుతోంది. అధిక జనాభా,పేదరికం,నిరు ద్యోగం, నిరక్షరాస్యత కలిగిన దేశంలో పోషకాహార సమ స్యలు ఉత్పన్నం కావడం సర్వసాధారణం.తినడానికిరెండు పూటల తిండి దొరకడమే కష్టం అయిన వేళ పోషకాహార లభ్యత కష్టమే. రెండు ముద్దల పచ్చడి మెతుకులు తినడా నికి అలవాటు పడిన జనానికి ఆరోగ్య సమస్యలు రావడం అతి సహజమే. ఎంత తిన్నాం అనే విషయం కన్న, ఏం తిన్నామన్నదే ప్రధానమని తెలుసుకోవాలి.మనం తినే ఆహారంలో స్థూల సూక్ష్మ పోషకాలు,విటమిన్లు, ప్రోటీన్లు,పిండి పదార్థాలు, ఆరోగ్యకర కొవ్వులు ఉండే విధంగా జాగ్రత్త పడితేనే కుటుంబ ఆరోగ్యం బాగుంటుంది. మనం తినే ప్లేటులో అధికంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఉండే విధంగా చూసుకోవాలి. చక్కెరలు, ఉప్పు,హానికారక

# ప్రజావాక్కు



## చక్కర ధరలను నియంత్రించాలి

**ప్రస్తుతం** దేశంలో చక్కెర ధరలు చుక్కలను చూపిస్తున్నాయి.నెలరోజుల్లోనే దాదాపు 30శాతం ఎగసిన రిటైల్ రేటు ప్రస్తుతం సగటున కేజీ 63 రూపాయల స్థాయికి చేరింది. చెక్కరను ఇథనాల్ తయారీకి మళ్లించడం వల్లే ప్రస్తుత కొరత ఏర్పడిందన్న విమర్శలు కూడా ఒక ప్రక్క నుండి వస్తున్నాయి. చెక్కర ఉత్పత్తిలో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న భారత్ దాదాపు పదేళ్ళ తర్వాత దిగుమతుల బాట పట్టింది. వచ్చే రెండు నెలల్లో వరుస పండుగలు వివాహాల సీజన్‌దగ్గర పడుతుండటంతో చెక్కరకు డిమాండ్ పెరగవచ్చును.అలాగేఇళ్లల్లో వినియోగంతో పాటు స్వీట్లు, బేకరీలు, పానీయాలు ఇతర ఆహార ఉత్పత్తుల తయారీలోనూ చెక్కరఅవసరం పెరుగుతోంది. కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే చెక్కర ధరల నియంత్రణకు చర్యలు తీసుకొని సామాన్య ప్రజలకు పాత ధరకే చెక్కర లభించేలా చర్యలు చేపట్టాలి.

- దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

## బొగ్గు లారీల వేగానికి కళ్లెం వేయరా?

**భూపాల్‌పల్లి,** మల్హర్‌రావు మండలం తాడి చర్ల బొగ్గు గనుల నుండి ఉప్పల్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లకు వెళ్ళే బొగ్గు లారీలు కాటారం భూపాల్ పల్లి పరకాల ద్వారా రైల్‌నిలయం అయిన ఉప్పల్ వరంగల్‌కి వెళ్లుతాయి.అలాగే మణుగూరు,భద్రాద్రిపవర్ ప్లాంట్ ప్రధాన రహదారిపై బొగ్గులారీలు వస్తున్నాయంటే ప్రజలుహడలిపోతున్నారు.ఈ రెండుమార్గాలలో లారీల దూకుడు రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఎప్పుడుఏప్రమాదం పొంచి ఉందో అనే ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మణుగూరులో అంతర్గతంగా బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడుకుతోడు మణుగూరు ఓసీ, ఓసీ2 నుంచి బొగ్గునుతరలించే టిప్పర్లఅతివేగం మిగతా వాహన దారులకు ప్రాణ సంకటంగా మారుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## అందమైన బంధం

**ఒకప్పుడు** ఉత్తరాల కోసం వెయ్యికళ్లతో ఎదురుచూసేవారు కోకొల్లలు. దూర తీరాలను చేర్చేదారాలు ఈ ఉత్తరాలు అంటే అతిశయోక్తికాదు. పోస్ట్ అన్నకేకతో, పరుగునవచ్చి లెటర్ అందుకొని చదివితేగాని మనస్సు కుదుట పడదు. తీపి, చేదు,వార్తలు కలగూరగంపలా ఉంటాయి. మాటలకన్నా చదవడంలోనే ఎంతో హాయి ఉంటుంది.

-ఆర్ వెంకటేష్ చరన్, బెంగళూరు

## తీరప్రాంతంలో తాటిచెట్లు

**ఆంధ్రరాష్ట్రంలో** ఎక్కువగా సుదీర్ఘ సముద్రతీర ప్రాంతముంది. ప్రకృతి విపత్తులు తుఫానులు ఎక్కువ సంభవించినపుడు ఉప్పునీరుతో, హోరుగాలులు వీచడం వలన తీరప్రాంతం ఎక్కువగా కోతకు గురై చుట్టుపక్కల భవనాలకు, వ్యవసాయ భూములకు,మత్స్యకార నివాసాలకు తీవ్ర ధన, ప్రాణ నష్టాలను కలుగుజేస్తుంది. ఈవిపత్తుల నివారణకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి తీరప్రాంతంవెంట తాటివనాలను నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. దీనికి భూలోక కల్ప వృక్షమని పేరుంది.ఇతర చెట్లేమైనా పెంచితే ఆ పరిసరాల్లో సాగు కష్టం. కానీ తాటిచెట్లు ఎత్తుగా ఉండడం వల్ల ఏ పంటకూ నష్టం వాటిల్లదు. ఏ మొక్కను పెంచాలన్నా రోజూ నీళ్లుపోయాలి. కానీ వీటికి నీళ్లఅవసరమే లేదు. ఏ జంతువూ తినదు. అగ్ని ప్రమాదాల సమస్య లేదు. చెట్టును కొట్టేసినా ప్రతిభాగం ఉపయుక్తమే.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## అప్పడే పార్లమెంటు భవనం కురుస్తుంది?

బ్రిటీష్ కాలం నాటి కట్టడాలు ఈనాటికి చెక్కుచెదరకుండా ఉన్నాయి.మరి మనవాళ్లు కట్టినకట్టడాలు ఆరునెలలకే బీటలు వారుతున్నాయి. వెయ్యి కోట్లరూపాయలతో అత్యంత ఆధునికంగానిర్మించిన మన నూతనపార్లమెంటు భవనం ప్రారంభం జరిగి సంవత్సరం అవుతుంది. బేతాళ మాంత్రికులచే ప్రారంభంచేయించారు.ఇప్పుడు వర్షానికి పైనుండి నీరు కారుతుంటే కింద బకెట్లు పెట్టీ నీళ్లు పట్టుకుంటున్నారు.మోడీగారూ 150 కోట్ల దేశప్రజలకు అవమానంగా ఉంది. కోట్లాది రూపాయలతో నిర్మించిన చర్లపల్లి రైల్వే స్టేషన్ కూడా అప్పుడే ప్లాట్ ఫారంమీద నీళ్లు కురుస్తున్నాయి.అంతేకాదు వేలకోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్లు అన్ని పునర్నిర్మాణం చేస్తున్నారు. అవి కూడా అంతేనా అనే అనుమానంగా ఉంది. టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందింది. మరి అత్యంత ముఖ్యమైన పార్లమెంటు భవననిర్మాణంలో ఆటెక్నాలజీ, ఆనాణ్యత ఏమైనది?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ప్రకృతిని ఆరాధించాలి

**మానవ** జీవితంలో ఆయురారోగ్యాలతో కూడిన జీవితం గడపాలంటే స్వచ్ఛమైనగాలి,చాలా మెరుగైన పాత్ర పోషిస్తుంది. నిరంతరం మొక్కలు నాటుతూ ప్రకృతిని కాపాడుకోవాలి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందింపజేయాలి. మొక్కలను పెంచితే అవి అందరి జీవితాలను పెంపొందింపజేస్తాయి. విరివిగా మొక్కలు నాటుదాం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# వెయ్యి రోజుల ప్రజాపాలన విజయాలు, వైఫల్యాలు!



కొలను వెంకటేశ్వర రెడ్డి

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భం ఇది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని చెబుతోంది. మరోవైపు, హామీల అమలు,ఆర్థిక పరిస్థితి, వ్యవసాయం, ఉద్యోగాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ప్రభుత్వం తన పాలనను విజయాలుగా ప్రస్తావిస్తున్న 147అంశాలకే పరిమితం కాకుండా, ఆ పథకాల ప్రభావం ప్రజల జీవితాల్లో ఎంతవరకు కనిపించింది? ఎక్కడ ప్రభుత్వం విజయవంతమైంది?ఎక్కడ లోపాలు మిగిలాయి? అనే ప్రశ్నలను పరిశీలించాల్సిన సమయం ఇది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్లవరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు ప్రజల దైనందిన జీవితంపైప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ప్రత్యేకంగా ఈ పథకాలు ప్రభు త్వం సాధించిన ముఖ్యమైన సంక్షేమ విజయాలుగా చెప్ప వచ్చు. అయితే, ఈపథకాల దీర్ఘకాలిక ఆర్థిక భారం ఎంత? వాటి వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం ఏమి టి? అన్నది కూడా సమాంతరంగా పరిశీలించాల్సినఅంశమే. దీర్ఘకాలంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకాలు కొంత ఆశ కలిగించాయి. వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామక ప్రక్రియలు, డీఎస్సీ వంటి పరీక్షలు ప్రభుత్వం చేపట్టిన ప్రధాన చర్యల్లో ఉన్నా యి. ఉద్యోగాల సంఖ్య కంటే నియామక ప్రక్రియలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో నాణ్యత, నోటిఫికేషన్‌నుంచి నియామకం వరకు నిర్దిష్ట కాలపట్టిక ఉండటం మరింత కీలకం. ఈఆఫీస్, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు, భూభారతి వంటి కార్యక్రమాలు పరిపాలనను సులభతరం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తగ్గించి, సేవలను ప్రజల మొబైల్ ఫోన్లకు చేరువ చేయడం డిజిటల్ పాలనలో మంచి పరిణామం. అయితే డిజిటల్ సేవలు అందుబాటులో లేని గ్రామీణ, వృద్ధ, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న ప్రజలకు ప్రత్యామ్నాయ సేవావ్యవస్థ కూడా సమర్థంగాఉండాలి. అలాగే కులగణన, ఎస్సీ ఉపవర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదనలు వంటిఅంశాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సామాజిక న్యాయం దిశగా ముఖ్యమైనరాజకీయ అడుగులుగా నిలిచాయి. అయితే వీటి అమలు న్యాయపరమైన సవాళ్లను అధిగమిస్తూ, అన్ని వర్గాల ఆమోదంతో ముందుకు సాగడం ప్రభుత్వానికి కీలక పరీక్ష. సంక్షేమ పథకాలు కొనసాగించడంతో పాటు మూలధన వ్యయం,మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగాల సృష్టికోసం అవసరమైన పెట్టుబడులు పెట్టడం ప్రభుత్వానికి పెద్ద సవాలు. ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన, తరచూ నవీకరించే సమాచారం అందించడం ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచు



తుంది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉద్యోగ క్యాలెండర్,గృహ నిర్మాణం తదితర అంశాలు కీలకమైనవి. ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ,ప్రతిపక్షాలు మాత్రం కొన్ని హామీలు పూర్తిగా అమలు కాలేదని విమర్శిస్తున్నాయి. అలాగే ఉద్యోగ నియామకాల్లో పరీక్షల నిర్వహణ, కోర్టు వివాదాలు, నోటిఫికేషన్లలో జాప్యం వంటి అంశాలు యువతలో అసంతృప్తికి కారణం కాకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా రైతుల సమస్యలు ప్రభుత్వ పనితీరుకు కీలకమైన కొలమానం. యూరియా, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, పంటల కొనుగోలు అనంతరం రైతులకు చెల్లింపుల విషయంలో అప్పుడప్పుడు ఎదురవుతున్న సమస్యలు ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలు. రైతుకు పంట పండించడం ఎంత ముఖ్యమో, అవసరమైన సమయంలో ఎరువు,విత్తనం లభించడం,పంటకు గిట్టుబాటు ధర రావడం, అమ్మిన పంటకు సమయానికి డబ్బుఅందడం అంతేముఖ్యం. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పనితీరును ప్రకటనలతో కాకుండా, రైతుపొలంలో కనిపించే మార్పులతోనే కొలవాలి. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు,ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా చేపడుతున్న చర్యలకు ఒక వర్గం నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. మరోవైపు, నిర్మాణాల కూల్చివేతలు, మధ్యతరగతి కుటుంబాల ఆస్తులపై ప్రభావం, న్యాయపరమైన అంశాలపై విమర్శలు కూడా వచ్చాయి. మూసీ పునరుజ్జీవనం కూడా హైదరాబాద్ భవిష్యత్తుకు అవసరమైన భారీ ప్రాజెక్టుగా ప్రభుత్వం చెబుతోంది. కానీ అభివృద్ధి పేరుతో నివాసితుల పునరావాసం, పరిహారం, జీవనోపాధి వంటి అంశాలను విస్మరించకూడదు. ప్రాజెక్టు ఎంత గొప్పదైనా, దానివల్ల ప్రభావితమయ్యే కుటుంబాల కన్నీళ్లపై అభివృద్ధి నిర్మించకూడదు.ముందుగా సమగ్ర పునరావాసం, పరిహారం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించి, ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవడం మానవతా దృక్పథంగా ఉంటుంది. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది.పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తుకు ఆశాజనకమైన సంకేతాలే. కానీ అవగాహన ఒప్పందాలు కుదరడం ఒక దశ మాత్రమే. ఎన్ని కంపెనీలు వాస్తవంగా తెలంగాణలో పెట్టుబడి పెట్టాయి? ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి?ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు వచ్చాయి?ఎంత పెట్టుబడివచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానాలే పెట్టుబడుల విజయాన్ని నిర్ణయిస్తాయి. అలాగేకేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు,ప్రాజెక్టులు, అనుమతులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు విజయం సాధించింది అన్నదికూడా చర్చనీయాంశమే.ముఖ్యమంత్రి ఢిల్లీపర్యటనల సంఖ్యకంటే, వాటి ద్వారా తెలంగాణకు వచ్చిన ప్రయోజనాలే ప్రజలకు ముఖ్యం.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను ఒకే రంగుతో అంచనా వేయడంసరైనది కాదు. ప్రజలకు సంక్షేమం, యువతకు ఉద్యోగాలు కావాలి, రైతుకు భరోసా కావాలి.వ్యాపారికి స్థిరమైన వాతావరణం కావాలి. పెట్టుబడిదారుడికి నమ్మకం, రాష్ట్రానికి ఆర్థిక క్రమశిక్షణ కావాలి. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించగలిగితేనే వెయ్యిరోజుల పాలనకు నిజమైన అర్థం ఉంటుంది. ప్రభుత్వం చెప్పే విజయాలు ఒక వైపు, ప్రతిపక్షాలు చేసే విమర్శలు మరోవైపు కానీ అంతిమంగా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే ప్రభుత్వ పనితీరుకు అసలు కొలమానం. వెయ్యిరోజులు పూర్తయ్యాయి ఇక మిగిలింది ఫలితాల కాలం. ప్రజలు ప్రశ్నిస్తారు, ప్రభుత్వం సమాధానం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## సాక్షి శ్రీ భావదేవుని క్షేత్రం విశిష్ట ఆధ్యాత్మిక క్షేత్రం

**-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్**

**పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త:** సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం పొన్నూరు ప్రాంత ప్రజలకే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కూడా ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. భావనారాయణస్వామి



దేవాలయ ప్రాంగణంలో రూ.45లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మాణం చేసిన పురాణ కాలక్షేప మండపాన్ని సోమవారం ఆయన జనసేన నాయకుడు వడ్లమాను మార్కండేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ దేవాలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, ఆలయ ప్రాశస్త్యాన్ని మరింతగా పెంచే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేక వేదిక నూతనంగా నిర్మించిన పురాణ కాలక్షేప మండపం ద్వారా పురాణ ప్రవచనాలు, హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, ధార్మిక కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకమైన వేదిక అందుబాటులోకి వచ్చిందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక విలువలను భవిష్యత్ తరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో కీలకమన్నారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించడం దేవస్థానం అభివృద్ధిలో ముఖ్యమైన భాగమన్నారు.

**ప్రభుత్వం, దేవస్థానం భాగస్వామ్యంలో అభివృద్ధి:** దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఏపీ ప్రభుత్వ సర్వశ్రేయోనిధి నుంచి రూ.30లక్షల నిధులు మ్యాచింగ్ గ్రాంట్‌గా అందించడం, అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో రూ.15లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌గా సమకూర్చడం ద్వారా ఈ భవన నిర్మాణం పూర్తయిందని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ వివరించారు. ప్రభుత్వ నిధులతో పాటు దేవస్థానం నిధులను సమర్థవంతంగా వినియోగించి భక్తులకు ఉపయోగపడే శాశ్వత వసతిని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. శ్రీ భావనారాయణస్వామి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, భక్తుల సౌకర్యాలను మరింతగా పెంచేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, పద్మావతి, ఆకురాతి అనూరాధ, గుడివాడ పవన్‌కుమార్, కాట్రగడ్డ రామచంద్రరావు, సింహాద్రి వెంకటలక్ష్మి, ఈటుకూరి భాజీ శిరీష, కూరాకుల సత్యనారాయణ, వరాకారం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## హోంగార్డును అభినందించిన జిల్లా ఎస్పీ

**గుంటూరు క్రైమ్, ఆగస్టు 31,ప్రభాతవార్త:** హాఫ్ మారథాన్ (21 కి.మీ) లో పాల్గొని కంప్లీట్ చేసిన హోంగార్డు 351.జి కృష్ణ కిషోర్ ను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. ఈ నెల 30, వ తేదీ లో హైదరాబాద్ లో నిర్వహించిన ఎన్.ఎమ్.డి.సి హైదరాబాద్ మారథాన్ పరుగు 2026 పందెంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డ్ గా పనిచేస్తున్న జి. కృష్ణ కిషోర్ పాల్గొని అసాధారణమైన 21 కిలోమీటర్ల పూర్తి మారథాన్ పరుగును కేవలం గంటలు 1. 40 నిముషాలు 50 సెకన్లో పూర్తి చేసి, 87 ర్యాంక్ సాధించారు. దాదాపు 6394 మంది పోటీల్లో ఈ పూర్తి మారథాన్ పరుగులో పాల్గొని కేవలం 1 గంట,40 నిముషాలు 50 సెకన్లో పరుగును పూర్తి చేసిన హోంగార్డు కిషోర్, జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలవగా, హోంగార్డును అభినందించారు. గుంటూరు జిల్లా పోలీసు తరుపున మీరు ఈ పరుగును పూర్తి చేయడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని మార థాను లో పాల్గొని పతకాలు సాధించాలని ఎస్పీ ప్రోత్సహించారు.

## ప్రజలందరికీ వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని

**ప్రత్తిపాడు (పెదనందిపాడు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం, పెదనందిపాడు మండల కేంద్రంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులుతో కలిసి కేంద్ర కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణ అభివృద్ధి,





కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రజలకు వైద్య సేవలు, మహిళలకు ప్రసవ సదుపాయాలు, ప్రాథమిక చికిత్సలు అందుబాటులో ఉండే విధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.93 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించడం జరిగిందన్నారు.

జిజిహెచ్ వంటి జిల్లా ప్రధాన ఆసుపత్రిపై భారం పడకుండా ఇలాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సమస్యలకు ప్రధాన పరిష్కార మార్గంగా పనిచేసినప్పుడే గ్రామ గ్రామానికి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. గతంలో నిర్మించిన భవనం స్లాబ్ సరిగా లేకపోవటం, అలాగే ఉప్పునీటి సమస్య కారణంగా భవన నిర్మాణం పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడం జరిగిందని వెల్లడించారు. ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు కూడా ఈ నిర్మాణంలో భాగస్వామ్యులై, ఈ నిర్మాణం మనది అనే భావనతో దగ్గరుండి పర్యవేక్షించి, నిర్మాణానంతరం కూడా నిర్వహణ విధానాన్ని గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ..గత వైసిపి పాలనలో ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిరక్ష్యానికి గురైందని, చిన్నచిన్న మరమ్మతులున్నాయని, ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్నవాళ్ళు లేరని విమర్శించారు. చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందన్నారు. దీంతో నూతన భవన నిర్మాణం అవసరం ఏర్పడిందని తెలియజేశారు.

కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో ఈ భవనానికి రూ.1.93 కోట్ల నిధులను సమకూర్చడం జరిగిందని చెప్పారు. అలాగే గుంటూరు ఛానల్ ఎక్స్టెన్షన్ రూ.275 కోట్లు, గుంటూరు ఛానెల్ విస్తరణ పనులకుగానూ మరిన్ని కోట్లతో నిధులు సమకుర్చడంతో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. మన గ్రామ ప్రజల చిరకాల కోరిక అయినా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని ఆధ్వర్యంలో భూమి పూజ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. రానున్న రోజుల్లో ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరిహారం అందజేత

### పరిహారం చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి,ఎంపీ లావు,కలెక్టర్ కృతికాశుక్లా

**చిలకలూరిపేట,ఆగస్టు 31,ప్రభాతవార్త :** ప్రమాదాల్ని, మరణాల్ని, దుర్ఘటనల్ని రాజకీయం చేసే దుస్థితికి తాము, తమ ప్రభుత్వం దిగజారలేదని, కొందరు స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసమే చిలకలూరిపేటలో 27వ తేదీన జరిగిన (26 అర్ధరాత్రి) రోడ్డు ప్రమాదాన్ని రాజకీయం చేశారని, వారంతా నేడు ఏం సమాధానం చెబుతారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. సోమవారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకలెక్టర్ కృతికా శుక్లా, సీపీఐ నేత ఈశ్వరయ్యలతో కలిసి పట్టణ మున్సిపల్ కౌన్సిల్ హాల్లో రోడ్డు ప్రమాద మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఒక్కోకుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మృతుల కుటుంబసభ్యులకు రూ.80 లక్షల నగదు చెక్కుల్ని స్వయంగా అందించిన అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, సీపీఐ నేత ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడారు.

**మృతుల కుటుంబాల పేదరికంపై స్పందించే ముఖ్యమంత్రి మానవతా ధృక్పథంతో ఆర్థిక సాయం అందించారు.**

రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు నాతోసహా, ఎంపీ లావు, ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి, అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేశామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటన జరిగిన తీరు, మృతుల కుటుంబాల పేదరికం, వారి దుస్థితి చూశాక నాతో సహా, అందరం ఎంతో బాధపడ్డామన్నారు. జరిగిన దుర్ఘటనను, మరణించిన దళితులు, వారి కుటుంబాల దుస్థితిని ముఖ్యమంత్రికి తెలియచేయడంతో ఆయన మానవతా దృక్పథంతో స్పందించి, నిన్న ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం ప్రకటించారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం, మంచి, మానవత్వమున్న ముఖ్యమంత్రి ఉండబట్టే నేడు వేలూరు గ్రామ మృతుల కుటుంబాలకు న్యాయం జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఈ విధంగా ఆదుకున్న దాఖలాలు లేవని ప్రత్తిపాటి చెప్పారు. పేద దళిత కుటుంబాలకు అండగా నిలిచి, సకాలంలో వారిని ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ లకు మృతుల కుటుంబసభ్యులు, నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**తమ స్వార్థ ప్రయోజనాల కోసం వైసీపీనేతలు దుర్ఘటనపై రాజకీయాలు చేశారు.**

రోడ్డు ప్రమాద దుర్ఘటనను కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి ఎంతగానో తాపత్రయపడ్డారని, ఆ క్రమంలో బాధిత కుటుంబ సభ్యుల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు.. క్షతగాత్రులకు అందాల్సిన వైద్యసేవలతో పాటు.. మృతుల కుటుంబాల్ని ఎలా ఆదుకోవాలన్న దానిపై నేను, ఎంపీ లావు, పల్నాడు ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి దృష్టి పెడితే, ఆ స్వార్థపరులు పార్టీలు, కులాల ముసుగులో తమ రాజకీయ ప్రయోజనాలకోసం పాకులాడారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందదని తెలిసినప్పటికీ, ఈ దుర్ఘటనను యంత్రాంగం ప్రత్యేకంగా పరిగణించేలా, మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు నేను, ఎంపీ, మంత్రి గొట్టిపాటి అన్నిరకాలుగా ప్రయత్నించామన్నారు. తమ ప్రయత్నాల్లో తాముంటే.. కొందరు కావాలనే తనపై, టీడీపీపై, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే రూ.5 లక్షలే ఇప్పిస్తున్నారని, అదీ కొందరికే ఇస్తున్నారని నానా యాగీ చేశారని ప్రత్తిపాటి తెలిపారు. రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలతో పాటు, వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులకు అన్నివేళలా అండగా నిలుస్తామని, ప్రభుత్వం తరుపున వారిని ఆదుకుంటామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు సహాయసహకారాలు అందించడంలో తమ వంతు కృషి చేసిన జిల్లా కలెక్టర్, సీపీఐ, ఎం.ఆర్.పీ.ఎస్ నాయకులు, పోలీస్, రెవెన్యూ, ఆర్ బీ విభాగాల ప్రధానాధికారులు అందరికీ ఈ సందర్భంగా ప్రత్తిపాటి



పేరుపేరునా అభినందనలు తెలియచేశారు. ప్రభుత్వం, యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఎంత బాధ్యతగా వ్యవహరించామో మృతుల కుటుంబసభ్యులు తెలుసుకోవాలన్నారు.

**రోడ్డుపై కూర్చుంటేనో, ధర్నా చేస్తేనో ప్రభుత్వ సాయం రాలేదని తెలుసుకోండి : ఎంపీ లావు**

రోడ్డు ప్రమాద దుర్ఘటన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేసిందని, ఈనాడు వారికి మేలు కలిగిందంటే దానికి ప్రధాన కారకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావేనని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. జరిగిన దుర్ఘటన తమను ఇప్పటికీ బాధిస్తూనే ఉందని, నేడు మృతుల కుటుంబాలకు అందిన ప్రభుత్వసాయం ఎలా వచ్చిందో ఆలోచించుకోవాలన్నారు. కొందరు తమ స్వప్రయోజనాలకోసం మృతుల కుటుంబసభ్యుల్ని తప్పుదోవ పట్టించారని, వారి చర్యలతో తాము రోడ్లపైకి వస్తేనో, ధర్నాలు చేస్తేనో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనట్లు భ్రమపడవద్దని ఎంపీ లావు సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు మాట్లాడారని, తమను, ప్రభుత్వాన్ని విమర్శించారని తాము ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలవలేదని, మృతుల కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించామని లావు స్పష్టం చేశారు. కులం, మతం, ప్రాంతమనే అంశాలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగానే బాధిత కుటుంబాలకు తాము అండగా నిలిచామన్నారు.

**ఎమ్మెల్యే, ఎంపీ కృషి వల్లే మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం : కృతికా శుక్లా (పల్నాడు కలెక్టర్)**

ప్రమాదం జరిగినప్పుడే ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి తమతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ఎలా న్యాయం చేయాలి, ఆ దిశగా ప్రభుత్వాన్ని ఎలా ఒప్పించాలనే దానిపై నాతో నిత్యం మాట్లాడుతూనే ఉన్నారు. వారి కృషి వల్లే నేడు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున భూమి ఇవ్వాలని అడిగారు. ప్రభుత్వ పథకాలు, నిబంధనల ప్రకారం అర్హులకు అసైన్డ్ భూములు కేటాయిస్తారు. ఈ దుర్ఘటనలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు కృషి వల్లే ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.80 లక్షల ఆర్థిక సాయం అందించింది. జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో ఎక్కువ శాతం నిరక్ష్యం వల్లే జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్స్ వద్ద వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలప్రజలు హైవేపైకి వచ్చేటప్పుడు నిబంధనలు పాటించాల్సిందే." అని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

**నరసరావుపేట, ఆగస్టు 31 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సెప్టెంబర్ 2న నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దగ్గరుండి పరిశీలిస్తున్నారు. పర్యటనలో భాగంగా జెఎన్‌టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నరసరావుపేటలో నిర్మించిన హాస్టల్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ బీటీ నాయుడుతో కలిసి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఏఎం రెడ్డి కళాశాల సమీపంలో నిర్వహించనున్న నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాడర్ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## మాచర్లలో నేడు కూటమి నేతల సుడిగాలి పర్యటన

- రూ.146 కోట్ల అమృత్ 2.0 శాశ్వత త్రాగునీటి పథకానికి శంకుస్థాపన
- రూ.7.43 కోట్లతో నిర్మించిన పలు నూతన భవనాలకు ప్రారంభోత్సవాలు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పర్యటన

**మాచర్ల టౌన్ ఆగష్టు 31, ప్రభాతవార్త:** నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ దృఢ సంకల్పమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు మాచర్ల నియోజక వర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించ నున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పర్యటనలో భాగంగా తొలుత



మాచర్ల పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో రూ.146 కోట్లతో అమృత్ స్కీమ్ 2.0 కింద చేపట్టనున్న శాశ్వత తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మాచర్ల మండలంలోని చెంచు కాలనీలో రూ.55 లక్షలతో నిర్మించిన ఐటీడీఏ హెల్త్ సెంటర్, కొప్పునూరు గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వెల్దుర్తి మండలంలో పర్యటించనున్న మంత్రి,ఎంపీ, ఉప్పలపాడు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.2.55 కోట్లతో నిర్మించిన వసతి గృహం,రూ.60 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, అలాగే రూ.55 లక్షలతో నిర్మించిన ఐటీడీఏ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను కూడా ప్రారంభించనున్నారు.అనంతరం భోజన విరామం తర్వాత రెంటచింతల మండలంలో పర్యటిస్తారు. రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్‌లో రూ.2.25 కోట్లతో నిర్మించిన నూతన వసతి గృహ భవనాలను ప్రారంభించనున్నారు.గోలి గ్రామంలో రూ.1.93 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారు.పర్యటన ముగింపులో రెంటాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,స్వర్గీయ నందమూరి తారక రామారావు నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొననున్నారు.నియోజకవర్గంలో ఒకేరోజు పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు మెరుగైన త్రాగు నీరు,వైద్యం,విద్య, మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి కోరారు.

## ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

### పాస్‌పోర్టు పునరుద్ధరణకు రూ.5 లక్షల డిమాండ్

**మాచర్ల టౌన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** విదేశీయుడి పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో మాచర్లలో ప్రత్యేక విభాగంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటన మాచర్ల పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాచర్లలో నివాసముంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి తన పాస్‌పోర్ట్ గడువు ముగియడంతో పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియలో భాగంగా తనను సంప్రదించిన కానిస్టేబుళ్లు పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా, కానిస్టేబుళ్లకు డబ్బులు అందించినట్లు బాధితుడు విచారణ సందర్భంగా వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రాథమిక విచారణ ఆధారంగా మాచర్లలోని ప్రత్యేక విభాగానికి చెందిన కానిస్టేబుల్‌తో పాటు జిల్లా కార్యాలయంలో అతనికి సహకరించిన మరో కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

**గత ఆరోపణలపైనా విచారణ..**

సస్పెన్షన్‌కు గురైన మాచర్ల కానిస్టేబుల్‌పై గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలపైనా ఉన్నతాధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా పోలీసు శాఖకు సంబంధించిన సమాచారాన్ని వైకాపా నాయకులకు చేరవేశారన్న ఆరోపణలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఒకవైపు విదేశీయుడి పాస్‌పోర్ట్ వ్యవహారంలో భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం, మరోవైపు గత ఆరోపణలపై విచారణ కొనసాగుతుండటంతో ఈ వ్యవహారం పోలీసు శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**పేరు మార్పు**

నా పాత పాస్‌పోర్ట్ నంబరు:k9439576 లో మా తల్లి గారి పేరు "నిర్మల జాగు" గా తప్పుగా నమోదైంది. నా స్థానిక నోటరీ అఫిడవిట్ మరియుఆమె ఆధార్ కార్డు నంబరు 9323 4921 9079 ప్రకారం, ఆమె సరైన పేరు "జాగు నిర్మలకుమారి" అని తెలియజేస్తున్నాను. నా పేరు జాగు గోపాలకృష్ణ, తండ్రి పేరు దివంగత బ్రహ్మం జాగు. నా నివాస చిరునామా: 12-10-16,శివాలయం వీధి, యమహా షోరూమ్ ఎదురుగా, కొత్తపేట, గుంటూరు -- 522001. అఫిడవిట్ చేసిన తేదీ: 31 ఆగస్టు 2026.

**ఒరిజినల్ దస్తావేజు పోయినది**

ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ టౌన్ 4వలైను డోర్ నెం. 41-1/9-7 రు కాపురస్తురాలు గడ్డం మోహనకృష్ణ గారి భార్య నాగలక్ష్మి గారికి చెందిన ద.నెం.2542 - 2008 రుగా కొండముది గ్రామ డి.నెం. 307/1, 307/2 రు దాఖలా య.95 సెంట్లు మాగాణి భూమికి చెందిన ఒరిజినల్ దస్తావేజులు 25-7-26న పొన్నూరు టౌన్ ఐలెండ్ సెంటర్ నందు జిరాక్స్ తీసుకొని వస్తుండగా పోయినవి దొరికిన వారు ఈ క్రింది నెం. సంప్ర: 9848754777.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు విజయపురి 5వ లేను ఎదురుగా, జెకెసి కాలేజ్ రోడ్డు, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:

ఋణగ్రహీత: శ్రీ సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్, 4 -174, 4వ వార్డు, ఇపురుపాలెం, చీరాల, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్-523166.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, చీరాల-1 బ్రాంచ్ నుండి శ్రీ సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్ వారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & అకౌంట్ నెం. | లోన్ మొత్తం & లోన్ తేదీ | తేదీ.23.08.2026 నాటికి బకాయి వడ్డీతో కలిపి | వడ్డీ రేటు |
|---|---|---|---|
| 619 - House Finance A/c No.0896619007978 | రూ. 35,70,000/- తేది: 25.06.2020 | రూ. 29,97,050/- వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి | 8.50% |
| 619 - House Finance A/c No.160000556311 | రూ. 5,50,000/- తేది: 11.02.2022 | రూ. 3,87,407.59/- వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి | 8.50% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది.23.08.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన బకాయి రూ.33,84,457.59/- (అక్షరాల ముప్పై మూడు లక్షల ఎనభై నాలుగు వేల నాలుగు వందల యాభై ఏడు రూపాయల యాభై తొమ్మిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ప్రకాశం జిల్లా, చీరాల సబ్-జిల్లా, చీరాల మండలం, ఇపురుపాలెం గ్రామం, సర్వే నెం. 240/6, పాత బ్లాక్ నెం. 4, పాత డోర్ నెం. 4-130, ప్రస్తుత బ్లాక్ నెం. 3, ప్రస్తుత డోర్ నెం. 3-128, అసెస్‌మెంట్ నెం. 628 కలిగిన 233 చ॥గ॥లు లేదా 194 చ॥మీ॥ల స్థలంలో రెసిడెన్షియల్ ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు గల బిల్డింగ్. హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు -24.04 అ॥లు, దక్షిణం: పంచాయతీ రోడ్డు - 77.06 అ॥లు, పడమర: కామంచి శ్రీను యొక్క ఆస్తి - 29-09 అ॥లు, ఉత్తరం: కోడాలి జానకి యొక్క స్థలం - 44.04 అ॥లు, ఎ. పడమర: డిట్టో - 2.00 అ॥లు, ఎ. ఉత్తరం: డిట్టో - 31.00 అ॥లు.

టైటిల్ హోల్డర్: శ్రీ. సయ్యద్ ఖాదర్, తండ్రి: ఉమర్.

తేదీ: 24.08.2026, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

MN 10 final:MN 10 final 01/01/2001 09:40 Page 1



# భక్తుల విశ్వాసానికి అనుగుణంగా చర్యలు చేపడతాం

## -ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

**పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త:** భక్తుల విశ్వాసానికి అనుగుణంగా చర్యలు చేపట్టేవిధంగా ధర్మకర్తల మండలి సభ్యులందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి



చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు కూడా దేవాలయం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వం, ప్రజలు, భక్తుల భాగస్వామ్యంతో దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ఆలోచన చేయాలన్నారు. దేవాలయ అధికారులు, పూజారులు దేవాలయం యొక్క ఆదాయాన్ని పెంచేవిధంగా ఆలోచన చేయాలన్నారు. దేవాలయానికి భక్తుల సంఖ్య పెరిగినప్పుడు దానంతటదే ఆదాయం కూడా సమకూరుతుందన్నారు. భక్తులు దేవాలయానికి వచ్చేవిధంగా చూడాల్సిన బాధ్యత ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములపై ఆధారపడి ఉందన్నారు. అన్ని దేవాలయాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేవిధంగా అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మంతెన అనుపమ, ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, గుడిపాడ పవన్‌కుమార్, కాట్రగడ్డ రామచంద్రరావు, సింహాద్రి వెంకటలక్ష్మి, ఊటుకూరి భాజీ శిరీష, కూరాకుల సత్యనారాయణ, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ పావులూరికి ప్రతిష్టాత్మక డిస్టింగ్విష్ ఫెలో గౌరవం

## ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి అరుదైన గుర్తింపు

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా, వేట్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావుకు ప్రతిష్టాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలో గౌరవం లభించింది. అంతరిక్ష రంగం ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని ప్రదానం చేసింది. అంతరిక్ష ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీ రంగాలకు డాక్టర్ పావులూరి సుబ్బారావు అందించిన అత్యుత్తమ సేవలు, అలాగే దేశానికి ఆయన చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందించినట్లు ఏఎస్ఐ జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రకటనపత్రంపై ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ఇస్రో ఛైర్మన్, భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖ కార్యదర్శి డాక్టర్ వి.నారాయణన్ సంతకం చేయడం విశేషం. అంతరిక్ష ఏరో స్పేస్ రంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావుకు ఏఎస్ఐ నుంచి ఈ ప్రతిష్టాత్మక గౌరవం లభించడం విజ్ఞాన్స్ యూనివర్సిటీకి గర్వకారణమని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పావులూరి సుబ్బారావు మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు నాలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. దేశంలో అంతరిక్ష విజ్ఞానం, సాంకేతిక పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభించేలా కృషి చేయడం, ముఖ్యంగా యువతలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, పరిశోధనా ఆసక్తిని పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఈ గౌరవాన్ని నా సేవలకు లభించిన గుర్తింపుగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరింతగా అంకితభావంతో పనిచేయడానికి లభించిన ప్రేరణగా భావిస్తున్నాను, ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందించిన ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పావులూరి సుబ్బారావుకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందనలు తెలిపారు.



# చేనేత సమస్యల పై భవిష్యత్ కార్యాచరణ

**రేపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేత గొట్టుముక్కల



బాలాజీ తెలిపారు.సోమవారం భట్టి ప్రోలు చేనేత సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 2వ తేదీ మంగళగిరిలోని శ్రీ మార్కండేయ పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులు,ఐక్య కార్యాచరణ కమిటీ కార్యనిర్వహణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం రూ.203 కోట్ల బకాయిపడిందని తెలిపారు.తక్షణమే బకాయిలను చెల్లించి చేనేత సహకార సంఘాలను ఆర్థిక పరంగా ఆదుకోవాలని ఆయన కోరారు.ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.జీఎస్టీ రీయంబర్స్‌మెంట్‌తో పాటు చేనేత సహకార సంఘాల రుణ మాఫీకి సంబంధించిన జీవోను విడుదల చేయాలని బాలాజీ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు మురుగుడు సత్యనారాయణ,కొడాలి రామకోటేశ్వరరావు,వి.శ్రీనివాసరావు,బట్టు నాగమల్లేశ్వరరావు, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.


# అగ్గిపెట్టి కోసం హత్య.. నిందితుని అరెసు..

**వేమూరు, ఆగస్టు 31, (ప్రభాతవార్త) :** చిన్న గొడవ చిలికి చిలికి గాలి వానలా మారినట్లు చివరకు ఓ వ్యక్తి ప్రాణం కోల్పోవటం జరిగిందని రేపల్లె డిఎస్పీ అబ్దుల్లాజీస్ తెలిపారు. బాపట్ల జిల్లా వేమూరు మండలం వెల్లబాడు గ్రామంలో అగ్గిపెట్టె కోసం జరిగిన చిన్నపాటి గొడవ చివరకు హత్యకు దారి తీసిందన్నారు. మద్యం సేవించిన యోహాను, చరణ్ మధ్య అగ్గిపెట్టె విషయంలో వివాదం జరిగిందని, అగ్గిపెట్టె ఇవ్వలేదని కోపంతో చరణ్ ఇంటికి వెళ్ళి కత్తి తీసుకొచ్చి యోహానును వెనుక పైపు పొడిచారన్నారు. తీవ్రంగా గాయపడిన యోహానను 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అధిక రక్తస్రావం కావటంతో మృతి చెందాడని వైద్యులు తెలిపారన్నారు. ఘటన అనంతరం పరారైన నిందితుడు చరణ్‌ను పోలీసులు అరెస్టు చేయటం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఈ ఘటనపై వేమూరు సిఐ నజీర్ బాష ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నాయన్నారు. ఒక గొడవలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనపుడు వెంటనే 112కు పోన్ చేయాలని డిఎస్పీ అబ్దుల్ అజీజ్ ప్రజలకు సూచించారు. సమయానికి పోలీసులకు సమాచారం అందిస్తే ఇలాంటి తీవ్ర ఘటనలను నివారించవచ్చునని డిఎస్పీ తెలిపారు.




# పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటన

వేమూరు ఆగస్టు 31 (ప్రభాతవార్త) : పంచాయితీరాజ్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎని న్కల కమీషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద



ఆయన మాట్లాడుతూ మండలంలోని 17గ్రామాల పరిధిలోని 166పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అందులో పోతుమర్రులో రెండు కేంద్రాలను కొన్ని అభ్యంతరాల వల్ల మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వాటి స్థానంలో కొత్తగా గుర్తించిన వాటి వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపి ఆమోదాన్ని పొందినట్లు తెలిపారు. 17గ్రామాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల జాబితాలను వివరించగా ప్రకటించామన్నారు. అలాగే మండల స్థాయి జాబితాలను మండల పరిషత్ కార్యాలయంతో పాటు తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడా ప్రకటించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు కోటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

**రేపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రేపల్లె-పెనుమూడి రహదారి మార్గంలోని బాణాసంచా గోదాముకు సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్న కారణంగా ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇరువురు గాయపడ్డారు.క్షతగాత్రులను వైద్యచికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు చెందిన నడకుదుటి సాయిచరణ్(22) మృతి చెందాడు.మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పిజిఆర్ఎస్‌కు 9 అర్జీలు

**రేపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:** పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు 9 అర్జీలను అందజేశారు.నగరం మండలంలోని ధూళిపూడి ఎస్సీ ఎస్టీ కాలనీలో మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించాలని,రేపల్లె మండలంలోని కారుమూరు-వేజళ్ళవారిలంక గ్రామాల మధ్య ప్రభుత్వ ఆక్రమణలను తొలగించాలని,రేపల్లె మండలంలోని పోటుమెరకలో భూమికి సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని,భట్టి ప్రోలు మండలంలోని పలె ్లకోనలో రీసర్వే పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు.నగరం మండలంలోని ధూళిపూడిలో అన్యాక్రాంతమైన చెరువు వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని,కొల్లూరు మండలంలోని గాజుల్లంక ఇసుకరీచ్‌లో ఇసుక పొందేందుకు అనుమతిని మంజూరు చేయాలని,నగరం మండలంలోని పూడివాడలో ఆక్రమణలను తొలగించాలని,అల్లపర్రులో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ అర్జీలు అందజేశారు.

# సెప్టెంబరు 1,2,3 తేదీలలో న్యాయవాదుల నిరసన

**రేపల్లె, ఆగస్టు 31, ప్రభాతవార్త:** న్యాయవాద వృత్తి సభ్యులకు తగిన రక్షణ,భద్రత కల్పించేందుకు అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా పూర్ణచంద్రరావు సోమవారం తెలిపారు.సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 11 గంటలకు న్యాయస్థానం వద్ద నిరసన ధర్నా చేస్తామని చెప్పారు.2వ తేదీ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం,3వ తేదీ రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసే కార్యక్రమాలు జరుగుతాయని న్యాయవాదులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

# ఆక్రమణదారుల చెర నుండి బెరాకా చర్చి ని కాపాడండి : ఆర్డీఓకు విజ్ఞప్తి

**తెనాలి ఆగస్టు 31,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం ఐతానగర్ నందు గల బెరాకా ప్రార్థన మందిరం ద సొసైటీ ఆఫ్ ట్రస్టీస్ ఆఫ్ ఇండిజీనస్ చర్చెస్ ఇన్ ఇండియా (రిజిస్టర్ నం. 114/1971)అను సొసైటీకి చెందిన ఆస్తి. అయితే ఇక్కడ ఎన్.సత్య నారాయణ, కె.సామ్యూల్, బి.లూథర్ పాల్ అను వ్యక్తులు ఈ చర్చిని ఆక్రమించుకొని తమ స్వంత వ్యక్తిని పి.శాంసన్ ను పాస్టర్‌గా పెట్టుకొని చర్చిని దోచుకుంటున్నారు.ఈ పాస్టర్ సంఘస్తులలో చీలికలను తీసుకొచ్చి అనేక గొడవలను సృష్టిస్తున్నారు. అయితే సొసైటీ వారికి మాత్రమే చర్చి కి పాస్టర్ ను నియమించే అధికారం ఉంటుంది. అయితే సొసైటీ నియమించిన పాస్టర్ ను రానీయకుండా ఈ దురాక్రమణదారులు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు.ఈ విషయమై హెడ్ ఆఫీసు నుండి సొసైటీ కి చెందిన వ్యక్తులు సోమవారం ఆర్డిఓ ని కలిసి రెవిన్యూ రికార్డ్స్ పరిశీలించి ఈ ప్రాపర్టీ సొసైటీకి చెందినదని, దురాక్రమణదారులకు సంబంధం లేదన్న విషయాన్ని ధ్రువీకరించవలసిందిగా మనవి చేయగా ఆర్డిఓ శ్రీరమణి సానుకూలంగా స్పందించి తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



# ఎమ్మెల్యేని కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

**పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త:** పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట రవిశంకర్, సభ్యులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను కలిశారు. ఇటీవల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంఖుస్థాపన చేయించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అభివృద్ధి పథంలోకి వెళ్ళే విధంగా చూడాలన్నారు. కళ్యాణమండపాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్ది వినియోగంలోకి తెచ్చేందుకు శక్తివంచన లేకుండా నూతన సంఘం కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోటా రవిశంకర్, నాయకులు శిఖాకొల్లి గుర్నాధరావు, తవ్వా విజయ్, తాటికొండ సుధీర్, లింగమల్లు మోహనకృష్ణ, మెడతాటి సునీల్ తదితరులున్నారు.



# మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు 31(ప్రభాతవార్త):** ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (గ్రీవెన్స్) కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా ఇంజనీరింగ్ సెక్షన్ కి



సంబంధించి,స్థలం సర్వే చేయాలంటూ శామియేలు అనే వ్యక్తి ఇచ్చిన అర్జీ, అలాగే డ్రైన్లేజి దుర్వాసన వస్తుందని, శుభ్రం చేయించాలంటూ శివప్రసాద్ అనే వ్యక్తి ఫిర్యాదు, అదేవిధంగా షేక్ మస్తాన్ షరీఫ్ వికలాంగుల పెన్షన్ కొరకు చేసిన వినతి. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు

# రైలు ప్రమాద మృతునికి అంత్యక్రియలు

**తెనాలి ఆగస్ట్ 31(ప్రభాతవార్త):** రైలు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని మృతదేహానికి, సోమవారం రైల్వే పోలీసుల సూచనల మేరకు,శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.సుమారు 15 రోజులు క్రితం చుందూరు పరిసరల ప్రాంతలో ముళ్ల కంపలో రైలు నుండి జారిపడిన సుమారు 45సం గల ఒక మగ వ్యక్తి పడి మరణించగా ఎవరు చూడకపోవుట వలన క్షీణించి పోయిన మృతదేహాన్ని ఆగస్ట్ 29 వ తారీకున జి.ఆర్.పి పోలీసులు పరిశిలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీ నందు భద్రపరిచాగా గత 2 రోజులు విచారించగా మృతుడి వివరాలు ఏమి తెలియకపోవటంతో అప్పటికే క్షీణిస్తున్న మృతదేహాన్ని అంత్య క్రియలు నిమిత్తం సోమవారం శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను కు జి. ఆర్.పి పోలీసులు తెలపగా వెంటనే స్పందించి సేవా సమితి సభ్యులును కలుపుకోని తమ వాహనంలో మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డు లోని మహా ప్రస్తనంలో తరలించి సాంప్రదాయ పద్ధతిలో కననం చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలోపోతురాజు, సంజయ్,అబ్రహం మరియు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

## -ఎంఈవో ఝాన్సీలత

**కొల్లిపర,ఆగష్టు 31 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో ఝాన్సీలత



పేర్కొన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపర ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించి రికార్డులు.. హాజరు పట్టీలు పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఝాన్సీలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ..విద్యార్థుల యొక్క పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

# నేడు వట్టిచెరుకూరులో శాశ్వత ఇంటిపట్టాల పంపిణీ


**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** వట్టిచెరుకూరు మండల కేంద్రంలో శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నేడు నిర్వహిస్తున్నట్లు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసరావు, ఇన్చార్జి తహసిల్దార్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ..నేడు మండలంలో నిర్వహించనున్న కృతజ్ఞతా సభకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ, మరియు ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని 515 కుటుంబాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో తప్పకుండా సభకు హాజరై, మంత్రివర్యులు మరియు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా తమ పొజిషన్ సర్టిఫికెట్‌ను స్వీకరించాలని కోరారు. ఈ పొజిషన్ సర్టిఫికెట్ భవిష్యత్తులో ఇంటి రిజిస్ట్రేషన్ మరియు ఇతర రెవెన్యూ ప్రక్రియలకు ఎంతో ముఖ్యమైన ఆధారంగా ఉపయోగపడుతుందని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పకుండా సర్టిఫికెట్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వట్టిచెరుకూరు గ్రామ ప్రజల సమస్యకు పరిష్కారం చూపి 515 కుటుంబాలకు భరోసా కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మనమందరం కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అత్తింటి వారిపై కోడలు ఫిర్యాదు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** అనేక మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కోడలు పొదిల జ్యోత్స్న సోమవారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. జ్యోత్స్న తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా, తాడికొండ నియోజకవర్గం, మండలంలోని పొన్నెకల్లు గ్రామం, దళితవాడకు చెందిన నన్ను, గత ఐదేళ్ల క్రితం గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలం, గ్రామానికి చెందిన కాకుమాను మాణిక్యారావు కుమారుడు కాకుమాను వేణు బాబుకు కట్న కానుకలన్ని ఇచ్చి పెద్దల సమక్షంలో నా తల్లిదండ్రులు ఘనంగా వివాహం జరిపించారు. మా దంపతులకు ఒక బాబు, ఒక పాప జన్మించారు. మా సంసారం సాఫీగా సాగుతున్న క్రమంలో మా దంపతులు మధ్య నా అత్తమామల వల్ల గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ గొడవలు చివరికి మా భార్యాభర్తలు విడిపోయే వరకు వచ్చాయి. నా అత్తమామ, నా భర్త మేనత్త, నాయనమ్మ నన్ను అకారణంగా అనుమానిస్తూ, చీటికిమాటికి నాపై నా భర్తకు విరక్తి కలిగే విధంగా చాడీలు చెబుతూ భౌతికంగా దాడి చేశారు. దీనితో నేను వట్టి చెరుకూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, నా భర్తను,వారి కుటుంబ సభ్యులను పోలీసులు పిలిపించి విచారించి ఇరువర్గాల మధ్య రాజీ చేసి పంపించారు. కొంతకాలం మా దాంపత్య జీవితం ఎలాంటి వడుదు డుగులు లేకుండా సాఫీగా సాగుతూ వస్తుంది. ఈ క్రమంలో పైవారు మళ్లీ నాపై దాడి చేయడంతో నేను మా పుట్టింటికి వచ్చాను. ఇప్పటికి నేను మా పుట్టింటికి వచ్చి ఆరు మాసాలైనా నా భర్త కుటుంబ సభ్యులు నా వద్దకు రాలేదు. ప్రస్తుతం నా కుమారుడు నా భర్త వద్ద, కుమార్తె నా వద్ద ఉంటున్నారు. నా కుమారుడిని చూసేందుకు నేను పొన్నెకల్లు నుండి వట్టిచెరుకూరు వెళ్ళగా నా భర్త కుటుంబ సభ్యులు నా కుమారుడ్ని నా కళ్ళకు చూపించకుండా, దాచిపెట్టి, నన్ను దుర్భసలాడుతూ, మానసికంగా ఇబ్బందులకు గురిచేసి తిరిగి పొన్నెకల్లు పంపించారు. ఈ విషయమై మా దంపతుల మధ్య సఖ్యత చేకూర్చి, నా అత్తమామలు, నా భర్త మేనత్త, నాయనమ్మలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, నాకు, మా కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పింది.

# గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగించుకోవాలి : తహాశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ

**కొల్లిపర,అగష్టు 31 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగించుకోవాలని తహాశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ అన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు ధరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంభంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సిద్ధార్ధ మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలనర్నారు.గ్రీవెన్స్‌కు హాజరైన వారిలో ఎంపీడీవో విజయలక్ష్మీ,డిప్యూటి ఎంపీడీవోలు భార్గవ్,దానయ్య,హౌసింగ్ ఏఈ పద్మావతి,ఆర్ఐ వంశీకృష్ణ,ఏపిఓ వెంకయ్య తదితరులు



# జటాయువు యంత్రంతో చెత్తను తొలగించవచ్చు : ఎంపీడీవో విజయలక్ష్మీ

**కొల్లిపర,అగష్టు 31 ప్రభాతవార్త:** జటాయువు యంత్రం ద్వారా గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని అతి తక్కువ సమయంలో తొలగించవచ్చని ఎంపీడీవో విజయలక్ష్మీ తెలిపారు.సోమవారం మండల పరిధిలోని అత్తోట,కొల్లిపర,మున్నంగి గ్రామాలలో అధికారులు జెటాయువు యంత్రం ద్వారా చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు.ఈ సందర్భ:గా విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు.కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవోలు భార్గయ్య,దానయ్య తదితరులు పాల్గొన్నారు.



# చిగురుపాటికి మాతృ వియోగం

## చిగురుపాటి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రావి

పొన్నూరు, ఆగస్టు 31,ప్రభాతవార్త: మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు చిరుగుపాటి సుబ్బారావు మాతృమూర్తి చిగురుపాటి జానకమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ చింతల పూడి గ్రామానికి వచ్చి జానకమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలిపారు. రావి వెంట పలువురు నాయకులున్నారు.



# వీఆర్ఏ లకు పదోన్నతి కల్పించండి

**తెనాలి మున్సిపాలిటీ, ఆగస్ట్ 31,(ప్రభాతవార్త):** గ్రామరెవిన్యూ సహాయకులకు(వీఆర్ఏ)పదోన్నతి కల్పించాలంటూ, తెనాలి డివిజన్ వీఆర్ఏ సంఘ ప్రతినిధులు సోమవారం ఆర్డిఓ శ్రీరమణికి వినతిపత్రం అంద జేశారు.సోమవారం తెనాలి డివిజన్ ఆర్డిఓ ని కలిసి వీఆర్ఏలు తమ యొక్క పదోన్నతి కొరకై అర్జీ నీ ఇవ్వడం జరిగినది, ఈ సందర్భంగా ఆర్డిఓ శ్రీరమణి స్పందించి వీఆర్ఏ యొక్క పదోన్నతికై కావలసిన వివరాలు తెలుసుకొని తప్పనిసరిగా పదోన్నతి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, సంఘ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాలా రాజేష్, కురగంటి సంగయ్య,ముత్తయ్య, సీతయ్య,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# దివంగత ప్రముఖ సినీ నటి జమునకు ఘన నివాళి

**తెనాలి ఆగస్టు, 31,(ప్రభాతవార్త):** ప్రముఖ సినీ నటి జమున 90వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నివాళులార్పించారు. తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ సమావేశం హాల్లో, సోమవారం,అభ్యుదయ కళా సమితి, మహిళా సమైక్య నిర్వాహకురాలు జమున చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమున తెలుగు తమిళ్ కన్నడ హిందీ భాషల్లో రెండు వందలకు పైగా చిత్రాల్లో తన నటన ప్రతిభతో ప్రేక్షకులను అలరించారన్నారు కళా సేవలో తన జీవితాన్ని పండించుకున్నారని కొనియాడారు వెండి తెర సత్యభామ గా కీర్తిని అందుకున్నారని ప్రశంసించారు రాజకీయ రంగంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీగా ప్రజాసేవనందించాలని పేర్కొన్నారు కార్యక్రమంలో ఇస్కఫ్ నాయకురాలు చల్లగాలి శ్రీదేవి,తిరుమల తిరుపతి దేవస్థానం గాయని చందు అనురాధ, హరికథ భగవతారిణి బెజ్జంకి నాగమణి, గాయని కన్నెగంటి మోనిక, నాగబాబు, బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



1PLD 7fff.qxd:1PLD 7.qxd 01/01/2001 09:48 Page 1



## పీజీఆర్‌కు 92 ఫిర్యాదులు



**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 31(ప్రభాతవార్త):** ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి ఉత్తమ పోలీస్ సేవలు అందించడమే లక్ష్యమని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఐపీఎస్ తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఆస్తి, కుటుంబ సమస్యలు, మోసాలు, వేధింపులు, ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 92 ఫిర్యాదులు అందగా, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు పరిష్కారం కోసం రిఫర్ చేశారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయి విచారణను వేగవంతం చేసి చట్టప్రకారం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు రాసి ఇవ్వడంలో ప్రజలకు పోలీస్ సిబ్బంది సహకరించారు.

# పల్నాడు జిల్లా వార్త



## వ్యక్తి పై దాడి ఘటనా స్థలాన్ని పరిశీలన



**క్రోసూరు,ఆగస్టు31,(ప్రభాతవార్త)** క్రోసూరు మండలంలోని అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన కిలారి సతీష్‌పై బీరు సీసాతో దాడి జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి సతీష్ బంధువులు క్రోసూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి క్లూస్ టీం, ఆర్ఎఫ్ఎస్ఎల్ బృందం చేరుకుని పరిశీలించారు. దాడికి ఉపయోగించినట్లు భావిస్తున్న బీరు సీసాతో పాటు ఘటనా స్థలంలో ఉన్న రక్తపు మరకలను సేకరించి, శాస్త్రీయ పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. దాడిలో గాయపడిన కిలారి సతీష్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుటమే ధ్యేయం

### ప్రిన్సిపాల్ డాక్టర్. ఎన్. శ్రీనివాసరావు

**విజయపురిసౌత్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** విజయపురిసౌత్:ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పచ్చదనం పెంపొందించడం,పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం కోసంమొక్కలు నాటే కార్యక్రమాన్ని కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆలుమిని సభ్యుల సహకారంతో కళాశాలావరణంలో ఏర్పాటుచేశారు.కోదివేపాలు,మామిడి వంటి వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్. ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ,ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మరియు కళాశాల పూర్వ విద్యార్థి ఏసురు చైతన్య మురళి సహకారంతో కళాశాలకు మొక్కలను పంపించడం జరిగిందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కళాశాల ఆవరణ మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలను మున్ముందు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.ఎల్.రావు,సీనియర్ సీనియర్ లెక్చరర్ వల్లినాథ్ , కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఆలుమిని సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి,పి.వి.రమణ,ఎ. శ్రీనివాసరావు, పి.డి. రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బడి కోసం కార్యక్రమంపై విస్తృత ప్రచారం



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 31, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు, పూర్వ విద్యార్థులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారాన్ని సమీకరించేందుకు ప్రవేశపెట్టిన "బడి కోసం" పోర్టల్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి. శ్యాం ప్రసాద్ సూచించారు.సోమవారం కేసానుపల్లిలోని ఎం.ఏ.ఎం. కళాశాలలో 28 మండలాల సిబ్బంది, సీఆర్పీలకు నిర్వహించిన శిక్షణ, సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలకు దాతలు అందించే నగదు, వస్తు రూపంలోని ప్రతి సహాయాన్ని "బడి కోసం" పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, తద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని తెలిపారు. పాఠశాలల అవసరాలను గుర్తించి దాతల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సీఆర్పీలు, మండల సిబ్బంది కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల కిట్ల పంపిణీ ఆథెంటికేషన్ 98 శాతం పూర్తయిందని, మిగిలినదాన్ని ఈ వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలు ప్రకటించిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించాలని సూచించారు. మనబడి-మన భవిష్యత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పాఠశాల నిధులను నిబంధనల మేరకు సద్వినియోగం చేసేలా ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకత్వం ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరెడ్డి, నాయక్, సెక్టోరల్ అధికారులు పద్మారావు, పూర్ణచంద్రరావు, స్వెల్లాం, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 29వ ఓరియంటేషన్ డే



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో నూతనంగా ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 29వ ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు, సంప్రదాయ నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమైంది.కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాలను విదిత యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్ణయించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు కళాశాల విద్యార్థులు 363 ప్లేస్‌మెంట్లు సాధించినట్లు తెలిపారు.కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, డైరెక్టర్లు మిట్టపల్లి సుహాసిని, మిట్టపల్లి బి.వి. సత్యనారాయణ, మిట్టపల్లి కిశోర్ కుమార్, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్య అతిథి ప్రముఖ విద్యావేత్త వైజర్, నైపుణ్యం, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జ్యూతీశ్రీ వ్యవస్థాపకుడు నవీన్ కుమార్ లింగ కృత్రిమ మేధస్సును వినియోగించుకుని వేగంగా నేర్చుకోవాలని సూచించారు.ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటేశ్వర్లు, ప్రథమ సంవత్సరం డీన్ డా. డి. సునీల్ కళాశాలలోని ఏఐ, రోబోటిక్స్ ల్యాబ్‌లు, ప్లేస్‌మెంట్ శిక్షణ, మెంటరింగ్, యాంటీ ర్యాగింగ్ చర్యలను వివరించారు.

## అర్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు



**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):**జిల్లా పోలీస్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాలకు అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలను బయట కొందరు వ్యక్తులు మభ్యపెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో అర్జీలు రాసే వ్యక్తులకు నరసరావుపేట రూరల్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.జిల్లా పోలీస్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో అర్జీ సమర్పించేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని నరసరావుపేట రూరల్ ఎస్సై సీహెచ్. కిషోర్ స్పష్టం చేశారు. అర్జీ రాసే పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ప్రజలను మోసం చేస్తూ అర్జీల పేరుతో డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉపాధ్యాయుడిపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్



**క్రోసూరు( ఆగస్టు 31 ప్రభాతవార్త )** పెదకూరపాడు.ఆగస్టు 27వ తేదీన ఉపాధ్యాయునిపై దాడి చేసిన వ్యక్తిని పెద్దకూరపాడు ఎస్ఐ అల్లు రెడ్డి సోమవారం అరెస్టు చేసి తగు చర్య నిమిత్తం.సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచారు .ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుంది ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కాంతారావు, కానిస్టేబుల్ కానిస్టేబుల్ యానాది తదితరులున్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమాన

**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి గౌరవ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.10 వేల జరిమానా విధించారు.అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. ప్రమాదకరంగా ఆటోలు నడిపిన నలుగురు ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.రోడ్డు భద్రత, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిం చారు.

## సత్తెనపల్లి మండలంలో 264 పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రచురణ



**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** సత్తెనపల్లి మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలకు సంబంధించిన 264 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదించినట్లు ఎంపీడీఓ బి. శ్రీనివాసరెడ్డి తెలిపారు.కలెక్టర్ ఆమోదించిన తుది పోలింగ్ స్టేషన్ జాబితా వివరాలను మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా ప్రధాన కూడళ్లలో, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ప్రచురించినట్లు తెలిపారు.ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ వివరాలను పరిశీలించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు.

## ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో మహిళకు తీవ్ర గాయం



**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో పొత్తూరి శివకుమారి అనే మహిళకు గాయాలయ్యాయి.బస్సు కదులుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో ఆమె కాలికి తీవ్ర గాయమై రక్తస్రావం జరిగినట్లు సమాచారం. వెంటనే స్థానికులు ఆమెను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుబాధితురాలు పెదకూరపాడు మండలం బుచ్చియపాలెం గ్రామానికి చెందిన మహిళగా గుర్తించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కరువు కోరల కాటుకు విముక్తి వెలిగొండ..!

**చారిత్రాత్మక ఘట్టానికి చంద్రబాబు శ్రీకారం**

**విద్య, ఆరోగ్యానికి పెద్దపీట**

**రూ.1 కోటి 28 లక్షల నిధులతో నూతన భవనాలు**

**ప్రారంభించిన ఎమ్మెల్యే జూలకంటి**





**కారంపూడి ఆగస్టు 31, ప్రభాతవార్త:** కరువు కోరల కాటుకు దశాబ్దాలుగా అలమటిస్తున్న మూడు జిల్లాల ప్రజలకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ విముక్తినిచ్చిందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మూడు దశాబ్దాల ప్రజల స్వప్నం, ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం, కూటమి ప్రభుత్వ సహకారం వెరసి మొదటి ఫేజ్ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసుకున్నామని చెప్పారు. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించే వెలిగొండ ఒక చారిత్రాత్మక కట్టడం అని అభివర్ణించారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల నిర్మాణం, నదుల అనుసందానంతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతోందన్న నమ్మిన సిద్ధాంతో చంద్రబాబు 76 ఏళ్ల వయసులో దాదాపు 18 గంటలకు కష్టపడుతున్నారని వివరించారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

**రూ.92 లక్షలతో నూతన భవనాలు ప్రారంభం..!**

మండల పరిధిలోని చినగార్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల నందు రూ. 92 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆరు అదనపు తరగతి గదులు, విద్యార్థులకు మరుగుదొడ్ల భవనాలను ప్రారంభించారు. పాఠశాల మొత్తం కలియతిరిగి, అందుతున్న విద్యా వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నందు మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను అందించేందుకు మంత్రి నారా లోకేష్ మన బడి మన భవిష్యత్తు ద్వారా పెద్దఎత్తున నిధులు అందజేస్తున్నారని తెలిపారు.

**రూ.36 లక్షలతో నూతన ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రారంభం..!**

పెదకొదమగండ్ల పంచాయతీ కాకానీవారిపాలెం నందు రూ.36 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైద్యశాల నందు అందించనున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, పార్టీ మండల అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్,గడిపూడి రామకృష్ణ, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, శేషగిరిరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



**నరసరావుపేట, ఆగస్టు 31, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 2న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నరసరావుపేట నియోజకవర్గంలో నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ క్యాడర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 2న ఉదయం 9 గంటలకు ఎస్ఆర్‌కేపీ బైపాస్ వద్ద మంత్రి నారా లోకేష్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి, ఏఎంరెడ్డి కళాశాల సమీపంలోని ఏఐపీఎస్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ క్యాడర్ సమావేశానికి తరలిరావాలని సూచించారు.జేఎన్టీయూ కళాశాలలో వసతి గృహాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం మంత్రి లోకేష్ పార్టీ క్యాడర్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడంతో పాటు, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పనిచేసే విధానంపై సూచనలు చేయనున్నారని వెల్లడించారు.లోకేష్ పర్యటన సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారని, అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని అన్నారు.టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రి నారా లోకేష్ తొలిసారిగా నరసరావుపేటకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు, గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ జాన్ సైదా, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, నాయకులు నరసయ్య, కడియాల రమేష్, కపిలవాయి విజయ్‌కుమార్, గూడూరు చంద్రశేఖర్, గట్టుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలేరమ్మకు బోనాల జాతర

### ఎమ్మెల్యే జూలకంటి ప్రత్యేక పూజలు



**మాచర్ల టౌన్ ఆగష్టు 31 ప్రభాతవార్త:**మాచర్ల పట్టణంలోని 22వ వార్డులో వడియరాజు సామాజికవర్గం ఆధ్వర్యంలో ప్రతిఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించే శ్రీ పోలేరమ్మ బోనాల ం,కుంకుమబండి మహోత్సవాలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి.భక్తుల కోలాహలం ,మంగళవాయిద్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వార్డు పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.ఈ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నాం ం.వార్డుకు చేరుకున్న ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.అనంతరం శ్రీ పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమబండికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ..ప్రజలంతా సుఖసంతోషాలతో ,ఆయురారోగ్యాలతో ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండాలని శ్రీ పోలేరమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.తరతరాలుగా కొనసాగుతున్న ఇటువంటి సంప్రదాయాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు.బోనాల కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.రాత్రి పొద్దుపోయే వరకు సాగిన ఈ ఉత్సవాలను స్థానికులు,భక్తులు పెద్ద సంఖ్యలో వీక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, టిడిపి సీనియర్ నాయకులు(బీసీ నాయకులు)బృంగా రమణరావు, మాజీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి (వాసవి సేవాదళ్ అధ్యక్షులు) కంభంపాటి అనిల్ కుమార్,క్రాంతికుమార్,లాల్,బత్తుల దుర్గారావు,బత్తుల పిచ్చయ్య,మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు,నర్సింహారావు,మంజుల సునీత,కొమెర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

### చీఫ్‌విప్ జీ.వీ



**వినుకొండ,ఆగస్ట్31,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అందులో భాగంగా దశాబ్దాలుగా కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసి అన్నదాతల్లో వెలుగులు నింపారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సీఎం చంద్రబాబు సంకల్పానికి దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు 30 ఏళ్లుగా వెలిగొండ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు,రైతుల కల నేడు సాకారం కావడం ఆనందదాయకమన్నారు. వెలిగొండ ప్రారంభోత్సవం రాష్ట్ర సాగునీటి రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని తెలిపారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలకు సాగునీటిని అందించడంతో పాటు తాగునీటి అవసరాలను తీర్చడంలో వెలిగొండ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని జీవీ చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్‌తో కరువు ప్రాంతాల్లోని రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీరు,తాగునీరు అందుబాటులోకి రావడం ద్వారా ఈ ప్రాంతాల్లోవ్యవసాయం ,ఉపాధి ,,వాణిజ్యం,గ్రామీణ మౌలిక వసతులు తదితర రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నిర్వాసిత కుటుంబాల పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించిందని తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో నిర్వాసిత కుటుంబాలకు కేవలం 48 రోజుల్లోనే రూ.762 కోట్ల పరిహారం పంపిణీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేసి రైతులకు నీటి భద్రత కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడం ఒక ముఖ్యమైన ముందడుగు హర్షం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసిన సీఎం చంద్రబాబుకి ఈ ప్రాజెక్ట్ కోసం కృషి చేసిన అధికారులు,ఇంజినీర్లు,సిబ్బందికి చీఫ్‌విప్ జీవీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ప్రత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్

### వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలి



**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** సత్తెనపల్లి మండలం కంటేపూడి గ్రామంలో ప్రత్తి పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనాజిర్ జిలానీ సమూన్, ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.వర్షాభావ పరిస్థితుల నుంచి ప్రత్తి పంటను సంరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, దిగుబడులను పెంచే మార్గాలపై రైతులకు పలు సూచనలు చేశారు. డాట్ శాస్త్రవేత్త శ్రీ ఎన్. నాగేష్ మాట్లాడుతూ ప్రత్తి పంటలో వర్షాభావ పరిస్థితు లను తట్టుకునేందుకు మల్టీకే, 19:19:19 ఎరువుల ను పిచికారీ చేయాలని రైతులకు వివరించా రు.అదేవిధంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ క్షేత్రస్థాయి సిబ్బందికి 100 శాతం ఈపంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో అన్ని భూకమతాలు, భూమి సర్వే నంబర్లు పంట బుకింగ్ పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులు భూమిని ఖాళీగా ఉంచకుండా, పరిస్థితులకు అనుకూలమైన స్వల్పకాలిక పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు, సత్తెనపల్లి ఏడీఏ బి. రవిబాబు, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు

## ఓటమి భయంతో పోలింగ్ కేంద్రాలు మారుస్తున్నారు

### డా. గోపిరెడ్డి



**నరసరావుపేట, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల మార్పును వ్యతిరేకిస్తూ వినుకొండ పార్టీ ఇన్చార్జి బొల్లా బ్రహ్మనాయుడు,పార్టీ నేతలు సోమవారం డీపీఓ, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా ఓటింగ్ జరుగుతున్న కేంద్రాలను ఎటువంటి ముందస్తు సమాచారం, అఖిలపక్ష సమావేశం లేకుండా మార్చడం సరికాదన్నారు. రొంపిచర్ల మండలంతో పాటు నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం పోలింగ్ కేంద్రాలను మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల పోలింగ్ కేంద్రాలను మార్చడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందని ఆరోపించారు.రొంపిచర్ల మండలంలో ఈ నెల 23న డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేసిన అనంతరం, 28వ తేదీలోపు మార్పులు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యంతరాలు వచ్చినప్పుడు అఖిలపక్ష సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అలా చేయలేదన్నారు. ముఖ్యంగా పడమటిపాలెం పోలింగ్ కేంద్రానికి సంబంధించి గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అక్కడికి కేంద్రాలను మార్చడం జరిగిందని ఆరోపించారు.పోలింగ్ కేంద్రాల మార్పుపై కలెక్టర్ తక్షణమే స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. మార్పు చేసిన కేంద్రాలను తిరిగి సరిచేయకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడుతామని వైఎస్ఆర్సిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు

## వెలుగు కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా



**అచ్చంపేట, ఆగస్టు 31 (ప్రభాత వార్త):** అచ్చంపేట వెలుగు కార్యాలయం ఎదుట డ్వాక్రా సంఘాల మహిళలు సోమవారం ధర్నా నిర్వహించారు. తమకు జరిగిన నష్టంపై గత నెలలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆరోపిస్తూ మహిళలు నిరసన వ్యక్తం చేశారు.

అచ్చంపేటలోని సువిధ సంఘం యానిమేటర్ సల్మా కారణంగా నష్టపోయినట్లు పేర్కొంటున్న డ్వాక్రా మహిళలు గత నెల 8న అచ్చంపేట వెలుగు కార్యాలయంలో, 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెలుగు కార్యాలయం గేటు వద్ద బైఠాయించి మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరసన చేపట్టారు. భోజనం సైతం కార్యాలయం గేటు ఎదుటే చేశారు.

కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు, జిల్లా కమిటీ సభ్యుడు టి. హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కత్తుల గోపికృష్ణారెడ్డి ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ఫిర్యాదులపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సాయంత్రం 4 గంటల సమయంలో ఏటీఎం వెంకటరెడ్డి, అచ్చంపేట పోలీసులు అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. మూడు రోజుల్లో ఉన్నతాధికారులను పిలిపించి సమస్యపై విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నాను విరమించారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకోకపోతే తిరిగి ఆందోళన చేపడతామని మహిళలు హెచ్చరించారు.ధర్నాలో జానీ గ్రూప్‌కు చెందిన ఎలమంద మల్లేశ్వరి, తిరుపతమ్మ, కిలారి శ్రీను, శివసాయి గ్రూప్‌కు చెందిన కుంభ మల్లేశ్వరి, శివపార్వతి, గౌరీపార్వతి, పుల్లమ్మ, కోటేశ్వరి, అచ్చమ్మ, తిరుమల గ్రూప్‌కు చెందిన ఏపూరి మల్లేశ్వరి, ప్రియాంక గ్రూప్‌కు చెందిన కోటేశ్వరి, దుర్గ, అజ్మత్ గ్రూప్‌కు చెందిన సైదాబీ, మక్కా మదీనా గ్రూప్‌కు చెందిన అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ,క్వాంటమ్ టెక్నాలజీలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి

## ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న

**మంగళగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త :** క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. ఈ దిశగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అందిస్తున్న సాంకేతిక సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు.



అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆడిటోరియంలో “మెంటార్ మ్యాపింగ్-క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్ బృందం ఏర్పాటు అంశంపై క్వాంటమ్, ఏఐ ఇన్నోవేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల నుంచి 300 మందికి పైగా టెక్నాలజీ నిపుణులు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, ఇండస్ట్రీ భాగస్వాములు, వివిధ కళాశాలల అధ్యాపకులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ స్వాగతోపన్యాసం చేశారు. క్వాంటమ్, ఏఐ టెక్నాలజీల అభివృద్ధికి యూనివర్సిటీ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ ఏడాది వర్సిటీలో క్వాంటమ్, ఏఐ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రారంభించామని, క్వాంటమ్ రంగంలో పరిశోధనలను మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఎన్విడియా, ఫ్యాబ్‌ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో అత్యంత వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధస్సు కీలకంగా మారుతున్న నేపథ్యంలో పరిశోధనలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. సంపద సృష్టికి నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకత ఎంతో అవసరమని, టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఎదురవుతున్న వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించే దిశగా కొత్త ఆల్గారిథమ్‌ల ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఆంధ్రా యూనివర్సిటీలో వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు.



**భవిష్యత్ కార్యాచరణపై చర్చ**

ఈ సందర్భంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మిషన్ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం నిర్వహించిన వర్క్‌షాప్‌లో క్వాంటమ్ టెక్నాలజీ వినియోగానికి ఉన్న వివిధ అవకాశాలను గుర్తించడం, ఆయా రంగాలకు తగిన మెంటార్లను అనుసంధానం చేయడం, భవిష్యత్ ప్రాజెక్టులకు అవసరమైన నిపుణులను ఎంపిక చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో క్వాంటమ్ వ్యాలీ మిషన్ ప్రతినిధి తాడికొండ వెంకటస్వామి, క్వాంటమ్ ఇండియా-ఐబీఎం లీడ్ శేషరఘునాథన్, క్వాంటమ్ ఇండియా-టీసీఎస్ లీడ్ గ్రాడ్ ఫ్రే మతాల్స్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీవై పార్టీ పోటీ.. బీసీలకు 50 శాతం సీట్లు!

**- బీసీలకు 34 రిజర్వేషన్ల పేరుతో కుట్రలు చేస్తే సహించం - జూలై 1, 2026 ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక ఎన్నికలు జరపాలి -బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్**

**మంగళగిరి, ఆగస్టు 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. సోమవారం బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో



బీసీలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని, అందులోనూ ఇప్పటివరకు చట్టసభలకు వెళ్లని అణగారిన బీసీ కులాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. మిగిలిన 50 శాతం స్థానాల్లో కాపులు, అలాగే దళితులు అణిచివేతకు గురవుతున్న ఇతర వర్గాలకు పెద్దపీట వేస్తామని ప్రకటించారు.

**సంచార జాతులకు అండగా బీసీవై పార్టీ**

ఆగస్టు 31వ తేదీ జాతీయ సంచార, అర్థ సంచార జాతుల విముక్త దినోత్సవం సందర్భంగా 56 సంచార జాతులకు రామచంద్రయాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఈ జాతులను బ్రిటీష్ వారు క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ ద్వారా అణచివేశారని, 1952 ఆగస్టు 31న వారికి విముక్తి లభించిందని గుర్తుచేశారు. అయితే స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు దాటుతున్నా నేటికీ ఆ జాతులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంచార జాతుల అభివృద్ధికి, వారి హక్కుల సాధనకు బీసీవై పార్టీ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**ఓటర్ల జాబితాపై ప్రభుత్వానిది ద్వంద్వ వైఖరి**

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని రామచంద్రయాదవ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి జూలై 1, 2026 నాటి ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలకు వెళ్తామని చెప్పి, ఇక్కడ మాత్రం జనవరి 1, 2026 జాబితా ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు సర్ ప్రక్రియ ద్వారా లక్షలాది ఓట్లను తొలగిస్తూ, పాత జాబితాతో ఎన్నికలకు వెళ్లడం కుట్రపూరితమన్నారు. తక్షణమే జూలై 1, 2026 నాటి ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**రిజర్వేషన్ల పేరుతో బీసీలకు ద్రోహం**

గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేస్తే, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం 34 శాతం ఇస్తామంటూ మరో మోసానికి తెరతీసిందని రామచంద్రయాదవ్ ధ్వజమెత్తారు. బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని, కుట్రలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో చేసిన అరాచకాలను ఇప్పుడు చంద్రబాబు నాయుడు రిపీట్ చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని, ఎలాంటి అరాచకాలనైనా ఎదుర్కొనేందుకు బీసీవై పార్టీ సిద్ధంగా ఉందని బోడె రామచంద్రయాదవ్ స్పష్టం చేశారు.

# ఆర్వీఆర్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో “ఏక్ పెడ్ మాకే నామ్”తో పచ్చదనానికి శ్రీకారం

**గుంటూరు విద్య ఆగస్టు 31 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, అవి వృక్షాలుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని 22(ఎ) బెటాలియన్



యెన్.సి.సి కంపెనీ కమాండర్ కల్నల్ ఏ.ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్. & జె.సి. ఇంజనీరింగ్ కళాశాల ఎన్సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో “ఏక్ పెడ్ మా కే నామ్” కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్నల్ ఏ. ఉదయ్ కుమార్ ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, కళాశాల సిబ్బందితో కలిసి వివిధ రకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కల్నల్ ఏ. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ..“ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా తల్లిపై ప్రేమతో పాటు ప్రకృతిపై తమ బాధ్యతను చాటుకోవచ్చన్నారు. విద్యార్థులు నాటే ప్రతి మొక్క, భవిష్యత్ తరాలకు అందించే పచ్చని కానుకగా నిలుస్తుందని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ గూర్చి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ, వాటిని రక్షించే బాధ్యత విద్యార్థులపైనే ఉందని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎమ్.వి. శ్రీనివాస రావు, కళాశాల బాలుర, బాలికల ఎన్.సి.సి యూనిట్ల ఆఫీసర్లు లెఫ్టినెంట్ డా.తారాచంద్, లెఫ్టినెంట్ డా.ఉషా క్రాంతి, డా.కె.లీలాకృష్ణ , ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్యులో మేనేజ్మెంట్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్31, ప్రభాతవార్త:** ఏఎన్యులో సెప్టెంబరు 9,10 తేదీలలో ఏఎన్యు మేనేజ్మెంట్ మీట్ నిర్వహిస్తున్నట్లు రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్ తెలిపారు. ఈమేరకు వీసి ఆచార్య కె.గంగాధరరావు సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ రూసా 2.0 ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈ మీట్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచన, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం, బృంద స్ఫూర్తిని పెంపొందించటమే లక్ష్యంగా ఈ మేనేజ్మెంట్ మీట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే బిజినెస్ క్విజ్, నెక్స్ట్ జెన్ మేనేజర్, మార్కెటింగ్ చాలెంజ్, ట్రేడ్ టైటాన్స్, యాడ్ మేకింగ్ చాలెంజ్, హెచ్ఆర్ కంటెంట్, పీపుల్ కల్చర్ చాలెంజ్ వంటి పోటీలు, వాస్తవ వ్యాపార పరిస్థితుల ఆధారంగా సవాళ్ళు, పరిశ్రమలకు అనుగుణంగా కార్యక్రమాలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు.



వర్సిటీలోని డైక్మన్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ సింహాచలం, ఈసి మెంబర్ ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య కృష్ణసత్య, ఆచార్య చంద్రశేఖరరావు, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ ట్రేడ్ ఆర్గనైజేషన్‌తో ఏఎన్యు సంయుక్త కార్యక్రమాలు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్31, ప్రభాతవార్త:** జపాన్ ఎక్స్‌ట్రనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో)తో ఏఎన్యు లు సంయుక్తంగా విద్యా విషయక కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయి. ఈమేరకు సోమవారం ఏఎన్యు వీసి ఆచార్య కె.గంగాధరరావు ఆధ్వర్యంలో జపాన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. జెట్రో సంస్థ విద్యకు, ఉపాధి అవకాశాలకు చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. యూనివర్సిటీతో కలిసి సదస్సులు,ప్రమోషనల్ ఈవెంట్స్, జాబ్ ఫెయిర్‌లు నిర్వహిస్తారు. జపనీస్ సంస్థలలో యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఈ జపనీస్ కంపెనీలో ఉద్యోగాలు పొందేవారు సుమారుగా నెలకు రూ.11లక్షల ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. ప్రతీ ఏడాది రెండుసార్లు జపనీస్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జట్రో నుంచి సీనియర్ డైరెక్టర్ నాన ఖజుమి, డిప్యూటీ డైరెక్టర్ కెన్ టమోరా, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అరుణ అశోకన్, వర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండి తౌసిఫ్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ టి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి కొలుపుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 31,ప్రభాతవార్త :** విస్తృతంగా వర్షాలు కురిసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన గంగమ్మ తల్లి కొలుపుల సందర్భంగా స్థానిక కృష్ణమహల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రభను సందర్శించి,



తొలి పూజ చేసి గ్రామ ఊరేగింపును ప్రారంభించిన మాజీ మంత్రి వర్యులు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు...

# సంక్షేమం,మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి ఆగస్ట్ 31(ప్రభాతవార్త):** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, మౌలిక వసతుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం, పట్టణంలోని 14 వ వార్డు, చినరావురు తోట ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్సీ ఆలపాటి మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి ప్రజల నుండి వినతులను స్వీకరించిన శాసన మండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ ఆలపాటి రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజెపి నేతల సహకారంతో రాష్ట్రానికి



పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రజలు కూడా గమనించి కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,వసంతం అశోక వర్ధన్,14వ వార్డు నాయకులు,శ్యామ్,పార్టీ నాయకులు రావి చిన్ని,,కోగంటి రోహిత్,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, జొన్నాదుల మహేష్,డా.వేమూరి శేషగిరిరావు ,తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1 తెలుగుదేశం పార్టీకి ప్రాముఖ్యమైన రోజు

## గురజాల శాసనసభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావు

**పిడుగురాళ్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 1 తెలుగుదేశం పార్టీకి ఎంతో ప్రాముఖ్యమైన రోజు అని గురజాల శాసనసభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావు అన్నారు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబర్ ఒకటో తేదీన రాష్ట్ర విభజన ఆత్మ గౌరవ యాత్ర ప్రారంభించడం జరిగిందని దానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్లో గురజాల నియోజకవర్గం నుండి ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు అందుకే సెప్టెంబర్ ఒకటో తేదీ మనకి కూడా ఎంతో ప్రాముఖ్యమైన రోజని అన్నారు ఈనాడు ఓటింగ్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రతినెల ఒకటో తేదీకి మూడు వేల కోట్లు పెన్షన్ పంపిణీకు అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు అలాగే సెప్టెంబర్ రెండో తేదీ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు జరుపుకోవడం కూడా చాలా ఆనందంగా ఉందని ఆయన వివరించారు గొడ్డలి పార్టీ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని రాజకీయంగా మట్టి కనిపించేంతవరకు నా ప్రతిజ్ఞ మా నాన్నని సభలో చెప్పిన పవన్ కళ్యాణ్ దాన్ని నిజం చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు ఈనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని చెప్పారు ఆ ప్రాజెక్టును కూడా మేమే ప్రారంభించాము పూర్తి చేశామంటూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు రాష్ట్రంలో వెలుగుబడుతనంగా ఉన్న ఉత్తరాంధ్ర ఈనాడు భోగాపురం ఎయిర్పోర్ట్ ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చిన గణిత నారా చంద్రబాబు నాయుడుకి దక్కిందన్నారు అలాగే రాయలసీమ కూడా ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో ఉండేదని కానీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే కియా కార్ల కంపెనీ తోపాటు హార్టికల్చర్ క్లబ్ గా మారిందని పల్నాడు ప్రాంతంలో ఎన్నో సిమెంట్ కంపెనీలు రావడంతో పల్నాడు కూడా ఎంతో అభివృద్ధి చెందిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు గత వైసిపి హయాంలో పంచాయతీ మున్సిపల్ ఎన్నికలు జరగకుండా చేశారని కానీ ఈ రోజు కూటమి ప్రభు త్వంలో మున్సిపల్ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించ బోతున్నామని ఆయన వివరించారు వైయస్ జగన్మోహన్ రెడ్డి బాబాయి హత్య తల్లి చెల్లిని గెంటేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని వివరించారు వాళ్ళ అధినేత మరలా మేము అధికారంలోకి వస్తాం మేము వస్తే రప్ప రప్ప అని అడుగుతా అంటూ ప్రచారాలు



చేసుకోవటం వారి సైకో మనస్తత్వానికి నిదర్శనమే అన్నారు మొన్న జరిగిన ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు ఇచ్చారని రాబోయే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా లేకుండా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి రాష్ట్ర మొత్తం అభివృద్ధి చెందని వైద్య పరంగా విద్య హార్టికల్చర్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆయన చెప్పారు విజయ్ సాయి రెడ్డి ప్రెస్మీట్లో నేను అప్రూవల్ గా మారితే జగన్మోహన్ రెడ్డి జీవిత కాలం జైలు పాలు కావాల్సి వస్తుందని చెప్పటం రాష్ట్ర ప్రజలందరూ చూశారని రాబోయే రోజుల్లో జ5గన్ కదే జరగబోతుందని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి పట్టణ పార్టీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు సీనియర్ నాయకులు వడవల్లి సర్వేశ్వరరావు వడవల్లి సాంబశివరావు కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# పరిష్కార వేదికకు 155 ఫిర్యాదులు

**గుంటూరు క్రైమ్, ఆగస్టు31,ప్రభాతవార్త:** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ 155 ఫిర్యాదులను స్వయంగా, అలాగే ఇతర పోలీస్ అధికారుల ద్వారా స్వీకరించి, ఒక్కో వినతిని పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ విధానంలో సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారునికి సమాచారం అందించి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో జిల్లా పోలీస్ సిబ్బంది సహకారం అందించి, తమ సమస్యలను సులభంగా తెలియజేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ రమణమూర్తి, సౌత్ డీస్పీ పూర్ణచంద్ర రావు, ఈస్ట్ డీస్పీ టీ సీతారాం, పిజిఆర్ఎస్ సిఐ బిలాలుద్దీన్తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఐటీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పారావును ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 31,ప్రభాతవార్త :** కేంద్ర కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో “మాస్టర్ ట్రైనర్“గా వ్యవహరిస్తూ వేలాది మంది పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సోషల్ మీడియాపై సమగ్ర అవగాహన కల్పించిన ఐటీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మారెళ్ల అప్పారావు గారిని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు .ఈ సందర్భంగా చిలకలూరి పేట శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు మారెళ్ల అప్పారావు గారిని ప్రత్యేకంగా అభినందించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు మాట్లాడుతూ... “డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రాధాన్యతను గుర్తించి, దానిపై సంపూర్ణ అవగాహనతో మారెళ్ల అప్పారావు గారు పార్టీ నాయకత్వ శిక్షణా శిబిరాల్లో మాస్టర్ ట్రైనర్‌గా విశేష సేవలందించారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఆయన కృషి అభినందనీయం“ అని కొనియాడారు. అలాగే మారెళ్ల అప్పారావు గారితో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, సోషల్ మీడియా విభాగంలో నిరంతరం శ్రమిస్తూ విశేష సేవలు అందిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ ఐటీడీపీ కార్యవర్గాన్ని, వారి కృషిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గారు ప్రత్యేకంగా ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ఐటీడీపీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ షిరిడీ సాయినాధుని మందిరం 8వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 31,ప్రభాతవార్త :** చిలకలూరిపేట పట్టణం, నరసరావుపేట రోడ్డులోని సాయి నగర్ నందు వేంచేసియున్న శ్రీ షిరిడీ సాయినాధుని మందిరం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ వారు ఏర్పాటుచేసిన రుద్రాక్షలతో కూడిన సహస్ర కళాశాభిషేకం పూజల్లో పాల్గొని, స్వామి వారికి మహాకుంభంతో అభిషేకం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు..



# మద్దూకూరి అశోక్‌ను సత్కరించిన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఆగస్టు 31,ప్రభాతవార్త :** మందడం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు అసిస్టెంట్‌గా మద్దూకూరి అశోక్ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న అశోక్‌ను దుస్సాలువతో సత్కరించి, అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న అశోక్ సేవలను కొనియాడుతూ, వారి మిగిలిన శేష జీవితాన్ని ప్రజా సేవకు కృషి చేయాలని మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు...

# సోమయ్యకు ఘన సత్కారం

**కొల్లూరు, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :** ఇటీవల డాక్టరేట్ అందుకున్న కొల్లూరు నివాసం డాక్టర్ పులివర్తి సోమయ్యకు ఆస్మా ఏడో యూనివర్శిరలీ సందర్భంగా వారి ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 9వ బ్లాక్ బెల్ట్ కరాటే గ్రాండ్ మాస్టర్,




సినీ నటులు, డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా 4వ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ డాక్టర్ పులివర్తి సోమయ్యను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సినీ నటులు డాక్టర్ సుమన్ తల్వార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మా ఆర్గనైజర్ రూపస్‌పాల్, మాస్టారు భాష, సిద్దు శ్రీనివాస్, జానీ భాష, సత్యనారాయణ, సోమశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి


**చిలకలూరిపేట, ఆగస్టు 31,ప్రభాతవార్త :**

చిలకలూరిపేట పట్టణం నుంచి గణపవరం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై మధ్యాహ్నం 12గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా దారితప్పి వేగంగా దూసుకొచ్చిన



గేదెలు క్షతగాత్రుడి వాహనాన్ని బలంగా ఢీకొన్నాయి. ఈ ఆకస్మిక ఘటనతో క్షతగాత్రుడు తీవ్రంగా గాయపడి కిందపడిపోయారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మానవత దృక్పథంతో స్పందించి, బాధితుడికి సహాయంగా నిలిచారు. తన కాన్వాయి లోనికి క్షతగాత్రుడిని ఎక్కించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించి, క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందచేయాలనీ డాక్టర్ గారితో మాట్లాడిన ప్రత్తిపాటి.

# నేపాల్‌లో కుప్పకూలిన భారీ హిమానీనదం



## డ్రోన్ వీడియోలో రికార్డయిన ప్రళయ దృశ్యాలు

**కాఠ్మాండు, ఆగస్టు 31:** హిమాలయ పర్వత శ్రేణుల్లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ శిఖరం వద్ద ఓ భారీ హిమానీనదం, దాని కిందఉన్న రాతి పొరలు సహా కుప్పకూలింది. ఈ ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు డ్రోన్ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటన కారణంగానే గత వారం నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో భీకర వరదలు సంభవించి వందలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.
చైనాకు చెందిన ఒకఫొటోగ్రాఫర్ సుమారు 7,200 మీటర్ల ఎత్తు నుంచి ఈ విపత్తును తన డ్రోన్ కెమెరాలో చిత్రీకరించారు. భారీ మంచు ఫలకం, రాళ్లతోకూడిన పర్వత భాగం ఒక్కసారిగా విరిగిపడటం, ఆ తర్వాత పర్వతాల నుంచి దట్టమైన ధూళి మేఘాలు పైకి లేవడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. విరిగిపడిన భాగం సుమారు 1,200 మీటర్ల దిగువనఉన్న లోయలో పడటంతో మంచు, రాళ్లు, బురదతో కూడిన ఉప్పెన సృష్టించింది. ఈ ప్రళయం కారణంగా ఆగస్టు 26న భోటేకోశి, త్రిశూలి నదులు ఉగ్రరూపం దాల్చి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ వరదల వల్ల నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎక్కువ మంది నేపాల్‌కు చెందినవారే. శాటిలైట్ చిత్రాలు, భూకంప డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు, 'లాంగ్‌టాంగ్ లిరుంగ్ ఉత్తర భాగంలో భారీ స్థాయిలో మంచు, రాళ్లు విరిగిపడటమే వరదలకు కారణం'అని తేల్చారు. హిమానీనదం కూలినప్పుడు భూకంప లేఖినిపై 5.2 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయని వెల్లడించారు. హిమాలయాల్లో ఇలాంటి విపత్తులు ఇటీవలి కాలంలో తరచుగా జరుగుతున్నాయని, ఎత్తైన ప్రదేశాల్లోని అస్థిరమైన మంచు, రాళ్ల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

**నేపాల్ సహాయ నిధికి సద్గురు రూ.కోటి విరాళం**

హిమాలయ ప్రాంతంలో విపత్తులను ఎదుర్కొనేందుకు భారత్,చైనా, పాకిస్థాన్, నేపాల్, భూటాన్‌తో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రతిపాదించారు. రాజకీయ సరిహద్దులకు అతీతంగా ఈ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నేపాల్ వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు రూ.కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.
కాఠ్మండులో నిర్వహించిన 'ఇన్ సాలిడారిటీ విత్ నేపాల్' కార్యక్రమంలో సద్గురు జగ్గీ వాసుదేవ్ మాట్లాడారు. నేపాల్-టిబెట్ సరిహద్దులో ఇటీవల సంభవించిన భారీ వరదలతో వేలాది మంది గల్లంతయ్యారని తెలిపారు. మృతుల సంఖ్య కూడా భారీగా ఉండే అవకాశం ఉందన్నారు. విపత్తు సమయంలో చైనా వైపు గ్యిరోంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న ఇషా సంస్థకు చెందిన కైలాశ్ యాత్రలో పాల్గొన్న 77 మంది ఆచూకీ ఇంకా లభించలేదని చెప్పారు.
నేపాల్ వైపుఉన్న ముగ్గురు ఇషా వాలంటీర్లు కూడా గల్లంతైనట్లు తెలిపారు. హిమాలయ పర్వతాలకు దేశాల సరిహద్దులు తెలియవని సద్గురు అన్నారు. పర్వత ప్రాంతాలను ఒకే పర్యావరణ వ్యవస్థగా భావించి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపాదిత హిమాలయ బోర్డును ఆలస్యం చేయకుండా ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ పాలనలు వేర్వేరుగా ఉన్నా.. హిమాలయాల పరిరక్షణ విషయంలో దేశాల మధ్య సమన్వయం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో 933 మంది వర్కర్లు మిస్సింగ్**

నేపాల్ వరదల్లో పలు జల విద్యుత్తు కేంద్రాలు కొట్టుకుపోయాయి. అయితే అక్కడ ఉన్న టన్నెల్స్‌లో వందల సంఖ్యలో కార్మికులు చిక్కుకున్నట్లు గుర్తించారు. బురద సునామీవల్ల ఆ టన్నెల్స్ అన్నీ మూసుకుపోయాయి. అయితే రసువా జిల్లాలోని త్రిశూలీ 3ఏ హైడ్రోపవర్ సైట్ వద్ద ఉన్న టన్నెల్‌లో సుమారు 933 మంది కార్మికులు ఇరుక్కున్నట్లుతెలుస్తోంది. వారిని రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఆ టన్నెల్స్‌లోకి వెళ్లేందుకు చాలా కంట్రోల్డ్ బ్లాస్టింగ్ చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు ఆ బ్లాస్టింగ్ చేపట్టారు. టన్నెల్ యాక్సెస్ కోసం ఆ బ్లాస్ట్ చేసినట్లు తెలుస్తోంది. హైడ్రోపవర్ సైట్ వద్ద ప్రధాని ఆదేశాల ప్రకారం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొన్నది.
జెసిబిల ద్వారా సుమారు 10 మీటర్ల గొయ్యిను ఓ ప్రదేశంలో తొవ్వారు. బురద, రాళ్లతో నిండిన ప్రదేశాన్ని నేపాలీ ఆర్మీ శుభ్రం చేస్తున్నది. త్రిశూలీ 3ఏ టన్నెల్‌లోకి ప్రవేశించేందుకు క్లీనింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఓ టన్నెల్ నుంచి శుక్రవారం 191 మందిని, శనివారం మరో టెన్నెల్ నుంచి 88 మందిని రక్షించినట్లు నేపాల్ డిజాస్టర్ ఏజెన్సీ పేర్కొన్న విషయం తెలిసిందే. టన్నెల్స్ నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన వారు.. టన్నెల్స్‌లో మరింత మంది సజీవంగా ఉన్నట్లు చెప్పారు.
టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ కోసం విదేశీ బృందాలు కూడా రంగంలోకి దిగాయి. హైడ్రోపవర్ ప్రాజెక్టుల వద్ద ఉన్న టన్నెల్స్‌ను లొకేట్ చేసి, వాటిల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.
రసువాగాధీ హైడ్రోపవర్ ప్రాజెక్టులో ఆర్మీ సిబ్బంది వెళ్లారు. కానీ ఎవర్నీ గుర్తించలేకపోయారు. డ్రోన్ల సాయంతో టన్నెల్స్‌ను పరీక్షిస్తున్నారు. అప్పర్ త్రిశూలీ 1, త్రిశూలీ 3ఏ, త్రిశూలీ 3బీ టన్నెల్స్ లోనూ సెర్చ్ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. భారత్, చైనా, దక్షిణ కొరియాకు చెందిన రెస్క్యూ బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. సాంకేతిక అంశాల్లో చాలా సాయం కావాల్సి ఉంటుందని నేపాల్ ప్రభుత్వం పేర్కొన్నది.



# అమెరికాలో వరద బీభత్సం
## 20 మందికి పైగా గల్లంతు

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ నేషనల్ పార్కులో ఆకస్మిక వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. బ్రైట్ ఏంజెల్ క్రీక్‌లో శనివారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో 20 మందికిపైగా గల్లంతైనట్లు సమాచారం. ఉధృత ప్రవాహం కారణంగా.. పాదచారుల వంతెనలు, పెద్ద బండరాళ్లు, లోహ నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొలరాడో నదిలోకి కొట్టుకుపోయాయి. వరద ప్రవాహం కారణంగా క్రీక్ రూపమే పూర్తిగా మారిపోయిన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతం నుంచి ఫాంటమ్ రాంచ్‌లో ఉన్న 62 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలపై అధికారిక సమాచారం వెలువడలేదు. అయితే భారీ వర్షాల కారణంగా మరిన్ని ఆకస్మిక వరదలు, శిథిలాల ప్రవాహాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. నష్టాన్ని అంచనా వేసేందుకు బ్రైట్ ఏంజెల్ క్యాంప్‌గ్రౌండ్, ఫాంటమ్ రాంచ్‌చ నార్త్ కైబాబ్ ట్రైల్‌లోని కొన్ని ప్రాంతాలను మూసివేయడంతోపాటు కొలరాడో నదిపై రాఫ్టింగ్ యాత్రలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.

# ఇక పార్కులు, నైట్ క్లబ్స్‌లోనూ మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు!
## చైనా సంచలన నిర్ణయం



**బీజింగ్, ఆగస్టు 31:** చైనాలో వివాహాల సంఖ్య అంతకంతకూ క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో వివాహ ప్రక్రియను సులభతరం చేసేందుకు చైనాలోని స్థానిక అధికారులు ప్రసూతి ఆస్పత్రులు, బ్యాంకులు, నైట్‌క్లబ్‌ల వంటి ప్రదేశాల్లో వివాహ రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్టు' వెల్లడించింది. క్విక్సీ పండుగ సందర్భంగా ఈ వినూత్న ప్రయత్నాన్ని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని లింజీ జిల్లాలోని ప్రసూతి, శిశు సంక్షరణ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రారంభించారు. ఇదేవిధంగా టియాంజిన్‌లోని పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ ఆఫ్ చైనా శాఖ గత నెలలో వివాహ నమోదుసేవలను అందించిన మొదటి బ్యాంకుగా నిలిచింది. అలాగే గ్వాంగ్ జౌ బైయున్ అంతర్జాతీయ విమానాశ్రయం తాజాగా వివాహ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం ప్రారంభించింది. షాంఘైలోని ఒక నైట్ క్లబ్ స్థానిక పౌర అధికారులతో సర్టిఫికేషన్ వేడుకలను నిర్వహించింది. ఇక చైనాలోని జంటలు మెట్రోస్టేషన్లు, పబ్లిక్ పార్కులు, చారిత్రక దేవాలయాలలో కూడా వివాహాలు చేసుకోవచ్చు. దేశంలో జనాభా సంక్షోభం తలెత్తుతున్న దృష్ట్యా చైనా ఈ నిర్ణయం తీసుకుంది.

# నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు రద్దు చేయండి
## సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలో దాడికి పాల్పడ్డ నిందితులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు కొట్టివేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించాలని కోరింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద సిజెపి ఆధ్వర్యంలో ఆందోళన జరిగిన సంగతి తెలిసిందే. ఈ నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులపై భద్రతాదళాలు దాడిచేయగా.. పోలీసులు, భద్రతా బలగాలపై ఆందోళనకారులు దాడి చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయి. భారీ ఆస్తి నష్టం జరిగింది. దీంతో ఈ దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఢిల్లీతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో కూడా అనేక మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, సిజెపి ఆందోళన విరమించే సమయంలో కేంద్ర ప్రభుత్వం యువతపై నమోదైన కేసుల్ని తొలగిస్తామని, ఎఫ్ఐఆర్‌లో రద్దు చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చింది. ఇదిజరిగి నెలరోజులు అవుతున్నా.. ఇంకా ఎఫ్ఐఆర్‌లు రద్దుకాలేదు. దీంతో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోని కారణంగా సెప్టెంబర్ 5న సిజెపి ఆధ్వర్యంలో ఢిల్లీలో మరో ర్యాలీ జరగనుంది. ఈనేపథ్యంలో ముందుగానేస్పందించిన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తనకున్న అపరిమిత అధికారాన్ని ఉపయోగించి, నిందితులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సుప్రీంకోర్టును ప్రభుత్వం కోరింది. సుప్రీంచీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ముందు ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. మంగళవారమే ఈ కేసు విచారణ చేపట్టాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ సూర్యకాంత్.. ఈ కేసు విచారణ అంత త్వరగా చేపట్టడం అత్యవసరమా అని ప్రశ్నించారు. దీనికి మెహతా బదులిస్తూ ఈ విషయంలో ఇరుపక్షాలు రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, ఆందోళనకారులు కలిసి ఈ అంశంపై ఏకాభిప్రాయానికి వస్తామంటే తమకేం అభ్యంతరం లేదని కోర్టు తెలిపింది. ఈ కేసు విచారణను సెప్టెంబర్ 1, మంగళవారానికి వాయిదా వేసింది.



# సింధు జలాల ఒప్పందం
## మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ సోమవారం ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది.
ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. "ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు



**డెహ్రాడూన్, ఆగస్టు 31:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యక్రమం జరిగిన ప్రదేశంలో నిర్వహించిన ఓ మతపరమైన కార్యక్రమానికి కులం రంగు పులిమారంటూ వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. కులాల మధ్య విద్వేషాన్ని పెంచడం, మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉద్దేశ పూర్వకంగా వ్యవహరించడం వంటి అభియోగాలపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని నిబంధన లను కూడా కేసులోచేర్చారు. జవహర్‌నగర్‌కు చెందిన అమిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. ఆయన శ్రీరామ్ సేన ధర్మార్థ సేవాన్యాస్ సభ్యుడిగా ఉన్నారు.
హల్ద్వానీలో జరిగిన 'శుద్ధి కార్య క్రమం, పరిశుభ్రత కార్యక్రమం'లో తాను పాల్గొన్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగస్టు 29నఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో రాహుల్‌చేసిన వ్యాఖ్యలు వాల్మీకిసామాజిక వర్గం మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపించారు. శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న వారిని అంటరానితనాన్ని పాటించే వారిగా, దళిత వ్యతిరేకులుగా రాహుల్ చిత్రీకరించారని అమిత్‌కుమార్ ఆరో పించారు. తాను ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తినని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ లతో పాటు వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. దీనికి ఖర్గే కులానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

# పెట్రోల్‌లో ఇథనాల్ శాతమెంత?
## సుప్రీంకోర్టులో పిల్... విచారణకు నో

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఇథనాల్ శాతం ఎంతో తప్పనిసరిగా వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. న్యాయవాది ఎన్.కె. గోస్వామి సుప్రీంకోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. పెట్రోల్ నాజిల్లపై, జారీ చేసే రశీదులపై ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ముద్రించాలని ఆయనకోరారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్‌కు ఏయే వాహనాలు అనుకూలంగా ఉంటాయో తెలిపే అధికారిక డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలనిఅభ్యర్థించారు. ముఖ్యంగా 2023 కంటే ముందు తయారైన పాత వాహనాలకు ఇ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వాడకం వల్ల తలెత్తే సమస్యల నుంచి రక్షణ కల్పించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు.
ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి.వరాళేలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు. ఇది ఒక 'ప్రాక్సీ పిటిషన్' అని, ఇదే తరహా వ్యాజ్యాన్ని 2025 సెప్టెంబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది.

# 'సర్' పేరుతో జనాభా తగ్గిస్తున్నారా?
## ఎన్నికల సంఘం తీరుపై ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ఓటర్ జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ ద్వారా దేశ జనాభాను ఎన్నికల సంఘం తగ్గిస్తున్నదని ఢిల్లీ మాజీ సిఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను ఇసి తొలగించడంపై కేజ్రీవాల్ స్పందిస్తూ, దేశ రాజధానిలోని సుమారు 1.5 కోట్ల మంది ఓటర్లలో 47 లక్షల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా పరోక్షంగా విమర్శలు గుప్పించారు.
'జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందకూడదు. ఎందుకంటే 'సర్' ప్రక్రియ ద్వారా దేశ జనాభాను 140 కోట్ల నుంచి 50 కోట్లకు ఎన్నికల సంఘం తగ్గించగలదు' అని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# 'నిజమైన శత్రువు ఎవరో గుర్తించండి'
## ముస్లిం దేశాలకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా లేఖ

**టెహ్రాన్, ఆగస్టు 31:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా.. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఇస్లామిక్ ప్రపంచానికి కీలక సందేశాన్ని ఇచ్చారు. ముస్లిం దేశాలు, ముఖ్యంగా గల్ఫ్ ప్రాంత దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి.. ఏకమవ్వాలని సూచించారు. నిజమైన శత్రువులు ఎవరో గుర్తించి వారికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఆయన తన అధికారిక టెలిగ్రామ్ ఖాతా ద్వారా ఈ లిఖితపూర్వక ప్రకటనను విడుదల చేశారు.

**ముస్లిం దేశాల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే..**

ఇస్లామిక్ దేశాల మధ్య సఖ్యత, సహకారం, ఐక్యత లేకపోవడం వల్లే పశ్చిమాసియా ప్రాంతంలో నిరంతరం ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని మొజ్తబా ఖమేనీ ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడం వల్లే పాలస్తీనా తీవ్రమైన నిస్సహాయ స్థితికి దిగజారిందని, అంతులేని వ్యథకు గురైందని పేర్కొన్నారు. 'తెలిసో తెలియకో, ఉద్దేశపూర్వకంగానో లేక అనుకోకుండానో ముస్లిం సమాజంలో ఘర్షణలకు, విభేదాలకు కారణమయ్యే ప్రతి ఒక్కరూ ఇస్లాం శత్రువుల ప్రణాళికలకే సహకరిస్తున్నారు. గల్ఫ్ దేశాలు ఇస్లాం జెండా నీడన ఐక్యంగా ఉంటే శత్రువులు వారి భూభాగాలపై కన్నేసేవారా?' అని ఆయన ప్రశ్నించారు. గల్ఫ్ పాలకులంతా తమ అసలైన శత్రువులైన అమెరికా, ఇజ్రాయెల్‌ను స్పష్టంగా గుర్తించి.. వారి కుట్రలను అర్థం చేసుకుని ఎదుర్కోవాలని విజ్ఞప్తి చేశారు.



**ఇరాన్ పౌరులు, అధికారులకు కీలక సూచన**


కేవలం పొరుగు దేశాలకే కాకుండా.. ఇరాన్‌లోని ప్రజలు, అధికారులు కూడా తమ మధ్య ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఖమేనీ సూచించారు. సామాజిక సమైక్యతను దెబ్బతీసే ఏ చర్య అయినా నిషేధించదగినదని ఆయన తేల్చి చెప్పారు. యుద్ధం, సుదీర్ఘ ఆంక్షలు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వల్ల తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోవడానికి దేశంలో ఉత్పత్తిని పెంచాలని, ఇరాన్ ఆర్థిక వ్యవస్థలో డాలర్ వాడకాన్ని విడతల వారీగా తగ్గించాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ యేడాది ఫిబ్రవరి 28న యుద్ధ ప్రారంభంలో తండ్రి అలీ ఖమేనీ మరణించిన తర్వాత మొజ్తబా ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయ కుడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు గడుస్తున్నా.. ఆయన ఇప్పటివరకు ఒక్కసారి కూడా బహిరం గంగా కనిపించలేదు. ఆయనకు సంబంధించిన ఎలాంటి ఆడియో లేదా విడియో దృశ్యాలను అధికారులు విడుదల చేయకపోవడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## టపాసుల పరిశ్రమలో పేలుడు: ఏడుగురు మృతి

**లక్నో, ఆగస్టు 31:** ఉత్తర ప్రదేశ్‌లోని ఒక టపాసుల పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. కౌశంబి జిల్లాలోని టపాసుల పరిశ్రమలో పేలుడు సంభవించి ఏడుగురు మరణించారు. 24 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా మెజిస్ట్రేట్ అమిత్‌పాల్ శర్మతోపాటు సిఐ శివాంగ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు దగ్గరుండి పరిస్థితిని సమీక్షించారు.

## సింగర్ హత్య.. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు షూటర్లు మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** హరియాణా సింగర్, యూట్యూబర్ అంకిత్ బాల్యన్ హత్య కేసులోని ఇద్దరు ప్రధాన నిందితులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని షామ్లీ పరిధిలో కైరానా రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. సోనేపట్‌కు చెందిన మోహిత్(22), సుమిత్(24) తప్పించుకునేందుకు పోలీసులపై కాల్పులు జరపగా, పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. గాయపడ్డ ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. వీరిపై రూ.50 వేల చొప్పున రివార్డు ఉంది. ఆగస్టు 26న జిమ్ వద్ద అంకిత్‌పై 18 రౌండ్లు కాల్పులు జరిపి హతమార్చిన విషయం తెలిసిందే.

## సిజెపి ర్యాలీపై ఆంక్షలకు సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సెప్టెంబర్ 5న ఢిల్లీలో తలపెట్టిన ర్యాలీపై ఆంక్షలు విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే బ్రిక్స్ సదస్సు ముగిసే వరకూ ఈ ర్యాలీని నిలువరించాలని దాఖలైన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వలోని ధర్మాసనం కొట్టివేసింది. అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని భావించేందుకు బలమైన కారణాలేమీ లేవని కోర్టు స్పష్టం చేసింది.

## ఆర్మీకి మేజర్ రిషభ్ గుడ్‌బై



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెంటే కనిపించే ఎడిసి మేజర్ రిషభ్ సింగ్ ఆర్మీకి గుడ్‌బై చెప్పారు. నేషనల్ క్రష్‌గా పేరొందిన ఆయన ముందస్తు రిటైర్మెంట్ తీసుకోవడం నెట్టింట వైరల్‌గా మారింది. 12 యేళ్లు సైన్యంలో చేసిన ఆయన వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 2014లో ఎన్‌డిఎలో చేరిన ఆయన 4 పారా స్పెషల్ ఫోర్సెస్‌లో బలిదాన్ బ్యాడ్జ్ సాధించారు. 2021 రిపబ్లిక్ పరేడ్‌లో జాట్ రెజిమెంట్‌ను నడిపించి 2023లో ఎడిసిగా ఎంపికయ్యారు. ఆయన సడెన్‌గా తప్పుకోవడం చర్చకు దారితీసింది.

## వరదల్లో కోటిన్నర నగదు, బంగారం స్వాధీనం

**ఖఠ్మాండు, ఆగస్టు 31:** నేపాల్‌లోని త్రిశూలీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ గ్రామీణ బ్యాంకు నుంచి భారీ మొత్తంలో నగలు, ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బురదతో నిండిన వరద పోటెత్తిన ఘటనలో త్రిశూలీ దుంగేలో ఉన్న అగ్రికల్చర్ డెవలప్మెంట్ బ్యాంక్ బ్రాంచ్ ధ్వంసమైంది. ఆకస్మిక వరదలతో ధ్వంసమైన ఆ ప్రాంతంలోని బ్యాంకు నుంచి లాకర్లను తీసేందుకు సుమారు 8 గంటల ఆపరేషన్ చేపట్టారు. ఆ బ్యాంకు శిథిలాల కింద ఉన్న లాకర్లను ఎట్టకేలకు చేజిక్కించుకున్నారు. వివిధ లాకర్లలో ఉన్న సుమారు రూ.1.5 కోట్ల నగదు, సుమారు 50 కోట్ల విలువైన బంగార ఆభరణాలను బ్యాంకు ఆఫీసర్లు స్వాధీనం చేసుకున్నారు.

## నేపాల్‌కు కేపాప్ స్టార్ లీ నో భారీ విరాళం

**కాఠ్మాండు, ఆగస్టు 31:** నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణ కొరియా పాప్ (కేపాప్) బ్యాండ్ 'స్ట్రే కిడ్స్' సభ్యుడు లీ నో తన ఉదారతను చాటుకున్నారు. వరద సహాయక చర్యల నిమిత్తం 100 మిలియన్ల కొరియన్ వన్ లు (భారత కరెన్సీలో సుమారు రూ.69 లక్షలు) విరాళంగా ప్రకటించారు. 'వరల్డ్ విజన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ విరాళాన్ని అందించారు.

10gnt .qxd:1-9Pg6exHMNWJQE.qxd 01/01/2001 11:11 Page 1





## పిఎం ఎఫ్ఎంఇ అమలులో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు

### న్యూఢిల్లీలో డీఆర్‌పీ శ్రీనివాసరావుకు అవార్డు

### అభినందించిన జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి

**విజయనగరం, ఆగస్టు 31 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లాలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకంను సమర్థవంతంగా అమలు చేస్తూ గణనీయమైన ప్రగతి సాధించినందుకు జిల్లా యంత్రాంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆహార శుద్ధిరంగాన్ని మరింత విస్తరించడంతో పాటు సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం అందించేందుకు అమలు చేస్తున్న పీఎం ఎఫ్ఎంఈ పథకంలో విశేష కృషి చేసిన డీఆర్‌పీ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ నెయ్యిగాపుల శ్రీనివాసరావు విజయనగరం జిల్లా నుంచి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి అవార్డు అందజేశారు. గత సంవత్సరం పీఎం ఎఫ్ఎంఈ పథకం అమలులో 100 శాతం ఫలితాలు సాధించడం ద్వారా విజయనగరం జిల్లా ఈ జాతీయ స్థాయి గుర్తింపును సొంతం చేసుకోవడం విశేషమని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అవార్డుకు ఎంపికైన శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అభినందించారు. పీఎం ఎఫ్ఎంఈ పథకం ద్వారా జిల్లాలోని సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించి, రైతులు, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె. చిట్టిబాబు పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, ఉద్యానశాఖ అధికారులు, డీఆర్‌పీల సమన్వయంతో పథకం అమలులో సాధించిన ప్రగతికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచిందని అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.



## విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

### ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు, సిబ్బంది వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో నిరక్ష ్యం వహిస్తున్నారని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో అలసత్వం వహించే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. తిరుపతిలోని సంస్థ కార్పొ రేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 74 మంది విని యోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండికి విన్నవించారు. విని యోగదారుల విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్ర పాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, హేమలత, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## నేటి అర్ధరాత్రి నుంచి శ్రీ సత్యసాయి తాగునీటి కార్మికులు నిరవధిక సమ్మె

### ఐదు నెలల బకాయిలు చెల్లించాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు

**అనంతపురం, ఆగస్టు 31: ప్రభాతవార్త బ్యూరో:** ప్రజల దాహార్తిని తీర్చే శ్రీ సత్య సాయి మంచినీటి పథకం నిర్వహణలో కీలకమైన కార్మికులు సమ్మె బాట పట్టారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.వి. నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేసినా, ఇప్పటివరకు కలెక్టర్ కార్యాలయం, వాటర్ సప్లై బోర్డు నుంచి ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేటి అర్ధరాత్రి నుంచి శ్రీ సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐదు నెలల బకాయి వేతనాలను చెల్లించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి వాటర్ సప్లై యూనియన్ కార్యదర్శి వన్నూరప్ప, కోశాధికారి శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, ఇమాములు, రామకృష్ణ, నడిపి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతిలోపు అందరికీ ఇళ్ళు

**కంకిపాడు ఆగష్టు31,ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ఉయ్యూరు పట్టణంలోని టిడ్కో గృహాలను సోమవారం ఎమ్మెల్యే బోడేప్రసాద్ సందర్శించారు. లబ్దిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ళతరబడి పేదకుటుంబాలు ఎదురుచూసిన టిడ్కోఇళ్ళకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని తెలిపారు. ప్రభుత్వాలు మారవచ్చు కానీ పేదవాడి సొంతింటికల ఎందుకు



మారాలి అని ప్రశ్నించారు. నవంబరు, డిసెంబరు నెలల్లో నిర్మాణ పనులను పూర్తిచేసి జనవరి15లోగా ప్రతి లబ్దిదారుడిచేతికి సొంతింటితాళం అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్, కూటమినాయకులు, అధికారులు, టిడ్కోలబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సజీవ దహనం

### గృహప్రవేశం చేసుకున్న నాలుగు రోజులకే విషాదం

### సత్రవు జంక్షన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**ఆనందపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త:** కొత్త ఇంట్లో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవితం ప్రారంభించిన యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాలుగు రోజులకే ఘోర రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమైన విషాద సంఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సత్తరువు జంక్షన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 28 ఏళ్ల పోలాకి అమర్నాథ్ పాత్రో అనే యువ ఇంజినీర్ మృతి చెందాడు. తాను నడుపుతున్న టాటా నెక్సాన్ కారు ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో కారు క్షణాల్లో మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. కారులో చిక్కుకున్న అమర్నాథ్ బయటకు రాలేక సజీవ దహనమయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా గునుపూర్‌కు చెందిన పోలాకి అమర్నాథ్ పాత్రో (28) తండ్రి మోహనరావు పాత్రో. అమర్నాథ్ పాత్రో గతంలో హైదరాబాద్‌లోని టీసీఎస్ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసాడు. సుమారు మూడు నెలల క్రితం పరదేశిపాలెంలోని జగన్నాథ్ స్కై గార్డెన్స్ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఆగస్ట్ 27న కొత్త ఇంట్లో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు.

**స్నేహితులను కలుస్తానని వెళ్లి:** ఆగస్ట్ 30న సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో స్నేహితులను కలవడానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పిన అమర్నాథ్ కారును తానే నడుపుకుంటూ ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రి 12 గంటలు దాటినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి ప్రశాంతి పాత్రో కుమారుడికి ఫోన్ చేశారు. తాను దారిలో ఉన్నానని, త్వరలోనే ఇంటికి వస్తానని అమర్నాథ్ చెప్పాడు. అయితే రాత్రి సుమారు 2 గంటల సమయంలో మరోసారి ఫోన్ చేయగా అతని మొబైల్ స్విచ్ ఆఫ్ అయి ఉండటం కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. కొద్దిసేపటికే పోలీసుల నుంచి ప్రమాద సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆగస్ట్ 31వ తేదీ తెల్లవారుజామున సుమారు ఒంటి గంట సమయంలో అమర్నాథ్ కారు ఆనందపురం నుంచి పెందుర్తి వైపు సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తోంది. సత్తరువు జంక్షన్ వెయిట్ బ్రిడ్జి సమీపంలో అదే మార్గంలో ముందుగా వెళ్తున్న లారీని కారు వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు కారు నుజ్జునుజ్జయి, వెంటనే మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. క్షణాల్లో మంటలు కారును చుట్టుముట్టడంతో అందులో చిక్కుకున్న అమర్నాథ్ బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ప్రమాదాన్ని గమనించిన వారు కారులో ఉన్న వ్యక్తిని రక్షించేందుకు డోర్ తెరిచే ప్రయత్నం చేసినప్పటికీ, భారీగా ఎగిసిపడుతున్న మంటలు, ప్రమాద తీవ్రత కారణంగా సాధ్యం కాలేదు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్న వ్యక్తి కూడా తీవ్రంగా కాలిపోవడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అమర్నాథ్ తల్లి పోలాకి ప్రశాంతి పాత్రో, ఆమె భర్త, కుమార్తెతో పాటు ఇతర బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులు భీమిలి మార్చురీకి చేరుకుని తీవ్రంగా కాలిపోయిన మృతదేహాన్ని పరిశీలిం చారు. మృతదేహాన్ని తమ కుమారుడు పోలాకి అమర్నాథ్ పాత్రోగా గుర్తించారు. మృతుడి తల్లి పోలాకి ప్రశాంతి పాత్రో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు.



అమర్నాథ్ పాత్రో (ఫైల్)

## పదవీ విరమణ ఉద్యోగుల అనుభవాలు భవిష్యత్తు తరాలకు అమూల్య మార్గదర్శకాలు

### టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో సుదీర్ఘకాలం అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల అనుభవాలు సంస్థకు ఎంతో విలువైనవని, వారి సేవానుభవాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అన్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టిటిడి ఉద్యోగుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 16 మంది పదవీ విరమణ ఉద్యోగులకు సామూహిక సన్మాన కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిటిడి ఇఒ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సేవానుభవాలు భవిష్యత్ తరాలకు విలువైన పాఠాలు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఉద్యోగులు తమ సేవా కాలంలో ఎదుర్కొన్న ముఖ్యమైన సంఘటనలు, సవాళ్లు, వాటిని అధిగమించిన విధానాలు, విధి నిర్వహణలో పొందిన అనుభవాలను నోట్ రూపంలో సిద్ధం చేసి సహచర ఉద్యోగులతో పంచుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉద్యోగుల నుంచి లభించే ఈ విలువైన జ్ఞానం భవిష్యత్తులో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిం చేందుకు దోహదపడుతుందని తెలిపారు. టిటిడి ప్రత్యేక




కార్యాచరణ ఉద్యోగుల పదవీ విరమణకు సంబంధించిన సర్వీస్ ప్రక్రియలను ముందుగానే పూర్తి చేసి, వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా చర్యలు తీసుకున్నామని ఇఒ తెలిపారు. పదవీ విరమణ పొందే రోజే ఉద్యోగులకు అందాల్సిన అన్ని ప్రయోజనాలు వారి ఖాతాల్లో జమ అయ్యేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించి, శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో జెఇఒ (విద్య, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్, డిప్యూటీ ఇఒలు లోకనాథం, ఆనందరాజు, గోవిందరాజు, పదవీ విరమణ పొందిన అధికారులు ఇఒ జయరామ్ నాయక్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 25న అనంతపద్మనాభ వ్రతం

**తిరుమల,ఆగస్టు 31ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్దశి పవిత్రమైన రోజున తిరుమలలో అనంతపద్మనాభవ్రతం జరుపుకోవడం ప్రత్యేకత. సెప్టెంబర్ 25వతేదీ శుక్రవారం ఉదయం 6గంటలకు, ఆలయ పూజారులు వేద మంత్రాలను పఠిస్తూ చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుండి వరాహ స్వామి ఆలయానికి వైభవంగా ఊరేగింపుగా తీసుకువస్తారు. తరువాత సుదర్శన చక్రానికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామి పుష్కరిణి పవిత్ర జలాల్లో చక్రత్తాళ్వార్‌ను నిమజ్జనం చేసి పవిత్ర స్నానం చేయిస్తారు. ఈ క్రతువుల అనంతరం చక్రత్తాళ్వార్‌ను తిరిగి తిరుమల ఆలయానికి తీసుకువెళ్తారు. సాధారణంగా ఆలయ పురోహితులు సంవత్సరంలో బ్రహ్మోత్సవాలు, ముక్కోటి ద్వాదశి, రథ సప్తమి అనంత పద్మనాభ వ్రతంతో సహా నాలుగు సందర్భాలలో చక్రత్తాళ్వార్‌కు పవిత్ర స్నానం చేయిస్తారు. శ్రీవారి ఆలయంలోని ప్రధాన దేవత పాదపద్మాల వద్ద, ఆలయ పురోహితులు వ్రత మహాత్యాన్ని పఠించి అనంత పద్మనాభ వ్రతాన్ని నిర్వహిస్తారు.



## 11 మంది నిందితుల అరెస్టు

**గుంటూరు క్రైమ్, ఆగస్టు31,ప్రభాతవార్త:** గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పెంద్రాల వెంకన్న హత్య కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి మొత్తం 11 మంది నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, పాత కక్షలు, ప్రతీకార భావంతో నిందితులు వెంకన్న చిన్నను హత్య చేయడానికి పథకం రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నెల29వ తేదీన వెంకన్న తన కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరుకు వచ్చిన విషయం తెలుసుకున్న నిందితులు, అతని కదలికలను గమనిస్తూ అవకాశం కోసం ఎదురుచూశారు. 30వ తేదీ ఉదయం సుమారు 09.00 గంటల సమయంలో, కె.వి.పి కాలనీ 1/7వ లైన్ ప్రాంతంలో వెంకన్న చిన్నను నిందితులు అడ్డగించి దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడు కత్తితో దాడి చేయగా, మరికొందరు నిందితులు కర్రలు, చేతులతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో పెంద్రాల ఇమ్మానుయేలు రాజి, పెంద్రాల అమూల్య రాజు, పెంద్రాల దేవరాజు, పెంద్రాల గురవయ్య, పెంద్రాల శ్యామ్, పెంద్రాల బుజ్జి, పెంద్రాల జమాలమ్మ, పెంద్రాల రాజ్ కుమార్ రాజు, బత్తుల మోషే రాజు మోషే, దేవరకొండ షాలేమ్ రాజు సలీమ్, ఇరుగు బాబుఅనే మొత్తం 11 మంది నిందితులను ఆదివారం అర్ధరాత్రి సుమారు 01.45 గంటలకు అరెస్ట్ చేశారు. అరెస్టుకు తెలియజేశారు. గల కారణాలను నిందితులకు చట్టప్రకారంనిందితుల విచారణలో వారి వద్ద ఉన్న వాహనాల వివరాలు వెలుగులోకి రావడంతో, నేరానికి ఉపయోగించిన ఏపీ40లిబి 2414 నంబరు గల హెచ్.ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్, ఏపీ40నిళి0183 నంబరు గల బజాజ్ పల్సర్ ఎన్.ఎస్125 మోటార్ సైకిల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, నిందితుడు ఇమ్మానుయేలు రాజు చూపించిన ప్రదేశంలో దాచి పెట్టిన నేరానికి ఉపయోగించిన పదునైన కత్తిని మంగళవారం ఉదయం పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం, నేరానికి ఉపయోగించిన ఇతర వాహనాలు, ఇతర ఆధారాలపై దర్యాప్తు కొనసాగు తోందని పోలీసులు తెలిపారు.

## ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి

### రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

### ఎసిబి అధికారుల అదుపులో ఇద్దరు



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్ రెడ్డి

**అనంతపురం క్రైమ్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** కొత్తగా ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న బాధితుడి నుండి లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి అవినీతి నిరోధక శాఖ అధికారులు వేసిన వలలో చిక్కుకున్నారు. బాధితుడి నుండి లంచం పుచ్చుకుంటున్న శానిటరీ వర్కర్ కంబగిరిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం సాయం త్రం అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు నందు ఉన్న ఓ టీ కేఫ్ నందు ఈ ఘటన జరిగింది. ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి అందించిన వివరాల మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన బోయ నాగేంద్రకు అనంతపురం రూరల్ మండలంలోని కక్కలపల్లి కాలనీ నందు సర్వేనెంబర్ 122, 3 బీ నందు ప్లాట్ నంబర్ 21 లో నాలుగు సెంట్లు ప్లాట్ ఉందన్నారు. సదరు ప్లాట్ నందు కొత్తగా ఇంటికి నిర్మించేందుకు నాగేంద్ర పంచాయతీ కార్యాలయం నుండి అనుమతి తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇంటి నిర్మా ణానికి సంబంధించి పంచాయతీ కార్యాలయం నుండి అప్రూవల్ మంజూరు చేసేందుకు సదరు పంచాయతీ కార్యదర్శి ఇనాయతుల్లా బాధితునికి రూ. 10వేలు లంచం డిమాండ్ చేశారు. బేర మాడి చివరకు రూ. 8 వేల రూపాయలు లం చంగా ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ నేపథ్యం లో లంచం ఇచ్చేందుకు ఇష్టపడని బాధితుడు నాగేంద్ర వెంటనే అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఇనాయతుల్లా నేరుగా తాను లంచం తీసుకోకుండా తన దగ్గర పనిచేస్తున్న శానిటరీ వర్కర్ కంబగిరికి డబ్బులు తీసుకోమని పురమా యించాడు. దీంతో కళ్యాణదుర్గం రోడ్డు లోని ఓ టి కేఫ్ నందు బాధితుడు కంబగిరికి లంచం డబ్బులు నగదును అందిస్తుండగా అప్పటికే ప్రణాళిక రచించిన ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. కంబగిరితో పాటు పంచాయతీ కార్యదర్శి ఇనాయతులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఇరువురి పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసిబి డిఎస్పి ప్రసాద్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని డిఎస్పి పిలుపునిచ్చారు.

## 19 మంది షిఫ్ట్ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

### ఏఐటీయూసీ


**నరసరావుపేట టౌన్, ఆగస్టు 31 (ప్రభాతవార్త):** వినుకొండ నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాల్లో షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న 19 మంది కార్మికులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి కారణం లేకుండా తొలగించారని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పల్నాడు జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసరావు ఆరోపించారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు, వారు పనిచేసిన కాలానికి చెల్లించాల్సిన పెయిడ్ హాలిడేస్, పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ద్వారా వేతన సవరణ జరిగిన కాలానికి సంబంధించిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అదెయ్యకు యూనియన్ నాయకులు ఫిర్యాదు పత్రం అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.కె. సుభాని సమక్షంలో ఫిర్యాదును పరిశీలించిన డీఆర్వో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, అన్యాయంగా తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు అందాల్సిన వేతనాలు, ఇతర బకాయిలు పూర్తిగా చెల్లించేంత వరకు యూనియన్ తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తొలగించబడిన కార్మికులు లింగ నాయక్, రవి నాయక్, రాజేష్ నాయక్, రేలా కొండలు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు గంజి రాములు, అంజమ్మ జ్ఞాపకార్థం కూరగాయల పంపిణీ

**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** కీర్తిశేషులు గంజి రాములు, అంజమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, సామాజిక సేవకులు గంజి వీరాస్వామి ఆర్థిక సహాయంతో జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని మాస్టిన్‌పేటలో గల జ్యోతి ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి ఆధ్వర్యంలో తొలి నెల కూరగాయల సేవా కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజి వీరాస్వామి తన మాతృ సంస్థతో పాటు జ్యోతి ఫౌండేషన్ ద్వారా కూడా సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు భౌతికంగా లేకపోయినా, వీరాస్వామి చేస్తున్న సేవా కార్యక్రమాల రూపంలో వారు సజీవంగా ఉన్నట్లేనని పేర్కొన్నారు. కూరగాయలతో పాటు కార్యక్రమానికి హాజరైన వారికి స్నాక్స్ కూడా అందించారు. కార్యక్రమంలో గంజి వీరాస్వామి, వలేటి కుమారి, దివ్వెల శ్రీనివాసరావు, మల్లాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే కన్నాకు కృతజ్ఞతలు

**సత్తెనపల్లి (ఆగస్టు 31, ప్రభాతవార్త):** సత్తెనపల్లి నియోజకవర్గంతో పాటు పల్నాడు జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో తన వాణిని వినిపించడమే కాకుండా, సంబంధిత శాఖ అధికారులతో తన అనుభవంతో మాట్లాడి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కృషి చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులు దివ్వెల శ్రీనివాసరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాల్లో ముఖ్యమైన తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.



## సుంకర శ్రీనివాసరావు అంతిమయాత్రలో పాల్గొన్న చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ మక్కెన

**వినుకొండ, ఆగస్ట్31,ప్రభాతవార్త:** పట్టణంలోని కూరగాయల మార్కెట్ అధ్యక్షులు, కాపు సంఘం నాయకులు, టిడిపి సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు(56) గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న



ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, డీసీసీబీ మక్కెన మల్లికార్జునరావులు స్థానిక 14వ వార్డు శృంగారవనంలో ఆయన నివాసానికి చేరుకొని ఎస్ఆర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, ఎస్ఆర్ అభిమానులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## సాగర్ జలాలని తాగడానికే వినియోగించాలి: ఎస్ఐ

**పెదకూరపాడు.( ఆగస్టు 31 ప్రభాతవార్త )** సాగర్ నుంచి నీరు విడుదల చేశారని, గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం చెరువులు, ట్యాంకులను నింపుకోవాలని పెదకూరపాడు ఎస్సై అల్లురెడ్డి సూచించారు. పంట పొలాలకు సాగునీటి కోసం నీటిని వినియోగించరాదన్నారు. వాగులు, వంకలు, గుంటల్లో మోటర్లు ఏర్పాటు చేసి నీటిని సేకరించవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో వీఆర్వో లు, వీఆర్ఏ లు, లస్కర్లు కాలువ గట్లపై పర్యటిస్తారని తెలిపారు. రైతులు ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దన్నారు. మాలమూల గ్రామానికి సైతం నీరు అందాలంటే ప్రతి ఒక్క రైతు సహకరించాలని తాగినోటి ఎద్దడి లేకుండా గ్రామాలు ఉండాలంటే ఒకరికొకరు సహకరించుకొని సకాలంలో చెరువులు నింపుకోవాలన్నారు

## లెగసీ వేస్ట్ వెంటనే తొలగించాలి

### తాడిగడపలో డంప్ యార్డ్‌ను పరిశీలించిన పట్టాభిరామ్

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలోని తాడిగడప మున్సిపాల్టీ పరిధిలోని డంప్ యార్డ్ ప్రదేశంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ ని వెంటనే తొలగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. తాడిగడప మున్సిపాల్టీకి చెందిన డంప్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన సోమవారం సాయంత్రం సందర్శించారు. ఆ ప్రాంతం మొత్తాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న లెగసీ వేస్ట్ ని త్వరితగతిన తొలగించాలని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, ఏజెన్సీ వారిని ఆదేశించారు. లెగసీ వేస్ట్ తొలగింపునకు సంబంధించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ క్లియర్ చేసిన తర్వాత ఈ పట్టణంలో వచ్చే చెత్తని విజయవాడ జవహర్ ఆటోనగర్ ఐలా (ఆటోనగర్ ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ) వారు చూపించిన ప్రదేశానికి తరలించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు ఐలా వారితో సంప్రదించి, వారి సమన్వయంతో చెత్తని తరలించాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు.



## రేపు ఎంఎస్ఎంఇ గ్రోత్ వర్క్‌షాప్: ఎన్టీఆర్ కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు31, ప్రభాతవార్త:** ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేసి, పోటీతత్వాన్ని పెంచేందుకు రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ యంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం సెప్టెంబర్ 2వ తేదీ విజయవాడలో యంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. భారీస్థాయిలో జరిగే ఈవర్క్‌షాపుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 2026 మే 26వతేదీ నుండి ఆగస్టు 29వతేదీ వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా శాఖల వారీ పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 258 దరఖాస్తులు రాగా వీటిలో 226 దరఖాస్తులు ఆమోదం పొందాయని పరిశ్రమల అధికారులు వివరించారు. మిగిలిన దరఖాస్తులను నిర్దిష్టగడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పెట్టుబడి రాయితీ, వడ్డీ, విద్యుత్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలలో భాగంగా 22 క్లెయిమ్‌లకు గానూ, రూ.3.24కోట్ల మేర ప్రతిపాదనలను తాజాగా చర్చించి డిఐఈపీసి ఆమోదం తెలిపింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌లో సిఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖపట్నంలో జరుగనున్న నేపథ్యంలో విజయవాడలో అక్టోబర్‌లో రీజినల్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని ఈసదస్సును విజయవంతం చేసేందుకు సమిష్టి కృషి అవసరమన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాపరిశ్రమల అధికారి యం.ఆదం, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ కె.బాబ్జి, వి.మురళీకృష్ణ, కనకదుర్గ, ఆర్‌డీవోలు పాల్గొన్నారు.



## కండలేరు డ్యామ్‌ను పరిశీలించిన సేఫ్టీ నిపుణుల కమిటీ

### హెడ్ రెగ్యులేటర్ గేట్లు పనితీరుపై నివేదిక

**రాపూరు (నెల్లూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన కండలేరు డ్యాంను సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ పరిశీలించింది. ప్యానల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ ఛైర్మన్, విశ్రాంత సిఈ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలోని ఈ కమిటీ డ్యాంను క్షుణ్ణంగా పరిశీలించారు. డ్యామ్ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై కమిటీ సభ్యులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. కండలేరు డ్యాంను స్పెసిఫైడ్ డ్యామ్‌గా గుర్తించి, ఎర్త్‌బండ్ భద్రత, సీపేజ్, స్పిల్ వే గేట్లు, రైట్ హెడ్ రెగ్యులేటర్, లో లెవల్ స్లూయిస్, పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్పిల్‌వే గేట్లు,రైట్ హెడ్ రెగ్యులేటర్ గేట్‌లు,మరమతులకు గుర్తైనట్లు కమిటీ గుర్తించింది. గేట్ల మరమతులకు అవసరమైన స్టాప్ లాక్ ఎలిమెంట్లను దించడంలో సైతం ఇబ్బందులు వున్నట్లు వారు గుర్తించారు. డ్యాం భద్రతకు సంబంధించిన తమ పరిశీలనలో వెల్లడైన విషయాలను,వాటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వారు తెలిపారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేసి కండలేరు డ్యాం వద్ద వున్న లోపాల సవరణలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ బృందంలో విశ్రాంత ఎస్ఈ వెంకటేశ్వర్లు, మెకానికల్ నిపుణుడు శ్రీకాంత్,తెలుగుగంగ ఎస్ఇ జి.కే సుబ్రమణ్యేశ్వర రావు, ఇఇ గజేంద్ర రెడ్డి, డిఇఇ కె. అనీల్ బాబు, ఎఇ. అనీల్ కుమార్ తదితరులు వున్నారు.



## మైనింగ్‌తో సంబంధం లేకపోయినా పదే పదే ఆరోపణలు

### జగన్ నుండి మొదలుకుని అనిల్ వరకు వీపీఆర్‌ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారు: బీద రవిచంద్ర

**నెల్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త - ప్రైజం:** మైనింగ్‌తో సంబంధం లేకపోయినా వీపీఆర్ పై అనిల్ పదే పదే మైనింగ్ ఆరోపణలు చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర పేర్కొన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీద మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి వచ్చిన విపిఆర్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ 2 టికెట్స్ ఇచ్చిందని అనిల్ తన అక్కసు వెళ్ళగక్కుతున్నారు. ఇందులో సీక్రెట్ ఏముంది అనిల్ ఇది అందరికీ తెలిసిన విషయమే కదా. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి వచ్చిన నేతలకు మీ పార్టీ టికెట్స్ ఇవ్వలేదా అని అన్నారు. ఇతర దేశాల టెక్నాలజీని ఉపయోగించుకొని, కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సంవత్సరం క్రితం మైనింగ్ ఫ్యాక్టరీ పెట్టాలని తాను చేసిన ప్రయత్నం వాస్తవమని వీపీఆర్ నాడు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి మన ప్రాంతాల్లో దొరికే ముడి సరుకులను ఉపయోగించుకుని మైనింగ్ ఇండస్ట్రీ పెట్టాలని నాడు వీపీఆర్ ఆలోచన చేశారు. పలు కారణాలతో మైనింగ్ పరిశ్రమ ప్రయత్నం విరమించుకుంటున్నానని, మైనింగ్ పరిశ్రమతో తనకు సంబంధం లేదని వీపీఆర్ నాడే తేల్చి చెప్పారు. విపిఆర్ సొంత భూమి 350 ఎకరాల్లో నూతనంగా ప్రైవేట్ సెజ్ ఏర్పాటు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నూతన పాలసీలను ఉపయోగించుకుని ఇండస్ట్రీలు తీసుకురావాలని నేడు అనుకుంటున్నారు. వీపీఆర్ మైనింగ్ పేరుతో ఉన్న ఆ భూమిని దేనికో లింక్ చేసి, చైనా వీసాలు, అక్రమ వ్యాపారాలు అంటూ అనిల్ నోటికొచ్చినట్టు ఏవేవో మాట్లాడుతున్నారు.

## పిఎంఎవై లబ్ధిదారులకు నిధులు మంజూరు

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పీఎంఏవై పథకం కింద 17,912 అర్బన్ 2.0 బీఎల్‌సీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.447.8 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు కేటాయించారు. అత్యధికంగా అనంతపురంలో 1,387, అత్యల్పంగా పశ్చిమ గోదావరిలో 212 యూనిట్లు నిర్మిస్తున్నారు. లబ్ధిదారులకు దశలవారీగా చెల్లింపులు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

# ఎస్.సి,ఎస్.టి, బిసిలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

### గత ఏడాది 143 కోట్ల రూపాయలతో మౌలిక వసతుల కల్పన: గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ఎం. ఎం. నాయక్



**విశాఖపట్నం, ఆగస్టు 31ప్రభాత వార్త:** గిరిజన విద్యార్ధని,విద్యార్థులకు మేలైన విద్యనందించాలని విశాఖపట్నంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రభుత్వానికి పిల్లల భవిష్యత్ ముఖ్యమని, పిల్లలను ఎవరూ ప్రభావితం చేయకూడదని, తల్లిదండ్రుల అభిప్రాయాలను గౌరవించి, వారి కోరిక ప్రకారం చేయడానికి ప్రయత్నిస్తామని సమస్యల గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ఎం. ఎం. నాయక్ వెల్లడించారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థల కార్యదర్శి గౌతమి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ లతో కలిసి కలెక్టరేట్‌లోసోమవారం మధ్యాహ్నం ఆయన మీడియా సమావేశం లో మాట్లాడారు.ఈ సమావేశంలో నాయక్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. గత ఏడాది 143 కోట్ల రూపాయలు వెచ్చించి హాస్టళ్ల మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు వ్యాధులు సంభవించకుండా, శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు ఇతర ప్రాథమిక మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గత ఏడాదిన్నరగా విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకువచ్చామని, చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం మైల్ అలాగే ఎఫ్ఎల్ఎన్ (ఫంక్షనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నమన్నారు. ప్రస్తుత సీఓఈ లలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో, ప్రయోగాత్మకంగా 5 నుండి 12వ తరగతి వరకు కాకుండా కేవలం ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాత్రమే ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 6 సీఓఈలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఎస్సీలకు 3 (తాడికొండ, మేఘాద్రిగడ్డ, కోట), ఎస్టీలకు 1 (మారికవలస), బీసీలకు 2 చొప్పున కేటాయిం చడం జరిగిందన్నారు.

వైజాగ్ విద్యాకేంద్రంగా ఉన్నందున మారికవలస బాలుర రెసిడెన్షియల్ భవనం సీఓఈకి అనుకూలంగా ఉందని ఎంపిక చేయడం జరిగిందని, బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ప్రముఖ విద్యాసంస్థ ఫిజిక్స్ వాలాఖ్ ను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెరో 150 సీట్లు చొప్పున 300 మంది ఎం పి సి, 300 బై పి సి. కలిపి 600 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నామన్నారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా గురుకులం సెక్రటరీ పర్యవేక్షణలో అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కోఎడ్యుకేషన్ పద్ధతిలో బోధన, ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మారికవలసలోని పాఠశాల విద్యార్థులను తల్లిదండ్రుల సమ్మతితో సమీపంలోని శ్రీకృష్ణాపురం, మారికవలస గర్ల్స్ సీఓఈ, ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశామని, మూడు రోజుల పాటు సీనియర్ అధికారులు, పాడేరు ఐటీడీఏ పీవో తల్లిదండ్రులతో సమావేశమై వారి అభీష్టం మేరకు విద్యార్థులను సర్దుబాటు చేశామన్నారు. మాడుగుల ప్రాంతానికి చెందిన 39 మంది విద్యార్థులను వారి కోరిక మేరకే పంపించమని, 26వ తేదీన పాడేరు వద్ద కొందరు బస్సును ఆపి ధర్నా చేయడంతో, విద్యార్థులు కోరిన విధంగా ఆ 39 మందిని తిరిగి మారికవలసలోనే కొనసాగించాలని నిర్ణయించామని, ప్రస్తుతం మారికవలస, శ్రీకృష్ణాపురంలలో విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. ఏకలవ్య (ఈఎంఆర్ఎస్ ), ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటికే కోఎడ్యుకేషన్ అమలులో ఉందని, విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తు మాత్రమే ప్రభుత్వానికి ప్రాధాన్యత అని ప్రిన్సిపల్ సెక్రటరీ స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

### సోషల్ మీడియా వేదికగా ప్రకటన



**మియామీ, ఆగస్టు 31:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత ప్రతిభావంతుడైన క్రీడాకారుల్లో ఒకరైన లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గుడ్‌బై చెప్పారు. తన రిటైర్మెంట్‌ను సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. స్పానిష్ భాషలో చేతితో రాసిన నోట్‌బుక్‌లోని ఒక ఎంట్రీని చూపిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్‌లో, 39 ఏళ్ల వయసులో తాను అర్జెంటీనా జాతీయ జట్టు నుండి రిటైర్ అవుతున్నట్లు మెస్సీ ధ్రువీకరించారు. ఈ ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేసఇంది. సుదీర్ఘకాలం పాటు అర్జెంటీనా జట్టుకు ప్రతినిధిగా వ్యవహరించిన మెస్సీ, తన అద్భుతమైన ఆటతీరుతో మైదానంలో ఎన్నో మరుపురాని ఘట్టాలను ఆవిష్కరించారు.

అంతర్జాతీయ స్థాయిలో అర్జెంటీనా తరఫున ఏకంగా 207 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించిన లియోనెల్ మెస్సీ, మొత్తం 125 గోల్స్ సాధించి అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా సంచలన రికార్డు నెలకొల్పారు. సుదీర్ఘ పోరాటం తర్వాత అర్జెంటీనాకు ఖతార్ వేదికగా జరిగిన 2022 ఫిఫా ప్రపంచ కప్‌ను అందించడంలో మెస్సీ అత్యంత కీలక పాత్ర పోషించారు. ప్రపంచ కప్‌తో పాటు కోపా అమెరికా టోర్నమెంట్లలో కూడా జట్టును విజయతీరాలకు చేర్చి దశాబ్దాల నిరీక్షణకు తెరదించారు. తన అపారమైన అనుభవం, ఖచ్చితమైన పాసింగ్, లీడర్‌షిప్ నైపుణ్యాలతో జట్టును ఎన్నో కీలక సమరాల్లో విజయపథంలో నడిపించారు. మెస్సీ నిర్ణయం క్రీడా ప్రపంచం, ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారులు, దిగ్గజాలు స్పందిస్తూ ఆయన సేవలను కొనియాడారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో మెస్సీ అందించిన సహకారం, నెలకొల్పిన రికార్డులు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. జాతీయ జట్టుకు దూరమైనప్పటికీ, క్లబ్ ఫుట్‌బాల్‌లో ఆయన ఆటను చూసే అవకాశం అభిమానులకు కొనసాగుతుంది. మేజర్ లీగ్ సాకర్ క్లబ్ ఇంటర్ మియామితో మెస్సీ ఒప్పందం 2028 సీజన్ ముగిసే వరకు కొనసాగుతుంది. ఒక సాధారణ యువకుడిగా ప్రయాణం ప్రారంభించి ప్రపంచ కప్ విజేతగా అంతర్జాతీయ రంగానికి వీడ్కోలు పలకడం ద్వారా మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని ముగించారు.

## ఎంబిబిఎస్ వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు

**విజయవాడ..,ఆగస్టు31,ప్రభాతవార్తప్రతినిధి:**ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ వెబ్ ఆప్షన్ల నమోదుకు రేపు సాయంత్రం 4 గంటల వరకు గడువు ఇచ్చారు. తుది మెరిట్ జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అర్హులుగా పరిగణింపబడతారు.

## పులుల సంరక్షణకు స్టీరింగ్ కమిటీ

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:** నాగార్జున సాగర్‌శ్రీశైలం పులుల సంరక్షణ ప్రాంతం కోసం వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రాష్ట్రస్థాయి కమిటీకి ముఖ్యమంత్రి అధ్యక్షుడిగా వ్యవహరించనుండగా, అటవీశాఖ మంత్రి ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## మద్యం మత్తులో వీరంగం, కత్తులతో దాడికి యత్నం

### దర్గా సమీపంలో అర్ధరాత్రి రౌడీమూకల హాల్ చల్



**అనుమసముద్రంపేట (నెల్లూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** నిత్యం వందలాది, వేలాది మంది భక్తులతో ఆధ్యాత్మిక ప్రాంతంగా, సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తున్న ఏఎస్‌పేటలోని శ్రీశ్రీశ్రీ నాయబ్ రసూల్ దర్గా సమీపంలోని నగరఖానా సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి కొందరు యువకులు మద్యం మత్తులో హల్‌చల్ చేయడం తీవ్ర కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. సుమారు 10 మంది యువకులు మద్యం సేవిస్తూ అక్కడ హడా వుడి చేస్తుండగా, ఇదేమిటంటూ స్థానికులు ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు కత్తులు, బీరు సీసాలతో స్థానికులపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక యువత వారిని ప్రతిఘటించింది.పోలీసులపైనా తిరగబడిన ముఠా! సమాచారం అందుకున్న ఏఎస్‌పేట పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, ఆ యువకులు పోలీసులపైనా తిరగబడినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పోలీసులు, స్థానికులు కలిసి ఆరుగురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.

## తరుణవాయి వద్ద రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి

**సంగం (నెల్లూరు), ఆగస్టు 31, ప్రభాతవార్త :** సంగం మండలం ముంబాయి రహదారిలో తరుణవాయి వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. నీలయాపాళెం గ్రామానికి చెందిన వెంటరమణయ్య మృతి చెందాడు. హాస్పటల్‌కి తీసుకొని వెళుతుండగా అక్కడకు చేరగానే మృతి చెందాడు. ఈ సంఘటనతో నీలయాళెంలో విషాధ చాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రౌడీ షీటర్ దారుణ హత్య

**నెల్లూరు, ఆగస్టు 31, ప్రభాతవార్త:** నగరంలో దారుణం చోటుచేసుకుంది. ఓ రౌడీ షీటర్‌ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చిన ఘటన ఆదివారం రాత్రి ఆర్టీవో కార్యాలయం సమీపంలో కలకలం రేపింది. పోలీస్ వర్గాల సమాచారం ప్రకారం. చంద్రమౌళి నగర్‌కు చెందిన లక్ష్మిశెట్టి సాయి తేజ అలియాస్ కమ్మ సాయి (24) అనే యువకుడి పై వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉంది. శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం పోలీసులు గతేడాది పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపారు. ఇటీవలే శిక్షాకాలం ముగిసి బయటకు వచ్చిన సాయి, ఆ తర్వాత బుచ్చిరెడ్డిపాళెంలో తలదాచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు సాయి హాజరయ్యాడు. అనంతరం అర్ధరాత్రి సమయంలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్తుండగా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతనిని వెంబడించారు. పథకం ప్రకారమే దుండగులు సిమెంట్ రాయితో అతని తలపై తీవ్రంగా మోది హతమార్చారు. ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే నగర, నెల్లూరు గ్రామీణ డీఎస్పీలు గిరిధర్, పుట్టమనేని శ్రీనివాసరావు, వేదాయపాలెం ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ సీతారామయ్య, నగర ఇన్‌స్పెక్టర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.క్లూస్ టీమ్ రప్పించి అక్కడ లభించిన ఆధారాలనుసేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ఈ హత్యకు పాతకక్షలే ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో స్పష్టమవుతోంది. బీవీనగర్‌కు చెందిన ఓ రౌడీషీటర్‌తో పాటు మరి కొందరు వ్యక్తులు ఈ హత్య వెనుక ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## కాకినాడలో లవ్ జిహాద్.. హిందూ అమ్మాయిలే టార్గెట్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు31, ప్రభాతవార్త:** హిందూ అమ్మాయిలే టార్గెట్ గా ప్రేమ పేరుతో ముసుగు వేసి మాయమాటలతో వల విసిరాడు... ఒకరిద్దరు కాదు, ఏకంగా ఆరుగురు యువతుల జీవితాలతో ఆడుకున్నాడు కాకినాడకు చెందిన ఓ నిరవధిక కామ కిలాడీ దుర్మార్గుడు కాకినాడ జగన్నాథపురంలో మటన్ షాప్ నడుపుకునే గౌస్ మొహిద్దీన్ మాటల్లో నేర్పరి, మోసంలో దిట్ట. ప్రేమ అనే తీపి మాటలతో రమ్య శ్రీ అనే యువతికి దగ్గరయ్యాడు. ఆ తర్వాత ముస్లిం సాంప్రదాయంలో పెళ్లి చేసుకున్నాడు. అంతవరకు అంతా ఓకే అనుకున్నా ఆ పెళ్లి వెనుక ఉన్న అసలు రాక్షస కోణం బయటపడటంతో ఆ యువతి గుండె పగిలింది. ఈ క్రమంలో రమ్య శ్రీకి బీజేపీ నేతలు అండగా నిలిచారు. ఆమె తల్లిదండ్రుల సమక్షంలోనే బురఖా తొలగించి, నుదుటన బొట్టు పెట్టి... తిరిగి హిందూ సాంప్రదాయంలోకి ఘనంగా ఆహ్వానం పలికారు. బాధితురాలి కంప్లైంట్‌తో రంగంలోకి దిగిన పోలీసులు కిలాడీ గౌస్ మొహిద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జగన్నాథపురానికి చెందిన యువతిని మోసం చేసిన కేసులో అతడిపై కేసులు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. ప్రేమ పేరుతో ఆరుగురు అమ్మాయిల జీవితాలను నాశనం చేసిన ఈ మోసగాడి వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## హైకోర్టు ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్లకు పోస్టుల మంజూరు

**విజయవాడ,ఆగస్టు 31,ప్రభాతవార్తప్రతినిధి:**హైకోర్టులోని ఆర్బిట్రేషన్ సెంటర్, మీడియేషన్ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వం పోస్టులను మంజూరు చేసింది. ఆర్బిట్రేషన్ సెంటర్‌కు 15,మీడియేషన్ సెంటర్‌కు 14 పోస్టులను కేటాయించింది. ఆర్బిట్రేషన్ సెంటర్ డైరెక్టర్ సారథ్యంలో, మీడియేషన్ సెంటర్ కోఆర్డినేటర్ పర్యవేక్షణలో పనిచేయనున్నాయి. ఈ విభాగాలకు జిల్లా జడ్జి స్థాయిన్యాయాధికారులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించనున్నారు.

# వర్షాభావంలో శ్రీశైలం నీళ్లే రాయలసీమకు కీలకం

### సీమ ప్రజల చూపులు శ్రీశైలం పైనే

### శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తిని తెలంగాణ నిలుపుదల చేసేనా?

### తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ ప్రభుత్వం లేఖ

### పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని వైసిపి ఆందోళన

### హంద్రీ నీవా, హెచ్.ఎల్.సి నీరు తాగునీరుకు వాడాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు







శ్రీశైలం జలాశయం, హంద్రీనీవా మెయిన్ కెనాల్, పంట పొలాలకు నీళ్లు వదలాలని ఉరవకొండ ప్రాంత రైతులు ఆందోళన (ఫైల్)

**అనంతపురం, ఆగస్టు 31, ప్రభాతవార్త బ్యూరో**

ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు అయిన శ్రీశైలం జలాశయం ప్రస్తుతం రాయలసీమ జిల్లాలకు కీలకంగా మారుతుంది. ఎలినినో ప్రభావము వల్ల ఈ ఏడాది సీమ జిల్లాల్లో సరైన వర్షాలు లేకపోవడంతో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం వివిధ రూపాల్లో శ్రీశైలం జలాశయం నీటిని సీమ ప్రజలు ఆశిస్తున్నారు.. శ్రీశైలం జలాశయం నుంచి వివిధ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల ద్వారా రాయలసీమ జిల్లాలకు నీరు వస్తోంది. హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం, పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలు ప్రధానంగా తాగునీరు అందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలకు మాత్రమే సాగునీరు కూడా ఇస్తున్నాయి. సోమవారం సీఎం చంద్రబాబు ప్రారంభించిన వెలుగొండ లాంటి ప్రాజెక్టు కూడా శ్రీశైలం నీళ్ల పైనే ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి తెలంగాణ వాటా కింద అక్కడ రైతులు వాడుకునే హక్కు ఉంది.. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో ఆంధ్ర వాటా కింద వచ్చే నీటిలో రాయలసీమకు శ్రీశైలమే ఆధారం అయ్యింది .. తాజాగా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేయాలని రాయలసీమ వైసిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి వల్ల దిగువకు ఎక్కువ నీరు వెళ్తే శ్రీశైలంలో నీటిమట్టాలు తగ్గిపోయి పోతిరెడ్డి రెగ్యులేటర్ నుంచి తాగునీటికి కూడా నీరు తీసుకోవడానికి అవకాశం ఉండదని వైసిపి నాయకులు చెబుతున్నారు . ఈ విషయంలో ఏపీకి చెందిన ఒక మంత్రి మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేసినా ఆ నీళ్లు దిగువకు నాగార్జునసాగర్కు వస్తాయని, తద్వారా డెల్టా ప్రాంతానికి ఉపయోగమని చెప్పడం గమనించదగ్గ విషయం.. ఆ మంత్రి అభిప్రాయాన్ని కూడా వైసీపీ నాయకులు ఖండిస్తూ గోదావరి నీళ్లు, ఇతర రూపాల్లో డెల్టా రైతులకు ఇబ్బంది లేకుండా ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నందున శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయకూడదని డిమాండ్ చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కూడా నీటిపారుదల శాఖ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి తాజాగా లేఖ రాసినట్లు, ఆ లేఖలో శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

హంద్రీ నీవా నీటిపై అనంతలో రగడ..... శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతం అయిన కర్నూలు జిల్లా మల్యాల లిఫ్టు వద్ద నుంచి హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం ద్వారా సీమ జిల్లాలకు నీరు వస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది పంట పొలాలకు నీరు వదలాలని అనంతపురం జిల్లాలోవైసిపి ఆందోళన బాట పట్టగా అధికార కూటమి ప్రభుత్వం మాత్రం తాగునీటికే కష్టంగా ఉందంటూ ఎక్కడ కాలువల్లో మోటార్లు కూడా వేయకూడదని గట్టి చర్యలు తీసుకుంటున్నారు. కాలవద్ద ఉన్న పైపులను కోసి వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ కూడా పదేపదే తాగునీటికే హంద్రీ నీవా నీటిని, హెచ్ ఎల్ సి నీటిని వాడాలని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ-నీవా పథకం ద్వారా 26రోజుల్లో ఆగస్టు అంటే 30 తేదీ వరకు హంద్రీ-నీవా కోసం మాల్యాల వద్ద 5.686 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు తెలుస్తోంది. మాల్యాల వద్ద 8 పంపులతో రాయలసీమ తాగు అవసరాల కోసం జలాశయం నుంచి నీటి వినియోగం కొనసాగుతోంది.

శ్రీశైలం రిజర్వాయర్, మల్యాల పంపింగ్ స్టేషన్ తో పాటు జీడిపల్లి రిజర్వాయర్ లో ఉన్న నీటి వివరాలు పరిశీలిద్దాం.ఆగస్టు 30 నాటికి శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి రిజర్వాయర్ మట్టం (ఎఫ్ఆర్ఎల్) 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 872.10 అడుగులకు చేరింది. దాని స్థూల నిల్వ సామర్థం 215.81 టీఎంసీలకు గాను , ప్రస్తుతం రిజర్వాయర్ 150.81 టీఎంసీ ల నీరు కలిగి ఉంది.ప్రస్తుతం శ్రీశైలంలోకి ఇన్‌ఫ్లోలు తగ్గిపోయాయి. మొత్తం 31,231 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ఇందులో తెలంగాణ పవర్ హౌస్ ద్వారా 17,320 క్యూసెక్కులు, కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా 12,772 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలుస్తోంది. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకానికి ప్రస్తుతం 2,372 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. మొత్తం 12 పంపుల్లో హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం కోసం 8 పంపులు నడుస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 5 నుంచి హంద్రీ నీవా కు మాల్యాల లిఫ్టు ద్వారా అందిస్తున్నారు.ఆగస్టు 30 వరకు హంద్రీ-నీవా కోసం మాల్యాల వద్ద దాదాపు 5.864 టీఎంసీల నీటిని ఎత్తి పోసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో హంద్రీ-నీవా మెయిన్ కెనాల్ ద్వారా జీడిపల్లి రిజర్వాయర్‌కు 2,364 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

జీడిపల్లి సామర్థం ప్రస్తుత 1.680 టీఎంసీలు కాగా, నివేదిక ప్రకారం నిల్వ 1.78 టీఎంసీలు. అక్కడి నుంచి హెచ్.ఎన్.ఎస్.ఎస్ .ఫేజ్2 వైపు 1,176 క్యూసెక్కులు, పీఏబీఆర్ వైపు 90 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి. మొత్తం ఔట్‌ఫ్లో 2,364 క్యూసెక్కులు ఉంటుందని తెలుస్తోంది. కాగా ప్రకాశం జిల్లాలో వెలిగొండ టన్నెల్ ప్రాజెక్టు కు సోమవారం ప్రారంభోత్సవం చేశారు.

ఈ పరిస్థితుల్లో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లోఎస్ మెల్లగా పెరుగుతుండడం శ్రీశైలానికి మళ్లీ నీరు చేరడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రీశైలంపై ఆధారపడే రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల సాగు-తాగునీటి అవసరాలకు ఎగువ నుంచి మరింత స్థిరమైన ప్రవాహాలు మరింత ఎక్కువగా కొనసాగాలని ఆశిద్దాం.



## దులీప్ ట్రోఫీలో తిలక్ వర్మ శతకం

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ(225 బంతుల్లో 7 ఫోర్లతో 106 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్‌కు సారథ్యం వహిస్తున్న తిలక్ వర్మ నార్త్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో అజేయ సెంచరీతో సత్తా చాటాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై తిలక్ తన క్లాస్ బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో, సౌత్ జోన్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగుల ఆధిక్యం లభించింది. తిలక్ తో పాటు శ్రేయస్ గోపాల్(87) సత్తా చాటడంతో రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ 94 ఓవర్లలో 9 వికెట్లకు 285 పరుగులు చేసింది. నార్త్ జోన్ బౌలర్లలో గుర్నూర్ బ్రార్(4/70) నాలుగు వికెట్లు తీయగా, అర్షదీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్ తలో రెండు వికెట్లు తీసారు. 0 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జట్టును తిలక్, శ్రేయస్ తో కలిసి ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సెంచరీ ముంగిట శ్రేయస్ గోపాల్ ఔటైనా, టెయిలెండర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్న తిలక్ అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ 59.1 ఓవర్లలో 195 పరుగులకు కుప్పకూలింది. ఖ్రమాన్ ఇక్బాల్(76) ఒక్కడే హాఫ్ సెంచరీతో సత్తా చాటగా, కన్హయ వధవాన్(35) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సౌత్ జోన్ బౌలర్లలో విద్వత్ కావేరప్ప(4/64) 4 వికెట్లు తీయగా, నిదీష్(2/36), తనయ్ త్యాగరాజన్(2/31) రెండేసి వికెట్లు, కావురి సాయితేజ, శ్రేయాస్ గోపాల్‌కు చెరో వికెట్ దక్కింది.



### యుఎస్ ఓపెన్‌లో జొకోవిచ్
## సంచలన ఓటమి

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ 2026 లో నోవాక్ జొకోవిచ్ అనూహ్యంగా ఓటమితో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, అర్జెంటీనాకు చెందిన మరియానో నవోన్ తొలి రోజు అతిపెద్ద సంచలనాన్ని సృష్టించాడు. మరోవైపు, మాజీ ఛాంపియన్ డానియల్ మెద్వెదేవ్ స్ట్రెయిట్ సెట్స్ విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. నాలుగుసార్లు యూఎస్ ఓపెన్ ఛాంపియన్, 24 సార్లు గ్రాండ్ స్లామ్ విజేత అయిన నాలుగో సీడ్ జొకోవిచ్, ఆర్థర్ ఆషే స్టేడియంలో నాలుగు గంటల 36 నిమిషాల పాటు సాగిన సుదీర్ఘ పోరులో నవోన్ చేతిలో 7-6(5), 5-7, 4-6, 6-2, 6-1 తేడాతో ఓడిపోయాడు. 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత ఒక గ్రాండ్ స్లామ్‌లో తొలి రౌండ్‌లోనే జొకోవిచ్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. జోకోవిచ్ రెండు సెట్లకు ఒకటి ఆధిక్యంలో ఉండి, నాలుగో సెట్‌లో ఆరంభంలోనే ఒక బ్రేక్ సాధించినప్పటికీ, నవోన్ నిర్ణయాత్మకంగా పుంజుకున్నాడు. ఆ అర్జెంటీనా ఆటగాడు చివరి రెండు సెట్లలో ఆధిపత్యం చెలాయించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని దక్కించుకున్నాడు. కాగా 2021 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ అయిన మెద్వెదేవ్, ఫ్రెంచ్ క్వాలిఫయర్ హ్యూగో గాస్టన్‌ను రెండు గంటల 14 నిమిషాల పోరులో 6-4, 6-2, 6-4 తేడాతో ఓడించి ఫ్లషింగ్ మెడోస్‌కు మరింత సునాయాసంగా తిరిగి వచ్చాడు. ఈ విజయంతో అతను ఏటీపీ లైవ్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ముందుకు వెళ్లి 6వ స్థానానికి చేరుకున్నాడు.

### అఫ్ఘాన్‌తో టి20 సిరీస్.. టీమిండియాలో
# ముగ్గురు స్టార్లు ఔట్!




**న్యూఢిల్లీ:** అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ సెప్టెంబరు 13 నుంచి ప్రారంభం కానుంది. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలో జరగనుంది. దీనికి సంబంధించి సెప్టెంబరు 3న సెలెక్షన్ కమిటీ సమావేశమై భారత జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా యువ ఆటగాళ్లకు ఎక్కువగా అవకాశాలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే అఫ్గాన్ సిరీస్‌కు ఎంపిక చేయాల్సిన జట్టులో ముగ్గురు కీలక స్టార్ ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఇప్పుడు సెలెక్టర్లకు సవాలుగా మారింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అతడు అందుబాటులో లేకపోతే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు మరోసారి అవకాశం దక్కే అవకాశం ఉంది. తక్కువ మ్యాచ్‌ల్లోనే ఆకట్టుకునే ప్రదర్శన చేయగా, ఆరు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు సాధించడం అతడి సామర్థ్యాన్ని చాటుతోంది. అలాగే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా ఫిట్‌నెస్ సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. హార్దిక్ అందుబాటులో లేకపోతే ఆల్‌రౌండర్ స్థానాన్ని భర్తీ చేయడం సెలెక్టర్లకు పెద్ద పరీక్షగా మారనుంది. హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా భావిస్తున్న నితీశ్ కుమార్ కూడా ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా లేడు. అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో గాయపడిన అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. మరోవైపు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఫిట్‌నెస్ పరీక్షలో సానుకూల ఫలితం సాధించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా ఉన్నందున అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు అతడిని ఎంపిక చేసే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. నితీశ్ ఫిట్‌గా లేకపోతే సూర్యాంశ్ షెడ్గేకు అవకాశం దక్కే అవకాశముంది. అయితే బ్యాట్, బంతితో అతడి ప్రదర్శన ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. అదే సమయంలో శివమ్ దూబే జట్టులో ఉండే అవకాశం ఉన్నందున.. షెడ్గేను అదనపు ఆల్‌రౌండర్‌గా బ్యాకప్ ఆప్షన్‌గా ఎంపిక చేసే అవకాశముంది. పేసర్ హర్షిత్ రాణా ఎంపిక కూడా అనుమానంగానే ఉంది. అతడు అందుబాటులో లేకపోతే వేగంతో ఆకట్టుకున్న మయాంక్ యాదవ్‌కు మరోసారి జాతీయ జట్టులో చోటు దక్కొచ్చు.

ఆట



### ఆసియా కప్ క్వాలిఫైయర్స్‌లో
## భారత్ విజయం
### 1-0 తేడాతో సిరియా ఓటమి

**తాష్కెంట్:** ఎఎఫ్‌సి అండర్ 20, ఆసియా కప్ 2027 క్వాలిఫైయర్స్‌లో భారత్ సిరియాను ఓడించింది. సోమవారం తాష్కెంట్‌లోని దోస్లిక్ స్టేడియంలో సిరియాపై 1-0 తేడాతో స్వల్ప విజయంతో భారత్ తన ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ 2027 క్వాలిఫయర్స్ ప్రచారాన్ని ప్రారంభించింది. 86వ నిమిషంలో సింగమయుమ్ షమీ కట్ బ్యాక్ నుండి బంతిని నెట్‌లోకి పంపి చివరి నిమిషంలో గోల్ సాధించాడు. కొద్ది నిమిషాల తర్వాత ఒమాంగ్ దోడుమ్ ఇచ్చిన క్రాస్‌ను గున్లీబా వాంగ్‌ఖీరక్‌పామ్ గోల్‌గా మలచడంతో, బ్లూ కోల్ట్స్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేశామని భావించారు. కానీ అది ఆఫ్ సైడ్ అని ప్రకటించబడింది. కాగా వచ్చే ఏడాది చైనాలో జరగనున్న ఖండాంతర టోర్నమెంట్‌లో స్థానం కోసం ఇరు జట్లు ఎదురుచూస్తున్నాయి. కేవలం ఎనిమిది గ్రూప్ టాపర్లు, ఏడు ఉత్తమ రన్నరప్‌లు మాత్రమే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. భారత్, సిరియాలు గ్రూప్ బి లో ఉన్నాయి, ఇందులో బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్ కూడా ఉన్నాయి. భారత జట్టు తొలిసారిగా అండర్20 ఆసియా కప్‌లో అడుగుపెట్టే ప్రయత్నంలో భాగంగా, తదుపరి మ్యాచ్ ఆతిథ్య ఉజ్బెకిస్తాన్‌తో తలపడనుంది.

### ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్:
## భారత్ మహిళల జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలో ఎంపిక ట్రయల్స్ ముగిసిన అనంతరం, అమెరికాలో జరగనున్న అండర్23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ల కోసం భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మహిళల జట్టును సోమవారం ఖరారు చేసింది. రోజంతా జరిగిన ఈ ట్రయల్స్‌లో, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ప్రముఖ రెజ్లింగ్ రాష్ట్రాలకు చెందిన రెజ్లర్లు మొత్తం 10 వెయిట్ కేటగిరీలలో భారత బృందంలో స్థానాల కోసం పోటీపడ్డారు.

ఎంపిక ట్రయల్స్‌లో హర్యానా ఆధిపత్యం చెలాయించి, పలువురు రెజ్లర్లు అగ్రస్థానాలు సాధించగా, మహారాష్ట్ర కూడా పలు వెయిట్ కేటగిరీలలో బలమైన ప్రదర్శన కనబరిచింది. 50 కేజీల విభాగంలో పర్వీన్ అగ్రస్థానం సాధించగా, 53 కేజీల విభాగంలో స్వీటీ విజయం సాధించింది. 55 కేజీల విభాగంలో మహారాష్ట్రకు చెందిన అహల్యా షిండే అగ్రస్థానంలో నిలవగా, 57 కేజీల విభాగంలో నేహా శర్మ ప్రథమ స్థానంలో నిలిచింది. 59 కేజీల విభాగంలో కోమల్ అగ్రస్థానం సాధించగా, 62 కేజీల విభాగంలో నేహా విజయం సాధించింది.

65 కేజీల విభాగంలో వైష్ణవి పాటిల్ మొదటి స్థానం కైవసం చేసుకోగా, 68 కేజీల విభాగంలో మాన్సీ లాథర్ అగ్రస్థానంలో నిలిచింది. మహారాష్ట్రకు చెందిన అమృత పూజారి 72 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలవగా, దీక్షా మాలిక్ 76 కేజీల విభాగంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.



వాణిజ్యం

# మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధికి ఊపు

## 7.8 శాతం జిడిపి వృద్ధి



### అసాధారణ ఘనత: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో సమస్యలు, ప్రపంచవ్యాప్త అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం జిడిపి వృద్ధిని సాధించడం ఒక "అసాధారణ ఘనత" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. తాజా జిడిపి గణాంకాలపై స్పందిస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య కూడా భారత్ బలమైన ఆర్థిక వృద్ధిని సాధించడంలో ప్రజల సమిష్టి శక్తి దోహదపడిందని ప్రధాని మోడీ అన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "ప్రపంచ అనిశ్చితి పరిస్థితుల నడుమ చమురు ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థ సమస్యలు ఉన్నప్పటికీ, మన ప్రజల సమిష్టి శక్తి భారత్ ఇటువంటి వృద్ధిని సాధించేలా చేసింది" అని ప్రధాన మంత్రి అన్నారు.

### సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌తో
## 50-60వేల ఉద్యోగాలు
### - కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** 'సెమికాన్ 2.0 పథకం'లోని ఆరు ప్రధాన విభాగాలకు సంబంధించిన నోటిఫికేషన్లను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ, భారతదేశ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు. 'ఇది భారతదేశ సెమీకండక్టర్ డిజైన్, తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. మొదటి 'సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్' ద్వారా వచ్చిన ఊపును కొనసాగిస్తూ, ఈ పథకం చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్ నుండి పరికరాలు, మెటీరియల్స్, పరిశోధన మరియు అభివృద్ధి, ప్రతిభ అభివృద్ధి వరకు సెమీకండక్టర్ విలువ గొలుసు అంతటా ఆర్థిక, మౌలిక సదుపాయాల మద్దతును అందిస్తుంది. కీలక రంగాలలో సాంకేతిక నాయకత్వాన్ని స్థాపించడం ద్వారా భారతదేశ ఆర్థిక వృద్ధిని, జాతీయ భద్రతను బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యం. " అని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

### ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ గుర్తింపు




**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధితో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ఈ వృద్ధి రేటుతో పోలికలో ఉన్న మిగతా అన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థల కంటే ఇది ముందుంది. మలేషియా, సింగపూర్‌లు వరుసగా 6.0శాతం, 5.9శాతం వృద్ధిని సాధించగా, ఇండోనేషియా 5.29శాతం, చైనా 4.3శాతం వృద్ధిని నమోదు చేశాయి. అమెరికా 2.1శాతం వృద్ధిని సాధించింది. చాలా పెద్ద యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలలో వృద్ధి రేటు సుమారు 1శాతం లేదా అంతకంటే తక్కువగా ఉంది. అన్ని ఆదాయ వర్గాలలో డిమాండ్ పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతూనే ఉంది. జులై నెల వాహన విపణి ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అధికారిక గణాంకాల ప్రకారం, దేశీయ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 4.58 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 34.3శాతం అధికం. ఇప్పటివరకు నమోదైన జులై నెలల్లో ఇదే అత్యంత బలమైన అమ్మకాలు. ఇది కేవలం ఆటోమొబైల్ షోరూమ్‌లకే పరిమితం కాదు. ఒక కారు కొనుగోలు ఉక్కు, టైర్లు, గాజు, ఎలక్ట్రానిక్స్, ఫైనాన్స్, బీమా, డీలర్‌షిప్‌లు, మరమ్మతులు, ఇంధన రిటైల్ రంగాలకు మద్దతు ఇస్తుంది. అమ్మకాలు ఈ వేగంతో పెరిగినప్పుడు, ఆ ప్రయోజనం సుదీర్ఘ దేశీయ సరఫరా గొలుసు ద్వారా ప్రయాణించి, పెద్ద కర్మాగారాలు, చిన్న వ్యాపారాలు రెండింటిలోనూ కార్యకలాపాలకు మద్దతు ఇస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రిటైల్ ట్రాక్టర్ అమ్మకాలు 28.1శాతం పెరిగి 1.17 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి, ఇది జులైలో అత్యుత్తమ రికార్డు. ట్రాక్టర్ ఒక ఉత్పాదక ఆస్తి. రైతులు సాధారణంగా మెరుగైన పంట అవకాశాలు, బలమైన నగదు ప్రవాహం, పెట్టుబడి పెట్టడానికి తగినంత విశ్వాసం ఉన్నప్పుడు దానిని కొనుగోలు చేస్తారని ఆ అధికారి పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాల రిటైల్ విభాగంలో అమ్మకాలు 28.3శాతం పెరిగి 18.18 లక్షల యూనిట్లకు చేరుకోగా, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 16.2శాతం పెరిగి 1.34 లక్షలకు చేరుకున్నాయి. ఈ రికార్డులు ఆర్థిక వ్యవస్థలో బలమైన గ్రామీణ కొనుగోలు శక్తిని, సులభమైన రవాణాను, వ్యాపారులు, డెలివరీ కార్మికులు, చిన్న రవాణా నిర్వాహకులకు మరిన్ని ఆదాయ అవకాశాలను సూచిస్తున్నాయి. వాహనాల అమ్మకాల పెరుగుదల విస్తృతి ముఖ్యంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. మొత్తం రిటైల్ రిజిస్ట్రేషన్లు 25.9శాతం పెరిగి 25.91 లక్షలకు చేరాయి. ప్రతి ప్రధాన వాహన విభాగం ఈ ఏడాది జులైలో అత్యంత బలమైన పనితీరును నమోదు చేసింది. పన్ను, చెల్లింపు, పవర్, ఇంధన డేటా ఇది కేవలం డీలర్‌షిప్ కథ మాత్రమే కాదని నిర్ధారిస్తున్నాయి. జులైలో జిఎస్‌టి ఆదాయం 15.4 శాతం, డిజిటల్ చెల్లింపుల పరిమాణం 16.6శాతం, లావాదేవీల విలువ 18.2శాతం పెరిగాయి. విద్యుత్ డిమాండ్ 10.7శాతం పెరిగింది. పెట్రోల్ వినియోగం 9.2శాతం, డీజిల్ వినియోగం 10 శాతం పెరిగాయి. ఈ గణాంకాలు రోజువారీ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన వివిధ అంశాలను సూచిస్తున్నప్పటికీ, అన్నీ ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజలు, వ్యాపార సంస్థలు గత యేడాది కంటే ఎక్కువగా కొనుగోళ్లు, చెల్లింపులు, ప్రయాణాలు, ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలు సాగిస్తున్నాయని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

**బ్యాంకింగ్‌లోనూ పురోగతి:**
వేగంగా సాగుతున్న బ్యాంకింగ్ రుణ కార్యకలాపాలు ఈ డిమాండ్‌కు అండగా నిలుస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం బ్యాంక్ రుణాల వృద్ధి గత దశాబ్ద కాలంలోనే అత్యధిక స్థాయిని నమోదు చేసింది. బ్యాంకింగ్ రంగంలో మరో కీలక మైలురాయి కూడా నమోదైంది. గత 14 ఏళ్లలో తొలిసారిగా రుణ వృద్ధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేట్ రంగ బ్యాంకులను అధిగమించాయి. ముఖ్యంగా, బ్యాంకుల ఆర్థిక స్థితి (బ్యాలెన్స్ షీట్లు) మెరుగుపడటం రుణాల పంపిణీకి దోహదపడుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.98 లక్షల కోట్ల వార్షిక నికర లాభాన్ని నమోదు చేశాయి, అలాగే వాటి స్థూల మొండి బకాయిల నిష్పత్తి చారిత్రాత్మక కనిష్ట స్థాయి అయిన 1.9శాతానికి తగ్గింది.

**పారిశ్రామిక ఉత్పత్తి 6.7శాతం పెరుగుదల:**
ఆర్డర్ల పెరుగుదలకు అనుగుణంగా భారతీయ పరిశ్రమలు స్పందిస్తున్నాయి. జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి 6.7 శాతం, తయారీ రంగ ఉత్పత్తి 7.3 శాతం పెరిగాయి. మొత్తం 23 తయారీ విభాగాలలో 19 విభాగాలు వృద్ధిని నమోదు చేశాయి. పెరిగిన ఈ ఆర్థిక కార్యకలాపాలకు అనుగుణంగా ఇంధన, లాజిస్టిక్స్ రంగాలు కూడా పురోగమిస్తున్నాయి. జులైలో 'కోల్ ఇండియా' బొగ్గు సరఫరా (ఆఫ్‌టేక్) 18.4 శాతం పెరిగి 64.19 మిలియన్ టన్నులకు చేరింది, ఇది ఆ నెలలో నమోదైన అత్యధిక స్థాయి. జులైలో రైల్వే సరుకు రవాణా 8.9 శాతం, ఓడరేవుల ద్వారా జరిగే సరుకు రవాణా 8.8 శాతం, విద్యుత్ ఉత్పత్తి 7.3 శాతం పెరిగాయి. ఎగుమతుల రంగం కూడా ఇదే సానుకూల ధోరణిని ధ్రువీకరిస్తోంది. జులైలో వస్తువుల ఎగుమతులు 19.6 శాతం పెరిగి 44.24 బిలియన్ డార్లకు చేరాయి, ఇది ఆ నెలలో నమోదైన అత్యధిక ఎగుమతి విలువ. ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు 17.7 శాతం, ఎలక్ట్రానిక్స్ 57.4 శాతం, రసాయనాల ఎగుమతులు 14.4 శాతం పెరిగాయి. దీని అర్థం, భారతీయ ఉత్పత్తిదారులు బలపడుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడమే కాకుండా, అధిక విలువ కలిగిన తయారీ ఉత్పత్తులతో సహా ప్రపంచ మార్కెట్లలో కూడా ఆర్డర్లను గెలుచుకుంటున్నారు. విదేశీ పెట్టుబడిదారులు దీర్ఘకాలిక మూలధనానికి మరో వనరును జోడిస్తున్నారు. ఏప్రిల్-జూన్ 2026లో స్థూల అంతర్గత ఎఫ్‌డిఐ సుమారు 30.7 బిలియన్లకు చేరుకుంది, ఇది 14.8 శాతం పెరుగుదల. గత కనీసం 15 సంవత్సరాలలో అత్యంత బలమైన త్రైమాసిక పెట్టుబడుల ప్రవాహంగా నమోదైంది.

### ఐటీ, మెటల్, రియల్టీ స్టాక్స్ మార్కెట్‌పై ఒత్తిడి
## స్టాక్ మార్కెట్‌లో నష్టాలు
### సెన్సెక్స్ 307 పాయింట్లు, నిఫ్టీ 95 పాయింట్లు నష్టం



**ముంబై, ఆగస్టు 31:** బలహీనమైన ప్రపంచ సంకేతాల మధ్య, ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కారణంగా భారత బెంచ్‌మార్క్ సూచీలు సోమవారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 307.24 పాయింట్లు లేదా 0.40 శాతం క్షీణించి 76,957.27 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 95.25 పాయింట్లు లేదా 0.39 శాతం పడిపోయి 24,080.40 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక దృక్పథంపై వ్యాఖ్యానిస్తూ, సమీప భవిష్యత్తులో ఈ సూచీ 24,180-24,200 స్థాయిల వైపు స్వల్పంగా వెనక్కి తగ్గే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. అయితే, 24,200 స్థాయికి పైన నిలకడగా కదలిక కొనసాగితే, అది సుమారు 100 పాయింట్ల అదనపు పెరుగుదలకు దారితీయవచ్చు. మరోవైపు, 23,990 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయి కంటే కిందకు నిలకడగా పడిపోతే, మార్కెట్‌లో దిద్దుబాటు మళ్లీ ప్రారంభం కావచ్చు అని మార్కెట్ విశ్లేషకుడు ఒకరు పేర్కొన్నారు. నిఫ్టీ సూచీలో ఐటిసి, భారతీ ఎయిర్‌టెల్, ఎటర్నల్ అతిపెద్ద నష్టాలుగా నిలిచి, బెంచ్‌మార్క్‌ను కిందకు లాగాయి. విశాల మార్కెట్‌లో పనితీరు మిశ్రమంగా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.74 శాతం క్షీణించింది. రంగాల వారీగా కూడా పనితీరు అస్థిరంగా ఉంది. నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఐటీ సూచీలు విశాల మార్కెట్ కంటే వెనుకబడ్డాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కీలకమైన అత్యుత్తమ ప్రదర్శనకారులుగా నిలిచి, మార్కెట్‌కు కొంత మద్దతును అందించాయి. బలహీనమైన ప్రపంచ సంకేతాలు, రంగాల వారీగా అమ్మకాల ఒత్తిడిని పెట్టుబడిదారులు గమనిస్తున్నందున, మొత్తం మార్కెట్ సెంటిమెంట్ అప్రమత్తంగా ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. "అమెరికా, ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను ఆందోళనలో ఉంచాయి. దౌత్యపరమైన పురోగతి అవకాశాలు సన్నగిల్లడంతో ముడి చమురు ధరలు, ప్రపంచ బాండ్ల రాబడులు పెరిగాయి" అని ఒక మార్కెట్ నిపుణుడు పేర్కొన్నారు. "పెరుగుతున్న ముడి చమురు ధరలు, బాండ్ల రాబడులు ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్ల వాతావరణంపై ఆందోళనలు మొదలయ్యాయి. ఇది ఆదాయాల చక్రంపై భారం మోపవచ్చు" అని పేర్కొన్నారు. జాక్సన్ హోల్ సదస్సులో ఫెడ్ ఛైర్ వార్ష్ చేసిన కఠిన వైఖరితో కూడిన వ్యాఖ్యల కారణంగా శుక్రవారం డాలర్‌ఇండెక్స్ పెరిగి రూపాయి విలువ ప్రారంభంలో తగ్గినప్పటికీ, ఆ తర్వాత భారత రూపాయి అద్భుతంగా పుంజుకుని ఆగస్టు 5 నాటి అత్యంత బలమైన స్థాయి వద్ద ముగిసింది. "సాంకేతిక కోణంలో చూస్తే, (డాలర్‌రూపాయి మారకం రేటు) ఒక నిర్దిష్ట పరిధిలోనే కదులుతూ, 95.50 వద్ద తక్షణ ప్రతిఘటనను, 94.90 వద్ద బలమైన మద్దతును

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14